ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 25.08.2025 | సంపుటి :12 సంచిక : 37 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370



సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


# ఇమడలేకపోతున్న ఈటల

## ఫాసిస్టు విధానాలతో కాషాయపార్టీలో పొసగలేని పరిస్థితి

### కీలక పదవులు ఆశించినా తరచూ శృంగభంగమే..





ఈటల రాజేందర్.. తెలంగాణ రాష్ట్రంలో పరిచయం అక్కర్లేని పేరు. ఓ దశలో ఆయన ముఖ్యమంత్రి అభ్యర్థి.. సొంత క్యాడర్‌తో గెలుస్తూ వస్తున్న హుజూరాబాద్ గడ్డ మీద ముఖ్య మంత్రికి సవాల్ చేసిన నేత. ఆయన్ని ఓడించేందుకు రాష్ట్ర యంత్రాంగం మకాం వేసి కోట్లు వెదజల్లినా గెలిచి నిలిచిన నాయకుడు. అలాంటి నాయకుడు బీజేపీలో చేరాక రాజకీ యంగా కొంత ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నారు. నిజం చెప్పాలంటే ఆ పార్టీలో ఈటల రాజేందర్ ఇమడ లేకపో తున్నారు. సొంతంగా పార్టీ పెట్టేంత శక్తిసామ ర్థ్యాలున్నా ఆయన బీజేపీనే నమ్మి వచ్చాడు. అయినా బీజేపీలో ఆయనకు తగిన న్యాయం దక్కడం లేదన్నది కాదనలేని నిజం..!

- హుజురాబాద్‌లో రాజేందర్ అనుచరులకు పదవులుండవంటూ కేంద్ర మంత్రే స్వయంగా నిందలు
- రాంచందర్ రావు అధ్యక్ష బాధ్యతల స్వీకరణలోనూ ఈటల విద్యార్థి పూర్వాశ్రమంపైనా విమర్శలు
- అవమానాలు భరించలేని స్థితిలో తిరిగి సొంత గూటికా..? లేక కాంగ్రెస్‌లోకా..?
- అప్పుడు కూడా నమ్మొచ్చిన ఏనుగు రవీందర్, తుల ఉమ ఎప్పుడో పీచేముడ్..!
- మహిళా నేతకు అసెంబ్లీ టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి లాగేసారు
- బీజేపీలో బీసీలకు అన్యాయం జరుగుతుందనే భావనలో ఈటల వర్గం
- సీక్రెట్‌గా తన అనుచరుల వద్ద మల్కాజిగిరి ఎంపీ మంతనాలు!

హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి (జనంసాక్షి) :

మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ కు బీజేపీ పార్టీ తెలంగాణ అధ్యక్ష పగ్గాలు వస్తున్నాయంటూ ఇటు సోషల్ మీడియాలో, అటు అభిమానుల వాట్సప్ స్టేటస్ లో మార్మోగింది. ఈటల పుట్టినరోజు సందర్భంగా కానుకగా ఇస్తున్నారనే ప్రచారం జోరుగా సాగింది. హుజురాబాద్ నియోజకవర్గ బీజేపీ పార్టీ శ్రేణులు, ఈటల అభిమానులు హైదరాబాద్ షామీర్పేట్‌లోని ఈటల నివాసానికి పెద్దఎత్తున అభిమానులు చేరుకుని సంబరాలకు ఏర్పాట్లు సైతం చేశారు. కానీ అధిష్టానం అధ్యక్ష పదవిని రాంచందర్‌రావుకు కట్టబెట్టడంతో మరోసారి ఆయనకు నిరాశ తప్పలేదు. అయితే రామచంద్రరావు అధ్యక్ష బాధ్యత స్వీకరణ కార్యక్రమంలో ఈటల విద్యార్థి పూర్వాశ్రమమైన పీడీఎస్ యూపైనా కాషాయ ముఖ్య నేతలు విమర్శలు గుప్పించడం గమనార్హం. గతంలోనే తనను నమ్మి వచ్చిన ఏనుగు రాజేందర్, తుల ఉమ విషయంలో ఈటెల ఏమీ చేయలేకపోయారని అభిప్రాయాలున్నాయి. వేములవాడ అసెంబ్లీ టికెట్ తుల ఉమకు ఇచ్చినట్టే ఇచ్చి బిజెపి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. అక్కడా ఈటెల రాజేందర్, ఆయన వర్గీయులు తమకు అవమానం జరుగుతోందంటూ మదనపడ్డారు. ఇటీవలే కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా హుజురాబాద్ నియోజకవర్గంలోని ఈటల రాజేందర్ అనుచరులకు ఎలాంటి పదవులు ఉండవని సమావేశంలో ప్రకటించడం సంచలనమైంది. దీంతో ఈటల రాజేందర్ కు ఆ పార్టీలో ఎలాంటి ప్రాధాన్యత దక్కడం లేదని బహిర్గతమైనట్టు విశ్లేషకులు భావిస్తున్నారు.



**బండి సంజయ్ వర్సెస్ రాజేందర్**

హుజురాబాద్ లో ఇప్పటికే ఏడుసార్లు అసెంబ్లీకి మెజారిటీతో గెలిచి వెళ్లి ఇప్పుడు మల్కాజిగిరి ఎంపీగా గెలుపొందడమే కాకుండా వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో తెలంగాణ గళాన్ని వినిపించి, తెలంగాణ ఉద్యమంలో మిగతా 2లో..



## గగనతలంలో మరోసారి సత్తాచాటిన భారత్

**అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించాం: రాజ్‌నాథ్ సింగ్**

భువనేశ్వర్(జనంసాక్షి):భారత్ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ ఆయుధ వ్యవస్థను పరీక్షించినట్లు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. డీఆర్‌డీవో దీనిని అభివృద్ధి చేసింది. మిగతా 2లో..



## గగన్‌యాన్ మిషన్‌లో మరో ముందడుగు

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ అంతరిక్ష ప్రాజెక్టులో ఇస్రో మరో ముందడుగు వేసింది. క్రూ మాడ్యూల్‌కు సంబంధించిన తొలి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ ను విజయవంతంగా నిర్వహించింది. వాయుసేన, నౌకాదళం, డీఆర్డీవో, కోస్ట్‌గార్డ్‌ల సంయుక్త మిగతా 2లో..

## బీహార్ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఇద్దరు పాకిస్థానీలు

**చర్యలకు ఉపక్రమించిన కేంద్ర హోంశాఖ**



2 లో..

# బయోడిజైన్‌తో వైద్య ఉత్పత్తుల్లో విప్లవం

## లైఫ్‌సైన్సెస్, , మెడికల్ టెక్నాలజీ హబ్‌గా తెలంగాణ:సీఎం రేవంత్‌రెడ్డి



## సినీపరిశ్రమకు సహకరిస్తాం


**పలువురు సినీ నిర్మాతలు, దర్శకులకు సీఎం రేవంత్ హామీ**

2 లో..

హైదరాబాద్(జనంసాక్షి):

బయోడిజైన్స్, లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఒక ముఖ్యమైన కేంద్రంగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో ఆసియా-పసిఫిక్ బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్-2025 ఘనంగా జరిగింది. ఈ సమ్మిట్‌కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బయోడిజైన్స్‌కు ఒక గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. తెలంగాణను 2047 నాటికి భారతదేశంలో ఒక ముఖ్యమైన ఆర్థిక శక్తిగా మార్చడమే లక్ష్యంగా "తెలంగాణ రైజింగ్ 2047" నినాదంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. 2047 నాటికి భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతుందని, అప్పటికి మన దేశం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ విభాగంలో తెలంగాణ హబ్‌గా మిగతా 2లో..

# ఈ దేశ బలం.. భిన్నత్వంలో ఏకత్వం



## ప్రజాస్వామిక సూత్రాన్ని రక్షించుకోవడం చాలా అవసరం

- రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయ్..
- కేవలం మున్సిపాలిటీ హోదాకు తగ్గించే ప్రమాదం ఉంది
- సవాళ్లు ఎదురవుతున్నా ఎంకే స్టాలిన్ సమాఖ్యవాదంవైపే నిలిచారు
- తమిళనాడు ప్రగతిశీల పాలన స్ఫూర్తిదాయకం
- చెన్నైలో ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి
- మద్దతు ఇచ్చిన స్టాలిన్‌కు, ఇండియా కూటమికి కృతజ్ఞతలు
- అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే అమిత్‌షా ఆరోపణలు: స్టాలిన్

చెన్నై, ఆగస్ట్ 24 (జనంసాక్షి) :

విద్యా, వైద్యం, సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో తమిళనాడు రాష్ట్రం దేశానికి ఓ నమూనాగా నిలుస్తోందని, మానవ హక్కుల పరిరక్షణలోనూ ప్రగతిశీల పాలనను కొనసాగి స్తోందని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రజా స్వామిక సూత్రాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంత్కెనా ఉందని స్పష్టం చేశారు. ఆదివారం చెన్నైలో పర్య టించిన ఆయన.. ఇండియా కూటమి నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతిగా తనకు మద్దతు తెలపాలని వివిధ పార్టీల ఎంపీలను మిగతా 2లో..



# దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి

## పార్టీ మారిన ఎమ్మెల్యేలకు కేటీఆర్ సవాల్



- తన 20 నెలల పాలన చూపించి ఉపఎన్నికలకు వెళ్లగలిగే ధైర్యం సీఎం రేవంత్‌కు ఉందా?
- కేసీఆర్ హయాంలో జోడెద్దుల్లా దూసుకుపోయిన అభివృద్ధి, సంక్షేమం
- నేడు హైడ్రా అరాచకాలతో హైదరాబాద్ అభివృద్ధి అతలాకుతలం
- శేరిలింగంపల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్‌ఎస్ నేత

2 లో..

శేరిలింగంపల్లి(జనంసాక్షి):పార్టీ మారిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, దమ్ముంటే ఉప ఎన్నికల్లో పోటీ చేసి తిరిగి గెలవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. రేవంత్ తన 20 నెలల పాలనలో తెలంగాణ ప్రజలకు చేసిన మంచిని చూపించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో పార్టీ మిగతా 12లో..

భార్యను ముక్కలుగా చేసి

## మూసీలో పడేసి..

**మీర్‌పేట ఘటన తరహాలో మరో దారుణం**

**మనస్పర్ధలతో భార్యను కిరాతకంగా హత్య చేసిన భర్త**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లో చోటు చేసుకున్న ఘటన**



11 లో..



# సురవరంకు లాల్‌సలాం

## ముగిసిన అంతిమయాత్ర



- గాంధీ మెడికల్ కాలేజీకి భౌతికకాయం అప్పగింత
- పేదల కోసం పోరాడిన గొప్ప నేత సురవరం సుధాకర్‌రెడ్డి
- నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సుధాకర్‌రెడ్డితో నాకు సుదీర్ఘ రాజకీయ సంబంధాలు ఉన్నాయి
- మేమిద్దరం కలిసి ఎన్నో పోరాటాలు చేశాం: ఏపీ సీఎం చంద్రబాబు

హైదరాబాద్(జనంసాక్షి):కమ్యూనిస్టు దిగ్గజం సు రవరం సుధాకర్‌రెడ్డి అంతిమయాత్ర ముగిసింది. ప్రభుత్వ అధికారిక లాంఛనాల అనంతరం మగ్దూం భవన్ నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర..గాంధీ మెడికల్ కళాశాల వరకు కొనసాగింది. మగ్దూం భవన్ వద్ద గౌరవ సూచకంగా పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు.అనంతరం భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కళాశాలకు ఆయన కుటుంబ సభ్యులు అప్పగించారు. 'కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి అమర్ రహే' అంటూ నాయకులు మిగతా 2లో..

# బయోడిజైన్‌తో వైద్య ఉత్పత్తుల్లో విప్లవం

మారిందని, సుల్తాన్‌పూర్‌లో భారత్‌లోనే అతిపెద్ద మెడికల్ డివైజ్ పార్కును ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుల్తాన్‌పూర్ పార్కులో 60కి పైగా కంపెనీలు ఉన్నాయని, ఇక్కడ ఇంప్లాంటేషన్లు, వైద్య పరికరాలు తయారు చేస్తున్నారని చెప్పారు. మన సామర్థ్యం, తెలివితేటలను ప్రజల కోసం ఉపయోగించుకోవాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. దీనికి తోడు, పరిశోధనల కోసం ప్రభుత్వం మెడికల్ డేటాను కూడా అందిస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పుడు టారిఫ్‌లు, వ్యాపార సమస్యలు, యుద్ధాలతో ప్రపంచం సతమతమవుతున్నప్పటికీ, ఇది ఇన్నోవేటర్స్, స్టార్టప్‌లు ఏర్పాటు చేసుకోవడానికి సరైన సమయం అని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సినీ పరిశ్రమకు సహకరిస్తాం

**పలువురు సినీ నిర్మాతలు, దర్శకులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ**



**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రభుత్వం నుంచి సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పలువురు సినీ నిర్మాతలు, దర్శకులు కలిశారు. కార్మికుల సమ్మె పరిష్కారానికి సహకరించిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. " సినిమా పరిశ్రమలో పని వాతావరణం బాగుండాలి. త్వరలో సినీ కార్మికులను కూడా పిలిచి మాట్లాడతా. పరిశ్రమలోకి కొత్తగా వచ్చే వారికి నైపుణ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలి. నైపుణ్యాల పెంపు కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. స్కిల్ యూనివర్సిటీలో సినీ పరిశ్రమ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం. పరిశ్రమలో వివాదం వద్దనే కార్మికుల సమ్మె విరమణకు చొరవ చూపించాను" అని సీఎం అన్నారు.తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాతలు అల్లు అరవింద్, డి.సురేష్ బాబు, జెమిని కిరణ్, స్రవంతి కిషోర్, నవీన్ ఎర్నేని, వంశీ, బాపినీడు, డీవీవీ దానయ్య, చెరుకూరి సుధాకర్, సాహు, అభిషేక్ అగర్వాల్, విశ్వప్రసాద్, అనిల్ సుంకర, శరత్ మరార్, ఎన్వీప్రసాద్, దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, బోయపాటి శ్రీను, సందీప్‌రెడ్డి వంగా, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, వెంకీ కుడుముల తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

### తెలంగాణ ప్రభుత్వానిది

# మొద్దునిద్ర

**రాష్ట్రంలో పారిశుద్ధ్యం లోపించింది**

**- విషజ్వరాలు ప్రబలుతున్నా పట్టని సీఎం : హరీశ్‌రావు**

**జగదేవ్‌పూర్(జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్ రావు పర్యటించారు. వైరల్ జ్వరాలతో చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన మహేశ్ (35), శ్రవణ్ (15) కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశుద్ధ్యం లోపించిందని, ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని విమర్శించారు. తిమ్మాపూర్‌లో డెంగీ జ్వరాలతో ఇద్దరు చనిపోయారన్నారు. మరో 40 నుంచి 50 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. గ్రామాలకు నిధులు లేక పంచాయతీ సెక్రటరీలు సమ్మె నోటీసు ఇచ్చారని పేర్కొన్నారు.

### ఐఏఎఫ్, కాక్‌పిట్‌లే

# నా గురువులు

**వాటి నుంచే అంతరిక్ష యాత్రకు అవసరమయ్యే చాలా విషయాలు నేర్చుకున్నా:శుభాంశు శుక్లా**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నేర్పిన మెలకువల వల్లే తాను అంతరిక్ష యాత్రకు వెళ్లగలిగానని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా పేర్కొన్నారు. యాత్రకు కావాల్సిన శిక్షణను ఇచ్చినందుకు ఐఏఎఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన జీవితంలో ముఖ్యమైన గురువులు ఐఏఎఫ్, కాక్‌పిట్ మాత్రమేనని పేర్కొన్నారు. వాటి నుంచే అంతరిక్ష యాత్రకు అవసరమయ్యే చాలా విషయాలు నేర్చుకున్నానన్నారు. భవిష్యత్తులో భారత్ చేపట్టనున్న గగన్‌యాన్ ప్రాజెక్టుపై ప్రపంచం మొత్తం ఆసక్తి కనబరుస్తోందని.. చాలామంది శాస్త్రవేత్తలు ఇందులో భాగం కావడానికి ఆసక్తి చూపిస్తున్నారన్నారు. అంతరిక్షం నుంచి భారత్ ఎంతో అందంగా కనిపిస్తుందని గుర్తు చేసుకున్నారు. జీవితంలో తాను చూసిన అద్భుత దృశ్యాలలో అదీ ఒకటన్నారు. ఆత్మనిర్భర్ భారత్ దిశగా దేశం లిఖిస్తున్న అధ్యాయానికి గగన్‌యాన్ మిషన్ మొదటి అడుగని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. మన దేశం నుంచి అంతరిక్షంలోకి వెళ్లి.. పెసలు, మెంతులు వంటి వాటిని పండిస్తారని తానెప్పుడూ ఊహించలేదన్నారు. వ్యవసాయ ఆధారిత దేశమైన భారత్‌కు చెందిన శుభాంశు అంతరిక్షంలో రైతుగా మారారని అన్నారు. ఐఎస్ఎస్‌లో గాజు పాత్రల్లో మెంతి, పెసర విత్తనాలను వేసి..జీరో గ్రావిటీలో అవి ఏ విధంగా మొలకెత్తుతాయనే విషయాన్ని అధ్యయనం చేశారని గుర్తు చేశారు. భవిష్యత్తులో భారత్ చేపట్టబోయే అంతరిక్ష యాత్రలకు ఆయన అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని వెల్లడించారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు.. గగన్‌యాన్ యాత్ర కీలకపాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్ విశ్వాసం వ్యక్తంచేశారు. మోదీ పాలనలో భారత్ అన్ని రంగాల్లో ముందుకు వెళ్తూ..అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుస్తోందన్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ భారత్‌వైపే చూస్తున్నాయని..న్యూఢిల్లీతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని కోరుకుంటున్నాయని అన్నారు. కాగా 2040 నాటికి భారతీయ వ్యోమగామిని చందమామ పైకి పంపడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.

# ఇమడలేకపోతున్న ఈటల

కీలక నేతగా ఎదిగి కొత్తగా ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ ప్రభుత్వంలో రెండుసార్లు మంత్రి పదవి పొంది సీనియర్, కేసీఆర్ తర్వాత పార్టీలో అంత అనుభవం ఉన్న నాయకునిగా ఎదిగి అంతటి చరిష్మా గల నాయకుడిగా పేరున్న ఆయనకు తగిన పదవి బీజేపీలో దక్కలేదు. ఇదిలా ఉంటే బీజేపీ ఎంపీ ఈటల , బండి సంజయ్‌పై బహిరంగంగా తీవ్ర పదజాలంతో చేసిన విమర్శలు పార్టీలో కలకలం సృష్టించాయి. బీజేపీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఉద్యమనేతగా, విశేష రాజకీయ అనుభవం ఉన్న నేతగా గుర్తింపు ఉన్న ఈటల.. ఏ లక్ష్యంతో సంజయ్‌పై బహిరంగంగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారన్న అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. శామీర్‌పేటలో జరిగింది అసమ్మతి సమావేశమా? లేక కీలక పదవి కోసం జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చే లక్ష్యం తో ఈటల ఎత్తువేశారా? అని చర్చించుకున్నారు. బండి సంజయ్‌కి, ఈటలకు మధ్య విభేదాలు పరాకాష్టకు చేరాయని కొద్దిరోజుల క్రితం విస్తృత ప్రచారం జరిగినా, ఎక్కడ కూడా ఇద్దరు నేతలు ఇప్పటివరకు బహిరంగంగా ఆరోపణలు, విమర్శలు చేసుకోలేదు. కానీ, ఈటల ఒక్కసారిగా సంజయ్‌పై విరుచుకుపడ్డ తీరు మాత్రం పార్టీ నేతలను విస్మ యానికి గురిచేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ స్థానాల్లో పోటీచేసి ఓటమి చవిచూసిన ఈటల.. ఆ తర్వాత మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా గెలిచారు. అయితే ఆ తరువాత కేంద్ర మంత్రి పదవిని ఆశించి భంగపడ్డారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేసుకున్నా ఫలితం దక్కలేదు. బండి సంజయ్ వల్లే తనకు ఈ పదవి దక్కలేదన్న భావనతో ఈటల ఉండిపోయారని ఆయన వర్గీయు లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సంజయ్‌పై పరోక్షంగా తీవ్ర విమర్శలు చేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రమంత్రి సంజయ్‌పై ఈటల చేసిన విమర్శలపై బీజేపీ జాతీయ నాయకత్వం ఆరా తీసింది. ఆయన ప్రసంగించిన వీడియో క్లిప్పింగ్‌లను, ఆయన వ్యాఖ్యల అనంతరం స్థానికంగా వ్యక్తమైన స్పందనలతో కూడిన ఒక నివేదికను రాష్ట్రపార్టీ జాతీయ నాయకత్వానికి పంపించిందని బీజేపీ వర్గాలు తెలిపాయి. సొంత పార్టీ నేతను అసభ్య పదజాలంతో దూషించడం, మల్కాజ్‌గిరి ఎంపీగా ఉంటూ.. పార్టీని సంప్రందిం చకుండా 'హుజూరాబాద్ లో పాగా వేస్తా.. మండలాలవారీగా ఆఫీసులు తెరుస్తా. గెలిపించుకుంటా' అనడం ద్వారా పార్టీ లైన్‌ను క్రాస్ చేశారన్న వాదన కూడా పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. హూజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు కూడా.. పార్టీ కంటే తమకు ఈటలే ముఖ్యమన్న అభిప్రాయాన్ని చెప్పినట్లుగా ఉన్నాయని బీజేపీవర్గాలు అంటున్నాయి. "అసలు హూజూరాబాద్ లో బీజేపీయే లేదు. 10 ఓట్లు కూడా రావు. కాషాయ జెండాతో మాకు పనిలేదు. ఈటలే మాకు ముఖ్యం. ఆయనే రావాలి" అంటూ ఆయన అనుచరులు చేసిన వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి

## బీసీ బిడ్డను అవమానపరుస్తున్న 'కమలనాథులు'

నిజానికి ఈటల రాజేందర్ ముక్కుసూటి నాయకుడు. ఆయన రాజకీయ జీవితంలో కక్షపూరితంగా ఎవరిపైనా ఒక్క మాటా మాట్లాడిన నేపథ్యం ఉండదు. ఆయన ముందు నుంచి లెఫ్ట్ భావజాలం ఉన్న నాయకుడు. లౌకికవాదిగా ఆయన ఉన్నది ఉన్నట్టు మాట్లాడే నైజమే ఇప్పుడు ఆయన్ని ఆ పార్టీలో ఇమడకుండా చేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నా రు. ఇటీవల కులగణన అంశం మీద బీజేపీ తీసుకున్న స్టాండ్ సైతం ఈటల రాజేందర్‌కు మింగుడుపడని విషయంగా మారినట్టు సమాచారం. స్వయంగా ముదిరాజ్ కమ్యూనిటీకి చెందిన నాయకునిగా మంచి పేరున్న ఈటల రాజేందర్ బీసీలకు అన్యాయం జరుగుతుందన్న భావనలో ఉన్నట్టు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగానే బీసీ సీఎం నినాదాన్ని పార్టీ జాతీయ నాయకత్వం ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు దక్కలేదు. మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచాక ఆయనకు చేరికల కమిటీ కన్వీనర్‌గానూ, లోక్‌సభలో ఆఫీస్ ఆన్ ప్రాఫిట్ కమిటీ చైర్మన్‌గా నియమించింది. హుజూరాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఈటల అనుచరులుగా చెప్పుకుంటున్న వారే 60 శాతం పార్టీ పదవుల్లో ఉన్నారని ఆ పార్టీ జిల్లా నేతల వాదన వినిప్పిస్తున్నారు. అయినా తమకు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడం లేదని, తమ నాయకుడు ఈటల రాజేందర్‌ను అణిచివేస్తున్నారని ఆయన అనుచరులు ప్రచారం చేయడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. సొంత పార్టీలోనే ఇలా కేంద్ర మంత్రి నుంచి కార్యకర్తల వరకు తనకు సంబంధం లేని విషయాల్లోనూ ఈటలను బదనాం చేస్తున్నారని అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన తిరిగి సొంత గూటికి, లేక కాంగ్రెస్‌లోకి వెళ్లడమా? అని కార్యకర్తలతో అంతర్గతంగా మాట్లాడుతున్నట్టు భోగట్టా.

# సురవరంకు లాల్‌సలాం

నినాదాలు చేశారు. అంతిమయాత్రలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి.. శుక్రవారం రాత్రి హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివ దేహానికి సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. మఖ్దూం భవన్‌కు వెళ్లి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పేదలు, బహుజనుల కోసం పోరాడిన గొప్ప నేత సురవరం సుధాకర్‌రెడ్డి అని అన్నారు. రాజీపడని సిద్ధాంతాలతో రాజకీయాల్లో ఎదిగిన నేత అని గుర్తు చేసుకున్నారు. "విద్యార్థి దశ నుంచి జాతీయ స్థాయి నేతగా సురవరం ఎదిగారు. పాలమూరు జిల్లా బిడ్డ జాతీయ స్థాయి నేతగా ఎదగటం గర్వకారణం. పాలమూరు జిల్లాకు వన్నె తెచ్చిన గొప్పనేతల్లో ఆయన ఒకరు. అధికారం ఉన్నా.. లేకున్నా తన సిద్ధాంతాలను ఎప్పుడూ వీడలేదు. సురవరం కుటుంబానికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. ఆయన జ్ఞాపకార్థం ప్రభుత్వం ఏదైనా మంచి కార్యక్రమం చేపడుతుంది. దీనిపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఈ ప్రభుత్వం గొప్ప నేతల పేర్లను పలు సంస్థలకు పెట్టింది. సురవరం సుధాకర్‌రెడ్డి సేవలను అందరూ స్మరించుకునేలా చేస్తాం" అని రేవంత్ రెడ్డి అన్నారు. సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివ దేహానికి ఏపీ సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌కు ఆయన వెళ్లారు. సురవరం సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజల కోసం చేసిన సేవలను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. సుధాకర్‌రెడ్డితో తనకు సుదీర్ఘ రాజకీయ సంబంధాలు ఉన్నాయన్నారు. గతంలో కలిసి పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. సురవరం దేశ రాజకీయాల్లోనూ ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా సేవలందించారని తెలిపారు. దిల్లీలో వివిధ ప్రభుత్వాలు ఏర్పాటు చేసినప్పుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేసిన ఉద్యమంలో, ఇతర అనేక సందర్భాల్లో కలిసి పోరాడినట్లు వివరించారు. "నేనంటే సుధాకర్‌రెడ్డికి ప్రత్యేక అభిమానం ఉండేది అని అన్నారు.

# ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ సాయం

**మరో 3,350 క్షిపణులు పంపనున్న ట్రంప్**

**వాషింగ్టన్(జనంసాక్షి):** ఉక్రెయిన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మరో 3,350లకు పైగా ఎక్స్‌టెండెడ్ రేంజ్ అటాక్ మ్యూనిషన్ క్షిపణులను ఆ దేశానికి అందించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆయుధ ప్యాకేజీకి యూరోపియన్ దేశాలు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపాయి. దాదాపు ఆరు వారాల్లో ఈ క్షిపణులు కీవ్‌కు చేరుకుంటాయని సమాచారం. అయితే 240 నుంచి 450 కి.మీ పరిధి కలిగిన ఈఆర్ఏఎమ్ క్షిపణులను రష్యాపైకి ప్రయోగించాలంటే ఉక్రెయిన్ పెంటగాన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అమెరికా అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. మరోవైపు రష్యా భూభాగంలోని లక్ష్యాలను ఛేదించడానికి అమెరికా రూపొందించిన లాంగ్-రేంజ్ ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్స్‌ను వినియోగించకుండా పెంటగాన్ అడ్డుకుంటున్నట్లు పలు నివేదికలు సూచిస్తున్నాయి. మాస్కో చేపడుతున్న దాడులకు దీటుగా ఆయుధాలను ఉపయోగించకుండా కీవ్ సామర్థ్యాన్ని పరిమితం చేస్తోందని పేర్కొన్నాయి. యుద్ధం ముగింపునకు తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఇరుదేశాల నేతలు ముందడుగు వేస్తుండకపోవడంతో ట్రంప్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీవ్‌కు సహాయంగా అగ్రరాజ్యం పలుమార్లు పెద్ద మొత్తంలో ఆయుధ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌కు 32.2 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, అత్యాధునిక క్షిపణులు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని అమెరికా చట్టసభకు తెలియజేశామని విదేశాంగ శాఖ తెలిపింది. ఇందులో 15 కోట్ల డాలర్లు అమెరికా ఇప్పటికే అమ్మిన ఆర్మర్డ్ వాహనాల నిర్వహణకు, 17.2 కోట్ల డాలర్లు ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు వినియోగిస్తారు. ఉక్రెయిన్ దారుణమైన దాడులకు గురవుతున్న కారణంగా కీవ్‌కు మరిన్ని ఆయుధాలు పంపుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో మరోసారి క్షిపణులను అందజేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

# 'గేట్' దరఖాస్తు తేదీల్లో మార్పు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో వచ్చే ఏడాది ప్రవేశాలకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ పరీక్షకు షెడ్యూల్ ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే.అయితే, ఈ పరీక్ష సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల తేదీల్లో మార్పు చోటుచేసుకుంది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం రేపట్నుంచే (ఆగస్టు 25) దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా.. తాజా నిర్ణయం ప్రకారం ఆగస్టు 28 నుంచి 28వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐఐటీ గువాహటి ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ మేరకు బుక్‌లెట్‌లోనూ మార్పులు చేసింది. ఆలస్య రుసుంతో అక్టోబర్ 9 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. దరఖాస్తు కోసం ఒక్కో టెస్ట్ పేపర్‌కు మహిళలు/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులైతే.. ?1000, ఇతర కేటగిరీలు, విదేశీ విద్యార్థులు రూ.2000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. కేటగగిరీ, టెస్ట్ పేపర్, ఎగ్జామ్ సిటీ మార్పు, కొత్త టెస్ట్‌పేపర్ జతచేసుకోవడం, వ్యక్తిగత వివరాలను మార్చుకొనేందుకు (అదనపు ఫీజుతో) నవంబర్ 6వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపింది. అడ్మిట్ కార్డులను జనవరి 2న విడుదల చేయనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7, 8, 14, 15 తేదీల్లో (శని, ఆదివారాల్లో) దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో గేట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్ష మూడు గంటల పాటు జరగనుంది. ఫలితాలు మార్చి 19న విడుదల చేస్తారు. ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్ష మూడు గంటల పాటు జరగనుంది. ఫలితాలు మార్చి 19న విడుదల చేస్తారు. స్కోర్ కార్డులను మార్చి 27 నుంచి మే 31వరకు ఉచితంగా అందుబాటులో ఉంచుతారు. ఒకవేళ ఏవైనా అసాధారణ పరిస్థితులు ఎదురైతే.. ఈ తేదీలు మారే అవకాశం ఉండొచ్చు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులే. అందువల్ల, దరఖాస్తు చేసే ముందు అభ్యర్థులు ఈ పరీక్షకు అర్హతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నారో, లేదో గేట్ అధికారిక వెబ్‌సైట్‌లో నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి ఒక దరఖాస్తు మాత్రమే చేయాలి. ఒకవేళ రెండు పేపర్లు రాయాలనుకుంటే.. ఒకే ఫారమ్‌లో దాన్ని పేర్కొనాల్సి ఉంటుంది. ఒకటికంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పిస్తే తిరస్కరిస్తారు. వాటికి చెల్లించిన ఫీజును రిఫండ్ చేయరు. గేట్ స్కోర్‌ను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు సైతం పరిగణనలోకి తీసుకుంటారు. ఐఐటీలు గేట్ స్కోర్‌తో నేరుగా పీహెచ్‌డీలో కూడా ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

# ఈ దేశ బలం.. భిన్నత్వంలో ఏకత్వం



కోరారు. 52 సంవత్సరాల పాటు రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నానని, ఇప్పుడు అవకాశం ఇస్తే మళ్లీ దాని విలువలను పరిరక్షించేందుకు కృషి చేస్తానని అన్నారు. తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్, ఇండియా కూటమి నాయకులు మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ.. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని హామీనిచ్చారు. తన జీవితకాలంలో మరొకసారి రాజ్యాంగ రక్షణ కోసం పాటుపడటం, అందుకు అవకాశం లభించడం గర్వంగా భావిస్తున్నానని చెప్పారు.అధికారం ఒక్కచోట కేంద్రీకృతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆందోళన వెలిబుచ్చారు. అయితే ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ ఎంకె స్టాలిక్ సమాఖ్యస్ఫూర్తి లక్ష్యానికి కట్టుబడి ఉన్నారని అభినందించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేందుకు జీఎస్టీ విధానాల్లో మార్పులు తిరిగి రూపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఆయన ఎత్తిచూపారు. ఇది రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి తీవ్రమైన ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. రాష్ట్రాలను కేవలం మున్సిపాలిటీల హోదాకు తగ్గించే ప్రమాదం ఉందన్నారు. ఇది సమాఖ్యావాదాన్ని ప్రమాదంలో పడేయడమేగాకుండా రాజ్యాంగ మూలాలను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దేశం బలం బిన్నత్వంలో ఏకత్వమని సుదర్శన్ రెడ్డి పునరుద్ఘాటించారు. అనేక రాష్ట్రాల కలయికతో భారతదేశం నిర్మితమైందని గుర్తుంచుకోవాలన్నారు. ఇది రాజ్యాంగం ఐక్యతను ప్రతిబింబిస్తోందని చెప్పారు. ఇలాంటి మహోన్నతమైన ప్రజాస్వామిక సూత్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు మరొకసారి పునరంకితమవుతానని ఈ సందర్భంగా ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి హామీనిచ్చారు.ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే రాజ్యాంగాన్ని పరిరక్షించడమే తన ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు.



## అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే అమిత్‌షా ఆరోపణలు: స్టాలిన్



నక్సలిజంపై ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని కేంద్ర మంత్రి అమిత్ షా లక్ష్యంగా చేసుకోవడాన్ని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఖండించారు. కేంద్రం ఈ సమస్యను పరిష్కరించలేకపోయిందని, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఆయన్ను లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. ఉప రాష్ట్రపతి పదవికి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పూర్తి అర్హత కలిగిన వ్యక్తి అని స్టాలిన్ పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో డీఎంకే, మిత్రపక్షాల మద్దతు కోరుతూ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి చెన్నైలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సీఎం స్టాలిన్ ప్రసంగించారు. కేవలం ఇండియా కూటమి నేతలే కాకుండా.. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న వారందరూ జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డినే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా అంగీకరించారన్నారు. ఆయన తన జీవితాన్ని న్యాయవ్యవస్థకు అంకితం చేశారని, రాజ్యాంగ గౌరవాన్ని నిలబెట్టారని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు భాజపా యత్నిస్తున్న నేపథ్యంలో.. దానిని కాపాడేందుకు ఆయన అవసరం ఉందని చెప్పారు. అమిత్ షా వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. కేంద్ర హోంశాఖ మంత్రి తన బాధ్యతను మరచి.. ఆయనపై అన్యాయమైన ఆరోపణలు చేశారని విమర్శించారు. భాజపా ప్రభుత్వం నక్సలిజాన్ని అంతం చేయలే కపోయిందని అందుకే తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఆయన్ను నిందించేందుకు యత్నిస్తోందన్నారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకునేందుకు దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తోందని ఆరోపించారు.

# శ్రీశైలానికి స్థిరంగా వరద..

**10 గేట్లు ఎత్తి నీటి విడుదల**

**సున్నిపెంట(జనంసాక్షి):** శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 4,71,386 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 5,05,150 క్యూసెక్కులుగా ఉంది.పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 21,775 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 10 స్పిల్‌వే గేట్లను 18 అడుగుల మేర ఎత్తి 4,18,060 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881.50 అడుగుల మేర నీరు ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలకు గానూ.. ప్రస్తుతం 196.11 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# గగనతలంలో మరోసారి సత్తాచాటిన భారత్

సమీకృత గగనతల రక్షణ వ్యవస్థను 23వ తేదీ అర్ధరాత్రి ఒడిశా తీరం నుంచి డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. ఇది బహుళ అంచెల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ. దీనిలో భారత్‌లో అభివృద్ధి చేసిన క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజి ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ మిసైల్స్, హైపవర్ లేజర్ ఆధారిత డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ ఉన్నాయి. దీనిని విజయవంతంగా అభివృద్ధి చేసినందుకు డీఆర్డీవో సైనిక దళాలను నేను అభినందిస్తున్నాను. ఈ ప్రత్యేకమైన పరీక్ష బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని తెలియజేసింది. శత్రువులు ప్రయోగించే గగనతల ఆయుధాల నుంచి ఆయా ప్రాంతాల రక్షణను ఇది బలోపేతం చేయనుంది" అని ఎక్స్‌లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పోస్టు చేశారు. ఆగస్టు 15న సుదర్శన చక్ర రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన కొన్ని రోజుల్లోనే ఈ ఎయిర్ డిఫెన్స్‌ను పరీక్షించడం విశేషం.ఇటీవలే భారత్ మధ్యమ శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని-5 'ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్రయోగంలో ఆ క్షిపణి అన్ని సాంకేతిక, కార్యనిర్వాహక ప్రమాణాలను అందుకొని లక్ష్యాన్ని ఛేదించింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేస్తున్న ఈ క్షిపణి పరిధి 5 వేల కిలోమీటర్లు. ఒకేసారి మూడు అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లి.. ఫైర్ చేసే సామర్థ్యం దీనికి ఉంది.

# గగన్‌యాన్ మిషన్‌లో మరో ముందడుగు

**ఎయిర్ డ్రాప్ టెస్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ఇస్రో**

సహకారంతో ఈ పరీక్షలు చేపట్టింది.ఈ ప్రయోగంలో భాగంగా మాడ్యూల్ నమూనాను హెలికాప్టర్ సాయంతో నింగిలోకి తీసుకెళ్లి.. కిందికి జారవిడిచారు. పారాచూట్ల సాయంతో ఆ మాడ్యూల్ వేగాన్ని తగ్గించుకుంటూ. సముద్ర జలాల్లో సురక్షితంగా దిగింది. మానవసహిత అంతరిక్ష ప్రయోగాల సమయంలో వ్యోమగాములు భూమికి సురక్షితంగా తిరిగి వచ్చేందుకు దీన్ని ఉపయోగిస్తారు. మాడ్యూల్ భూవాతావరణంలోకి ప్రవేశించిన అనంతరం దాని వేగ నియంత్రణ, ల్యాండింగ్ విషయంలో పారాచూట్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్టమైన ఈ వ్యవస్థ పనితీరును పరీక్షించడమే లక్ష్యంగా ఈ ప్రయోగం చేపట్టినట్లు సమాచారం. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో చేపట్టిన గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఇస్రో అనేక పరీక్షలు నిర్వహిస్తోంది. జులైలో సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్‌కు సంబంధించి రెండు హాట్ టెస్టులను విజయవంతంగా చేపట్టింది. 2027లో తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఇటీవల వెల్లడించారు.

# రైతులకు తప్పని యూరియా తిప్పలు

**సహకార సంఘాల ముందు బార్లు తీరిన రైతులు**

**యూరియా కొరత లేదంటున్న జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్**



ములుగులో క్యూలో నిల్చున్న మహిళలు

**ములుగు ప్రతినిధి, ఆగస్టు 24(జనంసాక్షి) :** ములుగు జిల్లాలో సైతం రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల ముందు రైతులు యూరియా కోసం బార్లు తీరినప్పటికీ యూరియా బస్తాలు లభించడం లేదని పేర్కొంటున్నారు. యూరియా బస్తాల కోసం గత వారం రోజుల నుండి రైతులు పడిగాపులు కాస్తున్నప్పటికీ యూరియా బస్తాలు దొరకకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత కొద్ది రోజులుగా ములుగు జిల్లాలో గోవిందరావుపేట, పసర సహకార సంఘం, మంగపేట, ములుగు, వెంకటాపూర్ మండలం లోని లక్ష్మీదేవిపేట, తాడ్వాయి, పాలంపేట సహకార సంఘాల ముందు ఉదయం నుండి రైతులు చెప్పులు పెట్టి బారులు తీరి పడిగాపులుకాస్తున్నారు. కాగా రెండు రోజుల క్రితం ఒక్కొక్క సొసైటీకి ఒక లారీ చొప్పున యూరియా బస్తాలు రాగా ఆదివారం రోజు లక్ష్మీదేవి పేట, పాలంపేట, సహకార సంఘాల ముందు యూరియా బస్తాల కోసం క్యూలైన్ కట్టారు. పిఎసిఎస్ లలో యూరియా లభించకపోవడంతో విదిలేని పరిస్థితిలో రైతులు ఫర్టిలైజర్ షాప్ ల వద్ద ఒక బస్తాకు రూ. 50 నుంచి రూ. 80 వరకు వెచ్చించి యూరియాను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికార యంత్రాంగం స్పందించి రైతులకు సరిపడా యూరియాను తీసుకువచ్చి అందజేయాలని జిల్లా రైతాంగం కోరుతున్నారు.

**లైన్లో చేరిన పట్టాదారు పాస్ పుస్తకాలు..**

**పర్వతగిరి ఆగస్టు24 (జనం సాక్షి) :** అధికార పార్టీ నాయకుల ప్రగడ్బాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఈ యూరియా తిప్పలు తప్పడం లేదని చెప్పడానికి ప్రత్యక్ష సాక్ష్యమే వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద పట్టాదారు పాస్ పుస్తకాల లైన్ చూస్తే అర్థమవుతుంది. గత పది సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక యూరియా కొరత ఏర్పడుతుందంటే ప్రభుత్వం నిర్లక్ష్యపు వైఖరి అద్దం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్వతగిరి మండలంలో వారానికి ఒక్కసారైనా రైతులకు సరిపడా యూరియా నిల్వలు లేకుండా చేస్తున్నారని అధికారులపై ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశార గత ప్రభుత్వంలో లేని యూరియా కొరత ఈ ప్రభుత్వంలోనే ఎలా ఏర్పడుతుందని ఇది ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శమని అన్నారు.



చెన్నారావుపేటలో యూరియా కోసం రైతుల తోపులాట

**పోలీసు పహార మధ్య యూరియా పంపిణీ...**

చెన్నారావుపేట, ఆగస్టు 24 (జనం సాక్షి): యూరియా కోసం రైతులు బారులు తీరి నిలబడిన సంఘటన చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ గ్రామపంచాయతీ, పాపయ్యపేట గ్రామాలలోని సొసైటీ గోదాము వద్ద ఆదివారం చోటుచేసుకుంది. అమీనాబాద్ సొసైటీ గోదాం వద్దకు 444 బస్తాలు, పాపయ్యపేట సొసైటీ గోదాం వద్దకు 444 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు అమీనాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయంలో టోకెన్లు ఇస్తున్నారన్న విషయం తెలుసుకొని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు, పాపయ్యపేట సొసైటీ గోదాము వద్దకు ఆదివారం తెల్లవారుజామున నుండే బారులు తీరి నిలబడ్డారు. రైతులు పెద్ద ఎత్తున పాపయ్యపేట సొసైటీ గోదాము, అమీనాబాద్ గ్రామపంచాయతీ వద్దకు చేరుకోవడంతో సొసైటీ సిబ్బంది చేసేది ఏమీ లేక పోలీసుల పహార మధ్య యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. యూరియా బస్తాలు అందని రైతులు నిరాశతో వెనుతిరిగి వెళ్ళిపోయారు. యూరియా అందని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని యూరియాను తెప్పించి రైతులకు అందజేస్తామని చెన్నారావుపేట, అమీనాబాద్ సొసైటీ చైర్మన్లు చింతకింది వంశీ, మురహరి రవిలు తెలిపారు.



పర్వతగిరిలో యూరియా కోసం రైతుల అగచాట్లు

## రైతులకు సరిపడా యూరియా వస్తుంది



రైతులకు సరిపడా యూరియా లభిస్తుందని ఎవరు కూడా ఆందోళన చెందవద్దని ములుగు జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. యూరియా బస్తాల కొరతపై ప్రభాతవార్త ఆయనను వివరణ కోరగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వానకాలం సీజన్లో గత సీజన్ కంటే 500 మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా వచ్చిందని తెలిపారు. గత సంవత్సరం 10,120 మెట్రి టన్నులు రాగా ఈ సీజన్లో 10,720 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని అన్నారు. గత వారం రోజులుగా వరంగల్ లారీ అసోసియేషన్ వారి సమస్య కారణంగా ట్రాన్స్పోర్ట్ ఆగిపోవడంతో యూరియా రావడం ఆలస్యమైందని తెలిపారు. ఈ విషయంపై అక్కడి జిల్లా కలెక్టర్, కమిషనర్ ఆఫ్ పోలీసులు స్పందించి లారీ అసోసియేషన్ వారితో మాట్లాడడంతో లారీలు వస్తున్నాయని తెలిపారు. ములుగు జిల్లాకు ఇంకా యూరియా రావాల్సి ఉందని రైతులెవ్వరు కూడా ఇబ్బంది పడకుండా యూరియా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే కొంతమంది రైతులు ముందు జాగ్రత్తతో ఎక్కువ మొత్తంలో యూరియా బస్తాలు కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవడం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం మొక్కజొన్న సాగు అధికంగా ఉండడంతో రైతులు యూరియా వినియోగం ఎక్కువ చేస్తున్నారని జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.

**- ములుగు జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్**



# మేడిపల్లి ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఉప్పల




హైదరాబాద్ (జనంసాక్షి) : ఎం కన్వెన్షన్ సెంటర్ మేడిపల్లిలో జరిగిన మేడిపల్లి ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్స వానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి అని త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్య వైశ్యులు రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేసి తమ సత్తా చాటాలి అని ఆయన అన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్య వైశ్యుల అభివృద్ధికి తాను కృషి చేస్తానని,ఆర్య వైశ్యులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గరపు దయానంద్, వైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాల్వ సుజాత గుప్త గారు, మహా సభ సేవాదళ్ చైర్మెన్ జీన్నం వేణు గుప్త, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బెలిధే రమేశ్ గుప్త, మేడిపల్లి మండల అధ్యక్షులు వెచ్చ వెంకట్ గుప్త అలాగే మేడిపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల వెంకన్న, కార్యదర్శి ఇరుకుల్ల రాంబాబు, కోశాధికారి బజ్జురి శేఖర్, గౌరవ అధ్యక్షులు గొడిశాల నాగభూషణం, కేశెట్టి ఆనంద కుమార్ సకినాల వెంకటయ్య మురారి శెట్టి రామంజయ్యఅప్పిశెట్టి సోమయ్య గౌరవ సలహాదారులు జూలూరు రాములు సంబు పాండయ్య కోకల ప్రకాష్ రాచకొండ హరికృష్ణ ఉపాధ్యక్షులు మెరిసశెట్టి వీరేశం కోటగిరి లక్ష్మీనారాయణ సిహెచ్ వెంకటరాజం అనంతుల వెంకటేశ్వర్లు సహాయ కార్యదర్శి బెజిగం శ్రీకాంత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాగి శేఖర్ పి ఆర్ ఓ సోమ లింగయ్య కార్యవర్గ సభ్యులు అంచురి మహేష్ కేశెట్టి కిషోర్ కేశెట్టి సందీప్ కేశెట్టి వినోద్ ఆకుతోట రాఘవేందర్ సోమ శ్రీనివాస్ పల్లెర్ల లక్ష్మణ్ బచ్చు రమేష్ మొలుగు మణికంఠ ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లి సమగ్రాభివృద్దే నాలక్ష్యం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, ఆగష్టు 24, (జనంసాక్షి) :** బెల్లంపల్లి సమగ్రాభివృద్దే నాలక్ష్యం అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం ఆయన బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద టీయూఎఫ్ఐడీసీ మున్సిపల్ నిధులతో కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత పట్టణ రవాణా సౌకర్యాలు మెరుగుపడి, ప్రజలకు మరింత సౌలభ్యం కలగనున్నట్లు తెలిపారు. గత పాలకులు అభివృద్ధిని పక్కన పెట్టారని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, నాయకులు చిలుముల శంకర్, మునిమంద రమేష్, శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రవాణా, విక్రయిస్తున్న నిందితుల అరెస్టు

- పట్టుకున్న నకిరేకల్ పోలీసులు



**నల్లగొండ బ్యూరో (జనంసాక్షి) :** అక్రమ గంజాయి రవాణా చేస్తూ, విక్రయిస్తూ, సేవిస్తున్న ఆరుగురు నిందితులను అరెస్టు, ఒక జేసీఎల్‌ను నకిరేకల్ పోలీసులు పట్టుకున్నారు. నకిరేకల్ పోలీస్ స్టేషన్ నుంచి కేసు వివరాలు సి.ఐ.వెంకటేష్ వెల్లడించారు. వీరి వద్ద నుండి సుమారు 32,250/- రూపాయల విలువ గల కిలో 290 గ్రాముల గంజాయి, 7 సెల్ ఫోన్‌లు, స్కూటి, మోటార్ సైకిల్, ఆటో స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో నకిరేకల్ పోలీసులకు నకిరేకల్ పట్టణ శివారులోని తాటికల్ రోడ్ లోని కుమ్మరి బావి దగ్గర్లోని చెట్ల పొదల వద్ద అక్రమంగా గంజాయి అమ్ముచున్నారని నమ్మదగిన సమాచారం రాగా యస్.ఐ తన సిబ్బందితో అక్కడికి వెళ్ళి అక్రమ గంజాయి విక్రయిస్తున్న, కొనుక్కొని సేవిస్తున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. ఒక జేసీఎల్‌ను పట్టుకొని వారి వద్ద నుండి కిలో290 గ్రాముల గంజాయి, 7సెల్ ఫోన్‌లు, ఒక స్కూటి, ఒక మోటార్ సైకిల్, ఒక ఆటొను నిందితుల నుండి స్వాధీనం చేశారు. నల్లగొండకు చెందిన సమీర్, నల్లగొండ పట్టణంలోని ఎన్‌జీవో కాలనీకి చెందిన బోరిగం సంపత్‌కుమార్‌ను, నకిరేకల్ పట్టణానికి చెందిన యన్నమల్ల సాయిరాం, నకిరేకల్ పట్టణం ఎస్ఎల్‌బీసీ కాలనీకి చెందిన ముక్కాముల అఖిల్, నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన పల్లబోయిన శివ, శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన బండారి వినయ్, చిట్యాల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన కుంచం నవీన్, ఒక బాలనేరస్తుడు నిందితులుగా ఉన్నారు. వీరిలో సమీర్ పరారీలో ఉన్నారు. మిగితా వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ గంజాయిని నల్లగొండ పట్టణానికి చెందిన సమీర్, సంపత్‌కుమార్ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తూ సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో సమీర్ గంజాయిని తనకు తెలిసిన వారి వద్ద నుండి తక్కువ ధరకు కొనుగోలు చేసుకొని సంపత్‌కుమార్ వద్దకు వచ్చాడు. ఇద్దరు కలిసి నల్లగొండ, నకిరేకల్, సూర్యాపేట పట్టణాలలో అమ్ముతుంటారు. అదే క్రమంలో నకిరేకల్ కు చెందిన సాయిరాం, అఖిల్‌లను పరిచయం చేసుకొని వారికి ఎక్కువ ధరకు గంజాయిని విక్రయిస్తాడు. వీరు గంజాయి సేవించడం అలవాటు ఉన్న వారికి పరిచయం ఉన్న శివ, వినయ్, నవీన్, జేసీఎల్‌లకు ఒక్కొక్కరికి 50 గ్రాముల చొప్పున అమ్ముతున్నామని ఒప్పుకోగా వారి వద్ద నుండి పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. సమీర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఇతని కొరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు. ఈ కేసులో నిందితులను నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి పర్యవేక్షణలో నకిరేకల్ సిఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టుకున్న ఎస్ఐ బి.లచ్చిరెడ్డి, ఎస్ఐ జి.క్రిష్టా చారి, సిబ్బంది వై. వెంకటేశ్వర్లు, కె. జనార్ధన్, బి. మధుకర్, ఎం. శ్రీనివాస్,ముజీబ్,వి. సురేష్, డి. శ్రీకాంత్,యం. నాగార్జున్ లను జిల్లా యస్పీ అభినందించారు.



# సాధారణ స్థితిలోనే మంజీరా గేట్లు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరానికి మంచినీరు సరఫరా చేస్తున్న మంజీరా బ్యారేజీ గేట్లు పనిచేయడం లేదని వివిధ మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న నేపథ్యంలో మంజీరా బ్యారేజ్ ను జలమండలి అధికారులు సందర్శించారు. మంజీరా గేట్లు అన్నీ సక్రమంగా పనిచేస్తూ కార్యనిర్వహణ స్థితిలో ఉన్నాయని.. ప్రస్తుతం మంజీరా నుండి 2 క్రెస్ట్ గేట్లు, 1 స్కవర్ వెంట్ ద్వారా 15,130 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సింగూర్ నుండి ప్రవాహం 9,226 క్యూసెక్కులు ఉండగా 13 నుంచి ఆదివారం ఉదయం 6:00 గంటల వరకు గేట్లలో ఎటువంటి అంతరాయం లేకుండా సగటున 46,000 క్యూసెక్కులతో మొత్తం 28.09 టీఎంసీని విడుదల చేశారు. మంజీర బ్యారేజ్ కి గాని, గేట్ల గాని ఎలాంటి ముప్పు కలగలేదని ఈ సందర్భంగా జలమండలి అధికారంగా ప్రకటించారు.

# పనుల జాతర ఓ ప్రహసనం

- ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న మంత్రి సీతక్క
- గ్రామ పంచాయతీలకు ఇప్పటివరకు రూపాయి చెల్లింపు లేదు
- సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 24 ( జనం సాక్షి) :** పనుల జాతర పేరిట ప్రజలను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తప్పుదారి పట్టిస్తుందని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినప్పటికీ గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటివరకు 1 రూపాయి కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాజకీయ లబ్ధి పొందినందుకు పనుల జాతర కార్యక్రమం కొనసాగింపు ఒక ప్రహసన కార్యక్రమంగా అభి వర్ణించారు. గ్రామపంచాయతీలో కార్యదర్శిలు అప్పులు చేసి పనులు చేస్తున్నప్పటికీ వారికి బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడంలో ప్రభుత్వం భయపడుతుందని, ఎక్కడ ఓడిపోతానని అంతర్ మదనం లో కాంగ్రెస్ నాయకులు ఉన్నా రని అన్నారు. వెంటనే ప్రజలను మమ్మి పెట్టే కార్యక్రమాలకు స్వస్తి పలికి, అభివృద్ధికి కృషి చేసే విధంగా ఎన్నికల నిర్వహించాలని హితవు పలికారు. పారిశుధ్య కార్మికులకు గ్రామాల్లో జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించకుండా, అటు సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడంతో రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు.

# స్థానిక ఎన్నికల్లో ఆదివాసీలకే సీట్లు కేటాయించాలి

- తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు24 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవనంలో ఆదివారం తుడుం దెబ్బ జిల్లా అత్యవసర సమావేశం వర్కింగ్ ప్రెసిడెంట్ సుంచు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంగగారి భూమయ్య మాట్లాడుతూ, స్థానిక ఎన్నికలలో ఆదివాసులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్టీ రిజర్వేషన్ ఉన్న స్థానాలలో ఆదివాసులకే సీట్లు కేటాయించి, వారిని గెలిపించడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ తెగలకు సీట్లు కేటాయించిన పార్టీలకే పూర్తిస్థాయిలో తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అర్హులైన ఆదివాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం లేదని, ఇంద్రమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు, ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు సంబంధించి అటవీ అధికారుల దాడులను ఆపాలని భూమయ్య డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చినప్పటికీ, ఫారెస్ట్ అధికారులు కావాలని అడ్డుకుని చెట్లు నాటుతున్నారని ఆరోపించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అటవీ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లాలో అత్యధికంగా ఆదివాసులు నివసిస్తున్నారని, వారికి రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆయన అన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, ఉద్యోగపరంగా వెనుకబడిన ఆదివాసులకు అన్ని రాజకీయ పార్టీలు అండగా ఉండాలని సూచించారు. ఈ సమస్యల పరిష్కారానికై త్వరలోనే మండలంలోని తహసిల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ మంద మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంచు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు తోడుసం గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు పోతురాజు శ్రీనివాస్, బోర్రభీమేష్, శ్రీనివాస్, భూమేష్ తదితరులు పాల్గొని చర్చించారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.



# అడవి పందుల ధాటికి ఎకరం మొక్కజొన్న పంట ధ్వంసం

**ఖానాపూర్ రూరల్ 24 ఆగస్టు (జనం సాక్షి):** అడవి పందుల ధాటికి రైతులు ఆందోళన చెందుతున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన షేక్ అల్మియా అనే రైతు యొక్క గ్రామ పరిసరాలలో తన ఇంటి పక్కన ఉన్న పంట చేనులో మొక్కజొన్న, పసుపు,పత్తి పంటలను సాగు చేసుకొంటూ జీవనంసాగిస్తున్నారు.ఆదివారం తెల్లవారుజామున ఆడవి పందులు తన ఇంటి సమీపంలో ఉన్న పంటచేనులో ఉన్న మొక్కజొన్న, పసుపు, పత్తి పంటలను అడవి పందులు ధ్వంసం చేశాయి.తన పంట చేనులోకి ఆడవి పందులు రావడం తో వెల్లగొట్టడానికి వెళ్లగా తనపై పందుల మంద వెంబడపడ్డాయి అని వాటినుండి తప్పించు కొని తన ప్రాణాన్ని కాపాడుకున్న అని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆడవి పందుల తో ధ్వంసం అయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊరిలోకి ఆడవి పందులు రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు అడవిపందులతో ధ్వంస అయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని పలువురు నాయకులు గ్రామస్తులు అటవీశాఖ అధికారులను కోరుతున్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 25 ఆగస్టు 2025

# అమిత్ "షాకు" సుదర్శనం



**ఎంపీలుగా ఎవరి ని గెలిపించాలనే ఓటు శక్తి భారత పౌరులుగా మనకు సొంతం. మనం హస్తినకు ఆ విధంగా తోలిన ఆ ఎంపీలకు (రాజ్యసభ, లోక్ సభ) మాత్రమే ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటు హక్కు, ఫలితాన్ని మాత్రమే సాధారణ ఓటర్లుగా ఇపుడు మనం చూడగలం. కానీ ఆ ఎంపీలు, రాజకీయ పార్టీలు మన అంతరంగానికి ప్రభావితం కాకుండా ఉండగలరా, ఉండగలవా? పరిపూర్ణ న్యాయకోవిదులు, మన హైదరాబాదీ, తెలంగాణ కోసం పాటుపడిన వారిని ఉపరాష్ట్రపతి పీఠంపై మనకు సు..దర్శనం కావాలనే ఆకాంక్ష మనలో సహజ భావోద్వేగమై ఉబికి రావడం లేదా!**

ఉప రాష్ట్రపతి ఎన్నిక అర్థాంత రంగా ఎందుకు అనివార్యమైనదో చర్చోపచర్చలు, వ్యాసోపవ్యాసాలకు జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ఉద్దేశించిన అమిత్ షా వ్యాఖ్యలను కొనసాగింపుగా చూడొచ్చు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి అయినందునే అపుడున్న న్యాయకోవిదుడి పట్ల సున్నిత సమాజం నొచ్చుకునేలా తన వాక్పటిమ ధ్వనించారు. మావోలపై టైం బౌండ్ నిర్దేశించుకున్న కేంద్ర హోంశాఖ మంత్రి మరి ఇంతకుముందు ఎప్పుడూ ఆ వ్యాఖ్యలు చేసినట్లు లేదు. సుప్రీం న్యాయమూర్తులుగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి, జస్టిస్ ఎస్.ఎస్.నిజ్జర్ లు సల్వాజుడుంకు వ్యతిరేకంగా ఇచ్చిన 14 ఏళ్ల నాటి తీర్పును భారత వర్తమాన పాలకులు మనసులో బాగానే ఉంచుకున్నారని మలయాళ మనోరమ మీడియా సదస్సులో షా ఈ 22న ప్రస్తావించేదాకా ప్రజాస్వామ్య లోకానికి తెలియదు. పేరు శాంతియాత్ర(సల్వాజుడుం), తీరు తద్విన్నమైన ముద్రతో దాఖలైన పిటీషన్లపై వెలువరించిన 2011 డిసెంబరు నాటి తీర్పుపై భారత హోం మంత్రి "నేటి తీర్పు" ఆశ్చర్యం, విస్మయం మిగిల్చకుండా ఉండదు. ప్రజలే ప్రజలను అంతమొందించుకోడానికి శాంతియాత్రగా ఎంతటి ముద్దు ముద్దు వచనాల నామకరణాలు అద్దినా అది రాజ్యాంగ వ్యతిరేకమనే దేశ అత్యున్నత న్యాయస్థానం దృఢ నిశ్చయం తదుపరి రివ్యూ పిటీషన్ ను జస్టిస్ నాగరత్నమ్మ, జస్టిస్ సతీష్ చంద్రశర్మ కొట్టివేయడంలో ప్రతిఫలించడం వల్లనూ సల్వాజుడుం రద్దు తప్పలేదు. ఇది చాలు విశాలమైన ఒక సామాజిక అంశంపై ధర్మ, చట్టబద్ధ విధి నిర్వహణలో భాగమైన సుప్రీంకోర్టు ప్రమాణాలపైజరిపిన కామెంట్లు కేంద్ర హోంశాఖ మంత్రికి తగునా? ఏనేడుకు. ఈ పరంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఎత్తిచూపడం అంటే, మానవీయ సమాజాన్ని మరోలా చూడటం కాదా?

అది నక్సలిజంలోనైనా, సల్వాజుడుం వంటి మరి ఏ ఇజంలోనైనా హింసాయుత ప్రవృత్తిని ఏ నాగరిక సమాజమూ భరించదు. మావోలను ఎలాగూ ప్రభుత్వాలు బ్యాన్ చేశాయి. అదే సమయంలో ఆదివాసీల కన్నును ఆదివాసీల చేతే పొడిపించడాన్ని రాజ్యాంగ వ్యవస్థల భుజాన మోయాలను కోవడం ఏ కోణాన కరెక్టో పాలక ప్రభువుల వద్ద తర్కం ఉన్నదా? అనేది వేరే విషయం.

సల్వాజుడుం సజీవంగా ఉంటే నక్సలిజం (మావోయిస్టు) 2020కే నిర్మూలనగా అంతర్గత భద్రతకు ఆపదలేనిది భారత హోం మంత్రి ఉవాచ. ఉపరాష్ట్రపతిగా జగ్ దీప్ ధన్ ఖడ్ హఠాత్తుగా దిగిపోయేందుకు కారణాలు, నేపథ్యాన్ని మించిన "ప్రజాస్వామ్య చర్చ" షా వారి పలుకులతో దేశం అంతటా ఉపరాష్ట్రపతి ఎన్నిక వేళ ప్రవహిస్తోంది. నిజానికి సల్వాజుడుంపై నిషేధం విధించిన తీర్పు కాలంలో కేంద్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ సారథ్యంలోని ఐక్య ప్రగతిశీల కూటమి (యూపీఏ)నే. మరి ఎన్డీయే దిగ్గజం అమిత్ షాకు ఇంతటి బాధ ఎందుకో? కడపటి ఎన్నికల్లోనైతే యూపీఏ కాస్తా ఇండియా కూటమిగా ప్రభావంలోకి వచ్చింది. ఏ పార్టీతోనూ సంబంధం లేని జస్టిస్ సుదర్శన్ రెడ్డి విపక్ష కూటమి ఇండియా పక్ష ఉపరాష్ట్రపతి క్యాండిడేట్ అవడం అమిత్ షా, బీజేపీల దృష్టిలో పాపమైపోయిందా? పైగా వామపక్షాల (లెఫ్టిస్ట్) ఒత్తిడితోనే జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి పదవికి నిలబెట్టారంటూ కాంగ్రెస్ ను అంత అమాయకంగా అమిత్ షా చిత్రించడం మరో బోనస్ నిందాస్తుతి కాకుండా ఉండదు.

సుప్రీం తీర్పులను పాలకులు ఎవరైనా ఇట్టా వ్యాఖ్యానాలకు వాడుకోవడమే విషాదం. దేశంలో రెండే రెండు కూటములు(అలయెన్సు)లు. ఎన్డీయే, ఇండి. అమిత్ షా అంతలా విరుచుకుపడ్డారంటేనే జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి సెలెక్ట్ చేయడం సరైన నిర్ణయంగా రూఢీ అవుతోంది. వారి అభ్యర్థిత్వంతో ఎన్డీయే ముఖ్యంగా బీజేపీ తట్టుకోలేక పోతున్నదని వేరే చెప్పక్కర్లేదు. కాంగ్రెస్ అపుడపుడు మంచి నిర్ణయాలు తీసుకుంటుంది. అలాంటి అరుదైన మంచి డెసిషన్ లో ఇదొకటని సమూహాలు ఎన్నో. తమ పార్టీ పాతికేళ్ల సభలో గంభీరమైన వ్యాఖ్యలు చేసిన కేసీఆర్ కూడా అమిత్ షా వ్యాఖ్యలను సమర్థించని యెడల సరైన లైన్ తక్షణం ప్రకటించాలి. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఆవేశంగా కాకుండా, నిదానంగా కూల్ గా పునఃయోచన చేయాలి. న్యాయమూర్తిగా తన తీర్పును ఎట్లాగూ షా ఉటంకించారు కాబట్టి, ఎన్టీఆర్ తో విభేదించినపుడు తనకు సైకిల్ గుర్తు దక్కడంలో తీర్పును కృతజ్ఞతగానైనా చంద్రబాబు నాయుడు కూడా "న్యాయం"గా పునుకోవాలి.

ఆత్మ ప్రబోధానుసారమంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి నచ్చినా, నచ్చకపోయినా ఆ సారం మేరకు మన భాష తెలుగు రాష్ట్రాల ఐక్యతను చంద్రబాబు, కేసీఆర్ దేశానికి చాటాలి. అమిత్ షా వలె కాకుండా తనదైన శైలిలో స్పందించిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆ విషయాన్ని ఇంతటితో వదిలేస్తున్నానని పేర్కొనడాన్ని తన గొప్ప మనసుకు తార్కాణంగా గ్రహించాలి. అనూహ్యమైన తరహాలో మృదువుగా, సౌమ్యంగానే "షా"కిచ్చారని భావించాలి. ఓటు సమయంలో ఎంపీలు గమనంలో ఉంచుకోవాలి.


పేరు..తీరు! **సుదర్శన్ అంటే** "అందమైన దృష్టి ఉన్నవారు", "చూడడానికి ఆహ్లాదకరమైన వారు", "మంగళకరమైనవారు" అని భావిస్తారు. ఈ పేరు ఎక్కువగా శ్రీ కృష్ణుని పేరుగా కూడా పరిగణించబడింది. "సుదర్శన" అనేది ఒక ప్రసిద్ధ హిందూ పురాణ ఆయుధంగా పేరు కూడా. అది శ్రీ మహావిష్ణువు "చేతి"లో ఉండే శక్తిమంతమైన చక్రం, మహాశక్తికి చిహ్నం. సుదర్శన చక్రం శ్రీ విష్ణువు రాక్షసులను సంహరించేందుకు ఉపయోగించిన ఆయుధమైంది. ఇది అజేయతకు వ్యతిరేకంగా, రక్షణకు ప్రతీకగా నిలుస్తుంది.

**అమిత్** : ఇదొక హిందీ/సంస్కృత మూలం కలిగిన పేరు. సంస్కృతంలో "అమిత" అంటే "అపారమైనది" అనే అర్థమూ వస్తుంది. అంటే ఇది సరిహద్దులు లేకుండా విశాలమైన, అపారమైన అర్థాన్ని సూచిస్తుంది. అలాగే, అమిత్ అంటే "మిత్రుడు", "తోటి" లేదా "సహచరుడు" అనే అర్థాలూ ఉన్నాయి.

**షా** : ఇది పర్షియన్ మూలం కలిగిన పేరు. "షా" అంటే "రాజు" లేదా "సింహాసనాధిపతి" అనే అర్థాన్ని కలిగి ఉంటుంది. భారత వర్తమాన రాజకీయాల్లో భాష్యాలతోన్న అమిత్ "షాకు" మిత్రోపదేశంగానే సు..దర్శనం" జరుగుతోంది. గెలుపోటములకు అతీతంగా!

**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
వ్యాసకర్త: సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు,
హైదరాబాద్, 9440850384

# చైతన్యాత్మక నవల-మోదుగు పూలు




ప్రపంచవ్యాప్తంగా వచ్చిన పీడిత ప్రజా ఉద్యమాలలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముఖ్యమైనది. ప్రధానంగా దేశంలో మొఘల్ వంశానికి చెందిన ఔరంగజేబ్ కాలంలో సాగిన పరిపాలన ఎంత క్రూరమైనదో అంతకంటే అమానుషంగా ఇక్కడ కొనసాగిన నిజాం పాలన అందులోనూ ముఖ్యంగా 1911 నుంచి 1948 వరకు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలన తీరుతెన్నులు ప్రజల కష్టాలకు కడగండ్లకు కారణమైంది. జాగిర్దారులను, దేశ్ ముఖులను అండగా చేసుకుని తెలంగాణ పల్లెలలో అరాచకత్వాన్ని సృష్టించారు. ప్రజల కనీస అవసరాలు తీర్చకపోగా, వెట్టి చాకిరీ రుద్దపడింది. చివరకు మనిషి చస్తే స్మశానంలో బూడిద పన్ను పేరుతో డబ్బు వసూలు చేసేవారు. నిజాం నవాబు పేరు చెప్పి జాగిర్దారులు దేశముఖ్ లు ,దొరలు, వాళ్ల కనుసన్నల్లో పని చేసే తహసీల్దార్లు, గిరిధావర్లు, పటేల్ పట్వారిలు పల్లె సీమలలో సృష్టించిన బీభత్సం చెప్పనలవి కాదు. తరాలుగా అనుభవిస్తున్న దోపిడీ దౌర్జన్యాలపై తిరుగుబాటు సలిపిన ఇక్కడి ప్రజల సాహసాన్ని సమరాన్ని చిత్రిస్తూ అద్భుతమైన ప్రజాసాహిత్యం వెలువడింది. సహనం నుంచే సాహసం పుట్టుకొస్తుందన్న చారిత్రక సత్యాన్ని రుజువు చేస్తూ బాంచన్ కాలు మొక్కుతా, గులాపోన్ని అన్న అమాయక ప్రజలే, అసమాన పోరు సల్పి చరిత్రను తిరగరాశారు. నిజాం పాలన అనే బలవంతమైన సర్పము ప్రజలనే చలిచీమల చేత చిక్కి దిక్కులేని చావు చచ్చింది.

ఇక్కడే పుట్టి పెరిగి, ఇక్కడి కష్టనష్టాల్ని అనుభవించి ఉద్యమంలో భాగమై గన్నుబి పెన్నును పట్టిన సాహితీమూర్తులు దాశరథి సోదరులు. దాశరథి కృష్ణమాచార్య నిజాం ప్రభుత్వంపై అగ్ని ధార కురిపించి రుద్రవీణను మోగిస్తే, దాశరథి రంగాచార్య ఆనాటి ప్రజా పోరును కళ్లకు కట్టినట్లు చిత్రిస్తూ చిల్లర దేవుళ్ళు, మోదుగు పూలు, జనపదం మొదలైన ఉద్యమ నవలలు రాశారు. వట్టి కోట రాసి వెళ్లిన ప్రజల మనిషి, గంగు నవలల ఒరవడిలో తెలంగాణ సామాజిక సాంస్కృతిక చారిత్రక పరిస్థితుల్ని విశ్లేషిస్తూ, విశిష్ట రచనా వ్యాసంగం చేసిన ప్రజా రచయిత దాశరథి రంగాచార్య. నిజాం కబంధహస్తాల నుంచి అతని నిరంకుశ పరిపాలన నుంచి విముక్తి పొందడానికై తెలంగాణలో ఉవ్వెత్తున ఉద్యమాలు లేచాయి. మోదుగు పూలు నవల 1944-1951 నడుమ తెలంగాణలో నెలకొన్న ప్రజా పోరాటాన్ని చిత్రించిన విశిష్ట నవల. ఈ నేపథ్యంలో జాగీర్దారి ప్రాంతాలలో ఎలాంటి అకృత్యాలు అరాచకాలు చెలరేగాయో క్రమంగా చైతన్యవంతులైన ప్రజలు అధికార వర్గాలను వారి పీఠాలను ఎలా కదిలించారో "మోదుగు పూలు"నవల లో చూస్తాము. సాంకేతికంగా నవలలో ఉన్నది కోయగూడమే అయినా తెలంగాణ అంతట అవే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. నవల లో కథానాయకుడైన "రఘు"పాత్రలో ప్రచ్ఛన్నంగా ఉన్నది రంగాచార్య గారే. అందుకే ఇది చారిత్రాత్మకమైన ఆత్మకథాత్మక నవలగా చెప్పవచ్చు. ప్రాథమికంగా నవలలో రఘు, జానకి, వీరయ్య, సింగన్న, భీముడు, రావడు, నాగేష్, రుక్మిణి వి చైతన్యవంతమైన పాత్రలుగా కనిపిస్తే తాసిల్దారు, గిర్దావరు, షావుకారు వెంకయ్య, అమీను అహంకారం మూర్తిభవించిన అధికార పీఠాలుగా కనిపిస్తారు.

పత్రికను తీసుకొని ఊళ్లో దిగిన రఘును అమీన్ కొడితే స్పందించిన మామ వీరయ్యకు తిరిగి రఘు జవాబిస్తూ"వ్యక్తిని అని ఏమీ ప్రయోజనం లేదు. వ్యవస్థ అటువంటిది"అని ఒకచోట, "వ్యక్తి మీద నాకు ద్వేషం లేదు. వ్యవస్థ అతడిని దుష్టుని చేస్తుంది. పరిస్థితుల ప్రభావం వల్ల అలాంటి వ్యవస్థలోని ఒక భాగం నన్ను హింసించింది" అని మరో సందర్భంలో చెప్పిన మాటలు రఘు నిర్మాణాత్మక చైతన్య శీలాన్ని,అతని ఉద్యమ స్ఫూర్తిని, దార్శనికతను వ్యక్తీకరిస్తాయి. పల్లెటూర్లో అమాయకంగా పెరిగిన మరదలు జానకికి అక్షర గంధాన్ని కాదు ప్రాపంచిక దృక్పథాన్ని పెంపొందించుకునేలా అవసరమైన సాహిత్యాన్ని అందించాడు. అమ్మ లాంటి నవలతో ఆమె ప్రభావితురాలై సామాజిక పరిస్థితులకు శాస్త్రీయ దృక్పథాన్ని అన్వయింప చేస్తూ తాను ఒక సమిధై ఆ ప్రజాపోరులో భాగం అవుతుంది. తాసిల్దారు అండ చూసుకొని తనపై అమానుషంగా దాడి చేసిన వెంకయ్యను, ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకోవడంలో రావడికి అవసరమైన చైతన్యాన్ని సలహాను అందించింది జానకే. చివరకు వారం రోజుల పాటు మంగళ వృత్తి చేసే రావడు మరొకరు కనిపించకపోతే అధికారులకు మసాజ్ చేసే వాళ్ళు కరువవుతారు. చివరకు గత్యంతరం లేక మంగళకు తాసిల్దారు ఐదు రూపాయలు చెల్లిస్తాడు. శ్రమజీవులు సంఘటితమైతే దోపిడీ వ్యవస్థ ఏ విధంగా తోక ముడుస్తుందో ఈ ఉదంతం ద్వారా తెలుసుకోవచ్చు. అదే చైతన్యం గ్రామంలోని మిగతా వర్గాలకు కూడా పాకి క్రమంగా వడ్డెర్లు, హరిజనులు కూలీరెట్లు సాధించుకున్నారు. తాసిల్దారు కట్ట దలుచుకున్న బంగాళా కోసం రాయి తోలటానికి కోయగూడెం వెళ్లిన తలారి శివడు "దొరతలుచుకున్నాడు అంటే గుడి ఏంది గుట్టలనే కూలగొడతాడు"అనే మాటలు ఇప్పటికీ ప్రాసంగికతను కలిగి ఉన్నాయి, కాకపోతే ఆనాడు దొరల కోసం ఈనాడు పైకి నాజూకుగా కనిపించే బిజినెస్ మాగ్నెట్స్ కోసం. తెలంగాణలో ఇప్పటికే వేలాది గుట్టలు ఆనవాళ్లు కోల్పోయాయి. దేవాలయ స్తంభాలను కూల్చి బంగాళాకు ఉపయోగించుకున్న ప్రబుద్ధుడు అప్పటి తాసిల్దారు. ఉదారవాదిగా ఉన్న మున్సిఫ్ మేజిస్ట్రేట్ ను హత్య చేసిందితానే అయినా ఆ నెపాన్ని రఘు పై నెట్టి అతన్ని చిత్రహింసల పాలు చేస్తాడు. మల్లమ్మ ను లైంగిక దోపిడీకి గురి చేయడం ఆమె ఆత్మహత్య చేసుకోవడం, పీరమ్మ పీరయ్యలు చనిపోవడం ఇవన్నీ అతని వల్లనే. తండ్రి అధికారాన్ని అలుసుగా చేసుకుని రషీద్ తదితరులు రెచ్చిపోయి ప్రజల్ని హింసించడం కరువు కాలంలో అప్పులు తీర్చమని రైతాంగాన్ని వత్తిడి చేయడం, గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని ఏదో ఒక రకంగా వేధించడంతో ప్రజలు తాసిల్దారుపై తిరుగుబాటు చేసి అతని బంగళాలోనే అతడిని చంపేస్తారు. ఆ రకంగా తమ పగను తీర్చుకుంటారు. చదువు చైతన్యాన్ని అందిస్తుంది. కాబట్టి "ఆ చదువు అంటే బెదురు నిజాం నవాబుకు. నైజాంలో గ్రంథాలయం అంటే వట్టి చదువుకునే చోటు మాత్రమే కాదు, అది రాజకీయ కేంద్రం. అక్కడినుంచి ఉద్యమాలు పుట్టాయి. అందుకే నిజాం కు గ్రంథాలయం అంటే భయం"అని అన్నాడు. కోయ సంస్కృతిని గురించి, మొహరం గురించి రచయిత నవలలో వర్ణించిన అంశాల వల్ల ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి.

నవలలో సందర్భోచితంగా రంగాచార్య రాసిన కొన్ని వాక్యాలు పాఠకుల మదిలో కలకాలం గుర్తుంటాయి. రాజ దర్పాన్ని గురించి రాస్తూ"ఆ రాజసమే వాళ్లను రాళ్లను చేసింది"అంటాడు. అలాగే భయం మనిషిని నీరసింప చేస్తుంది, భయం బలహీనతకు గుర్తు. ప్రభుత్వం ప్రజలలో విశ్వాసం కలిగించాలె. ప్రజలు ప్రభుత్వాన్ని తమది అనుకునేటట్లు చేయాలి, అడవికి వెరచే కోయ ఉండడు. పులికి వెరచే కోయ పుట్టడు. ఎంత చిన్న మనుషులు ఎంత పెద్ద పనులు ఆపగలరు. భూతం అని భయపడిన పత్రిక గ్రామానికి భువన మోహినిగా మారింది. "నైజాంలో పోలీసులు రక్షకభటులు కారు రాక్షసభటులు. అధికారానికి కళ్ళు ఉండవు. సంపదకు మనసుండదు" మొదలైన వాక్యాలన్నీ భావగర్భితమై పాఠకులను ఆలోచింపజేస్తాయి. అలాగే తెలంగాణ వ్యవహారంలో ఈనాటికీ వ్యవహారంలో ఉన్న జిమ్మెదారి, జాయిదాదు, ఫైస్లా, తఫ్సీలు, ఇంతజాము, మొదలైన ఉర్దూ పదాలు చోటు చేసుకోవడం వల్ల రచనలో సహజత్వం ఉట్టిపడుతుంది. హరిజనవాడలో వయోజన విద్యా కేంద్రాన్ని నెలకొల్పడానికి ఊరంతా పత్రికలు తెప్పించడానికి ప్రయత్నిస్తున్న సందర్భంలో జానకి భయాన్ని పోగొడుతూ "కుటుంబ మేలు కోసం సొంత క్షేమాన్ని వదులుకోవాలి. గ్రామం కోసం కుటుంబ క్షేమాన్ని రాష్ట్ర శ్రేయస్సు కోసం గ్రామ శ్రేయస్సును దేశ శ్రేయస్సు కోసం రాష్ట్ర శ్రేయస్సును వదులుకోవాలి. మానవత శ్రేయస్సు కోసం దేశాన్ని సైతం వదులుకోవచ్చు" అని చెప్పిన మాటలు సార్వకాలికమైనవి, సార్వజనీనమైనవి. ఆనాడు ఉద్యమ సందర్భంగా విప్లవించిన కోయల చైతన్యానికి ప్రతీకాత్మకమైన పేరే మోదుగు పూలు. అందుకే రచయిత అన్నట్లు "మోదుగులు గ్రామాలలో ఉండవు. అడవుల్లో ఉంటాయి". అందుకే ఇదొక చైతన్యాత్మక నవలగా ప్రసిద్ధిగాంచింది.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

# భారతదేశంలో అకడమిక్ స్వేచ్ఛ క్షీణత

భారతదేశంలో అకడమిక్ స్వేచ్ఛలు క్రమంగా క్షీణిస్తున్నాయి. పరిశోధన సంస్థలపై దాడులు, ఆరోపణలు, ఫండింగ్ ఆంక్షలు వంటివి ఈ ధోరణిని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇటీవల సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) మరియు దాని "లోక్‌నితి ప్రోగ్రామ్"పై "ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్" (ఐసీఎస్ఎస్ఆర్) జారీ చేసిన షో కాజ్ నోటీసు ఈ సమస్యకు తాజా ఉదాహరణ.

లోక్‌నితి కో-డైరెక్టర్ సంజయ్ కుమార్ ఎక్స్ (పూర్వం ట్విట్టర్)లో పోస్ట్ చేసిన మహారాష్ట్ర ఎన్నికల రోల్‌లో తప్పుడు డేటా పోస్ట్‌ను కారణంగా చూపి, ప్రభుత్వం ఈ సంస్థలపై దాడి చేస్తోంది. సంజయ్ కుమార్ తన పోస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నానని చెప్పి డిలీట్ చేసి క్షమాపణలు చెప్పినప్పటికీ, మహారాష్ట్ర పోలీసు అతనిపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. ఇది సాధారణ తప్పును రాజకీయ ఆయుధంగా మార్చినట్లు కనిపిస్తోంది. ఐసీఎస్ఎస్ఆర్ ఈ సంస్థను డేటా మానిప్యులేషన్, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ)ను అపకీర్తి చేస్తున్నట్లు ఆరోపిస్తూ నోటీసు జారీ చేసింది. ఇది స్వతంత్ర పరిశోధనను దెబ్బతీయడమే కాకుండా, ప్రభుత్వం పై విమర్శలను అణచివేసే ప్రయత్నంగా కనిపిస్తుంది.

ఈ ఘటన "సీఎస్‌డీఎస్-లోక్‌నితి" లాంటి సంస్థలు చేస్తున్న ముఖ్యమైన పనిని అవమానపరుస్తుంది. లోక్‌నితి జాతీయ ఎలక్షన్ స్టడీస్, సమగ్ర డేటా ఆర్కైవ్ ద్వారా భారత రాజకీయాలను ఎంపిరికల్ ఇన్‌క్వైరీ ఆధారంగా మార్చింది. బిహార్‌లో ఈసీఐ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై వారు చేసిన సర్వేలో, ఐదు రాష్ట్రాలు మరియు ఒక యూనియన్ టెరిటరీలోని ఓటర్లలో వెరిఫికేషన్ డాక్యుమెంట్ల లభ్యత తక్కువగా ఉందని కనుగొన్నారు. ఇది దేశవ్యాప్త ఎస్ఐఆర్ విషయంలో ఓటర్లపై భారం పడుతుందని వారు సూచించారు. కానీ ఐసీఎస్ఎస్ఆర్ దీనిని ఈసీఐని మలినం చేసే ప్రయత్నంగా చూడటం విడ్డూరం. పాలసీల ప్రభావాన్ని అంచనా వేయడానికి ఇలాంటి ఎంపిరికల్ అధ్యయనాలు అవసరం. బాగా డిజైన్ చేసిన ఒపీనియన్ సర్వేలు లేకుండా పాలసీ సమర్థతను ఎలా అంచనా వేస్తారు? ఇది ప్రభుత్వం స్వతంత్ర విశ్లేషణలతో అసౌకర్యంగా ఉందని సూచిస్తుంది.

ఇలాంటి దాడులు కొత్తవి కావు. సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ (సీపీఆర్)పై 2023-24లో టాక్స్ సర్వేలు జరిగి, ఫారిన్ ఫండింగ్ లైసెన్స్ (ఎఫ్‌సీఆర్ఏ) రద్దు చేయబడింది. ఇది "అనుచిత ప్రయోజనాలకు" ఫండింగ్ పొందిందని కేంద్రం ఆరోపించింది. సీపీఆర్ లాంటి సంస్థలు స్వతంత్ర పాలసీ విశ్లేషణలు చేస్తాయి, కానీ ఇలాంటి చర్యలు వాటిని మూసేసే ప్రమాదం ఉంది. "వీ-డెమ్ ఇన్‌స్టిట్యూట్ "2024 అకడమిక్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారతదేశం 179 దేశాలలో 156వ స్థానంలో ఉంది, బాటమ్ నుంచి 10-20 శాతం లో ఉంది. ఇతర ఉదాహరణలు చూస్తే అశోకా యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలలో ప్రొఫెసర్లు, విద్యార్థులపై రాజకీయ ఒత్తిళ్లు." ఫ్రీడమ్ హౌస్ 2025 రిపోర్ట్" ప్రకారం, అకడమిక్ స్వేచ్ఛలు రాజకీయ, మతపరమైన కారణాలతో బెదిరింపులకు గురవుతున్నాయి.



ప్రభుత్వం స్వంత "స్టాటిస్టికల్ సిస్టమ్" ను కూడా దెబ్బతీస్తోంది. 2021 సెన్సస్ ఆలస్యమై, ఇప్పుడు 2027లో ముగుస్తుందని ప్రకటించారు. ఇది కోవిడ్-19 కారణంగా ఆలస్యమైనప్పటికీ, రాజకీయ కారణాలు (డెలిమిటేషన్ వంటివి) కూడా ఉన్నాయని విమర్శలు ఉన్నాయి. సెన్సస్ లేకుండా, పాలసీలు ఎలా రూపొందిస్తారు? సప్రెస్డ్ స్టాటిస్టికల్ సర్వేలు ప్రభుత్వ అసౌకర్యాన్ని చూపిస్తాయి. దీని వల్ల పరిశోధకులు 2011 సెన్సస్ డేటాపైనే ఆధారపడాల్సి వస్తుంది, ఇది 14 సంవత్సరాల పాతది. ఐసీఎస్ఎస్ఆర్ లాంటి సంస్థలు ఫీల్డ్ డేటా సేకరించి ప్రభుత్వ పథకాలపై విశ్లేషణ చేస్తాయి. కానీ,వీటి పరిశోధనా ఫలితాలు ప్రభుత్వానికి నచ్చకపోతే ఫండింగ్ తగ్గింపు లేదా నిలిపివేత జరుగుతుంది, ఇది పరిశోధనలను నిలిచిపోయేలా చేస్తుంది. పరిశోధకులపై వత్తిడి, కేసులు పెట్టడం వల్ల ఫలితాల నాణ్యత దిగజారుతుంది.


భారతదేశంలో పరిశోధనల నాణ్యత ఇప్పటికే విమర్శలకు గురవుతోంది. 2024లో ఇండియా పబ్లికేషన్స్ హెచ్-ఇండెక్స్ 925 మాత్రమే. అమెరికా 3,213తో పోలిస్తే 71 శాతం తక్కువ. సీఎన్‌సీఐ (క్యాటగరీ నార్మలైజ్డ్ సైటేషన్ ఇంపాక్ట్)లో 30 దేశాలలో ఇండియా 28వ స్థానంలో ఉంది. 2024లో 0.89 స్కోరు, ప్రపంచ సగటు కంటే తక్కువ. సైటేషన్స్‌లో 9వ ర్యాంక్ ఉన్నప్పటికీ, గ్లోబల్ ఇంపాక్ట్ తక్కువ.

ప్రభుత్వ ఫండింగ్ మరియు జోక్యం ఈ నాణ్యతను మరింత దెబ్బతీస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అకడమిక్ విషయాల్లో జోక్యం చేసుకుంటే ఫలితాలు ఎలా ఉంటాయో ఊహించవచ్చు.

ఇటీవల అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ హార్వర్డ్, కొలంబియా యూనివర్సిటీలపై జోక్యం చేసుకుంది. కొలంబియా \$221 మిలియన్ డీల్ చేసుకోవాల్సి వచ్చింది. హార్వర్డ్ \$2.2 బిలియన్ ఫండింగ్ ఫ్రీజ్ తర్వాత సూట్ చేసింది. అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ యూనివర్సిటీ ప్రొఫెసర్స్ (ఏఏయూపీ) దీనిని "అపూర్వ ప్రభుత్వ ఓవర్‌రీచ్"గా ఖండించింది.

కోర్టులు ట్రంప్ చర్యలను తప్పుబట్టాయి.

ఇది ప్రపంచవ్యాప్తంగా విమర్శలు రావడానికి దారితీసింది. స్థూలంగా, ప్రభుత్వ జోక్యం ఫండింగ్ కట్స్ ద్వారా అకడమిక్ స్వేచ్ఛను దెబ్బతీస్తుంది, ఫలితాల నాణ్యతపై ప్రభావం చూపుతుంది. భారతదేశం సంక్లిష్ట అభివృద్ధి సవాళ్లను ఎదుర్కొంటున్నప్పుడు, సీఎస్‌డీఎస్ లాంటి సంస్థల నుండి ఎవిడెన్స్-బేస్డ్ విశ్లేషణలు అవసరం. ఇలాంటి ఆడమినిస్ట్రేటివ్ హరాస్‌మెంట్, ఫండింగ్ రెస్ట్రిక్షన్లు మంచి గవర్నెన్స్‌కు, జాతీయ హితాలకు హానికరం. ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి ముప్పు. స్వతంత్ర పరిశోధన లేకుండా, పాలసీలు రాజకీయ ఎజెండాలకు మాత్రమే సరిపోతాయి. వీ-డెమ్ రిపోర్ట్ ప్రకారం, ఆంటీ-ప్లూరలిస్ట్ పార్టీలు అధికారంలో ఉంటే అకడమిక్ స్వేచ్ఛలు క్షీణిస్తాయి. భారతదేశం ఇంటర్నేషనల్ స్టేజ్‌లో తన ఇమేజ్‌ను కాపాడుకోవాలంటే, ఈ దాడులను ఆపాలి. పరిశోధకులు తప్పులు చేస్తే సరిదిద్దుకోవచ్చు, కానీ వాటిని సంస్థలపై దాడికి ఉపయోగించడం అన్యాయం. అకడమిక్ స్వేచ్ఛలు రక్షించబడాలి, లేదంటే దేశ అభివృద్ధి స్తంభించిపోతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# సామాజిక న్యాయ శిల్పి ఓబిసి రిజర్వేషన్ల
# ఆరాధ్యుడు మార్గదర్శకుడు శ్రీ బి.పి. మండల్

భారతదేశ చరిత్రలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు శ్రీ బిందేశ్వరి ప్రసాద్ మండల్. ఆయన పేరు నేటికీ వెనుకబడిన వర్గాల పోరాటానికి, హక్కుల సాధనకు ప్రతీకగా నిలిచింది. 1918లో బీహార్‌లోని మాదేపురా జిల్లాలో వెనుకబడిన వర్గ కుటుంబంలో జన్మించిన మండల్ గారు చిన్నప్పటి నుంచే వివక్షను అనుభవించారు. ఆ అనుభవమే ఆయనలో సామాజిక చైతన్యాన్ని పెంచింది. 1968లో బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన సాధారణ ప్రజల అవసరాలను ప్రతిబింబించే సంక్షేమ చర్యలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1979లో జనతా పార్టీ ప్రభుత్వం మండల్ గారిని వెనుకబడిన వర్గాల కమిషన్ చైర్మన్‌గా నియమించింది. అనంతరం ఇది మండల్ కమిషన్గా ప్రసిద్ధి చెందింది.

ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో బీసీలకు 27% రిజర్వేషన్ ఇవ్వాలని సిఫారసు చేశారు. వెనుకబడిన వర్గాల ఆర్థిక, విద్యా, సామాజిక వెనుకబాటుతనంపై సమగ్ర అధ్యయనం చేశారు. ప్రజాస్వామ్యం బలపడాలంటే అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం తప్పనిసరి అని స్పష్టం చేశారు. 1990లో అమలులోకి వచ్చిన ఈ సిఫారసులు దేశ సామాజిక-రాజకీయ చరిత్రలో విప్లవాత్మక మార్పుకు నాంది పలికాయి. కోట్లాది వెనుకబడిన వర్గాల జీవితాలను ఇవి మార్చేశాయి.

శ్రీ బి.పి. మండల్ గారు రిజర్వేషన్లను తాత్కాలిక ఉపశమన చర్యగా కాకుండా ప్రాథమిక హక్కుగా పేర్కొన్నారు. ఆయన ధైర్యవంతమైన ఆలోచనల వల్లే సామాజిక న్యాయం అనే పదం భారత ప్రజాస్వామ్యంలో కేంద్రస్థానాన్ని సంపాదించింది. నేడు వైద్యులు, ఇంజనీర్లు, ప్రొఫెసర్లు, ఉన్నతాధికారులు వంటి స్థాయిలో వేలాది బీసీలు, ఓబీసీలు వెలుగులోకి రావడానికి కారణం ఆయన చూపిన మార్గమే. స్వతంత్ర భారతదేశంలో నేడు అత్యంత చర్చనీయాంశం కులగణన మరియు దాని ఆధారంగా రిజర్వేషన్ పునర్నిర్వచనం. తెలంగాణలో బీసీ వర్గాలు జనాభాలో 56.33.శాతం ఉన్నప్పటి ప్రస్తుతం సుమారు 42% ప్రభుత్వ ఆదేశాలు ప్రయత్నించిన వారి ప్రాతినిధ్యం ఇంకా తగిన స్థాయిలో లేదు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీ వర్గాలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత రిజర్వేషన్ శాతం వాస్తవ జనాభాకు సరిపడదని బీసీ సంఘాలు వాదిస్తున్నాయి. కులగణన ఆధారంగా వాస్తవిక గణాంకాలు వెలువరించి, బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.బీసీల అంతర్గత ఐక్యత - అవకాశాలకు, అభివృద్ధికీ తిరుగులేని ఆయుధం తెలంగాణ రాష్ట్రంలో బీసీలు 52% జనాభా ఉన్నా, వారికి రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ రంగాల్లో సరైన వాటా దక్కడం లేదు. నిజమైన ప్రజాస్వామ్యం అంటే జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు కల్పించడం.

గ్రామీణ ప్రాంతాల్లో బీసీ చైతన్యం పెరగాలి. ప్రతి గ్రామంలో బీసీ సంఘాలు ఏర్పడి, గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు బీసీల ఐక్యతను బలపరచాలి. బీసీల ఐక్యతే వారి భవిష్యత్తుకు రక్షణ కవచం. రాజకీయ రంగంలో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడం అన్యాయం.పంచాయతీ నుండి పార్లమెంట్ దాకా ప్రతి ఎన్నికలో బీసీలు ఓపెన్ కేటగిరీలోనైనా 42% అవకాశాలు పొందేలా పోటీ పడి గెలవాలి. ఈ ధోరణినే రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల దాకా కొనసాగించాలి.

ఆధిపత్య కులాల వారికి ఓటు వేయకూడదని బీసీలు సామూహికంగా శపథం చేయాలి. ఎగువ బీసీలు దిగువ బీసీలతో ఐక్యంగా ఉండి, వారిని కూడా అవకాశాల్లో భాగస్వాములను చేయాలి. కుల గణన - న్యాయమైన వాటాకు పునాది. బీసీల నిజమైన జనాభా ఆధారంగా కుల గణన జరగాలి. దాని ఆధారంగానే తెలంగాణలో, భారతదేశంలో 42% రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు కావాలి.

బీసీ ఐక్యత ద్వారా ఉచిత విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు సాధ్యం అవుతాయి. కులం %-% వర్గం తేడా లేకుండా బీసీలందరికీ సమానమైన వాటా లభిస్తుంది. ఇలానే కొనసాగితే, బీసీల మధ్య ఐక్యత పెరిగి, అన్ని రంగాల్లో బీసీల వాటా బలపడుతుంది. చివరికి తెలంగాణలో నిజమైన ప్రజాస్వామ్య పరిపాలన స్థాపన అవుతుంది. ఇది కేవలం ఒక డిమాండ్ మాత్రమే కాదు, శ్రీ బి.పి. మండల్ గారి ఆలోచనలకు అనుగుణంగా సామాజిక న్యాయం సాధించాలన్న ప్రయత్నం. ఆయన చెప్పినట్లుగానే, వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కలగకపోతే ప్రజాస్వామ్యం అసంపూర్ణంగా ఉంటుంది. శ్రీ బి.పి. మండల్ గారి కలలు ఇంకా పూర్తిగా నెరవేరలేదు. ఆయన పోరాటం నేటికీ బీసీ వర్గాల నినాదాల్లో, రిజర్వేషన్ ఉద్యమాల్లో, కులగణన డిమాండ్లలో ప్రతిధ్వనిస్తోంది. అందువల్ల ఆయనను మనం కేవలం ఒక చరిత్రాత్మక వ్యక్తిగా కాకుండా, నేటి సామాజిక న్యాయ పోరాటానికి మార్గదర్శకుడిగా స్మరించుకోవాలి. ఆయన జయంతి సందర్భంగా, తెలంగాణలో జరుగుతున్న 42% రిజర్వేషన్ ఉద్యమం ఆయన కలల దిశగా మనలను నడిపించే ప్రేరణ కావాలి. ఆయన ఎప్పటికీ "సామాజిక న్యాయ శిల్పి - వెనుకబడిన వర్గాల పోరాట యోధుడు" గానే నిలిచిపోతారు.

(నేడు శ్రీ బి.పి. మండల్ జయంతి 25 08 2025

డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు
అధ్యక్షులు బీసీ యూనిటీ

## గుండె మోస్తున్న బరువు

నా జీవితం నేర్పుతున్న పాఠాలకంటే
నువ్వు సంపాదించిన ఆస్తులు గొప్పవ ?
తిరిగిరాని కాలం కంటే
మారుతున్న మనుషుల బంధాలు విలువైనవ?
నా గుండె మోస్తున్న దుఃఖం ముందు..
ఎవరికి పనికిరాని నీ ధనం ఎంతటిది..

పరువు కోసం నీ బతుకైతే..
బాధ్యత కోసం నా అడుగులు..
కత్తిలా గుచ్చుకునే నీ మాటల ముందు..
నా మౌనానిదే గెలుపు..
నా కన్నీళ్ల ప్రవాహంలో
నటించే నీ అనుభవం మునిగిపోక తప్పదు..
శవం మీద పేలాలేరుకునే బతుకు నీది..
నువ్వెప్పుడు నాతో సరితూగని తుప్పు పట్టిన వస్తువువే..

ముసుగేసుకొని నటిస్తూ అందరితో నువ్వుంటే..
డబ్బు చూసి పలకరించే మనుషులను దాటి స్వేచ్ఛ కోసం నా పయనం..
పైసల కోసం ఆడది మగాడితో చేసేది వ్యభిచారం కాదు...
ఒక ఆడది ఇంకో ఆడదాన్ని
బంధాల సాకుతో వాడుకొని
వదిలేయడమే అసలైన వ్యభిచారం



తుమ్మల కల్పన రెడ్డి
9640462142

## రోడ్ల అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట

● రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్



**మొయినాబాద్, ఆగస్టు 24 (జనం సాక్షి) :** ప్రజలు అందరూ పలు గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రోడ్లు బాగున్నప్పుడే ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రమాదాల గురికాకుండా వెళ్తారని ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ పేర్కొన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామంలో ఎంపీ నిధులు ఐదు లక్షలతో సిసి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి ఎంతో మెరుగు పడుతున్నాయని అన్నారు. దీనికి నిదర్శనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కొనియాడారు. గ్రామాలు పలు గ్రామాలకు వెళ్లాలంటే అనుసంధానంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు భీమ్ భరత్, బిక్షపతి, మండల పార్టీ అధ్యక్షుడు అనయ్య, ఎంపీటీసీ కేబుల్ రాజు, బాకార మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, కిరణ్ కుమార్, మండల చైర్మన్ బిక్షపతి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్ గౌడ్, మీనాజ్యోతి రాజా, పాషా, సుధాకర్, దేవదాస్, గ్రామ అధ్యక్షుడు గౌరీ రవి, మల్లేష్, శ్రీకాంత్,మధు కార్యకర్తల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

● మంత్రి సీతక్క

**వెల్దండ, ఆగస్టు 24 (జనంసాక్షి) :** అన్ని రంగాల్లో మహిళలకు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యతతో ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర పంచాయితీ రాజ్,మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.ఆదివారం పెద్దాపూర్ గ్రామంలోని యువ నాయకులు కాయితి కిషోర్ రెడ్డి నివాసానికి చేరుకున్న మంత్రి లిసీతక్కతో పాటు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డిలి లను మహిళలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళాలతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్రోల్ పంపులు,ఆర్టీసీ అద్దె బస్సులను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. అదానీ,అంబానీలకు ఫలితమైన సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అందిస్తున్నామని ఉద్ఘాటించారు.త్వరలో మరిన్ని వ్యాపారాల్లోకి మహిళా సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టామని ఆమె తెలిపారు.

### మహిళలకు సమాన అవకాశాలు..

అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలతో పాటు సమాన వేతనాలు ఉండాలన్న లక్ష్యంతో మహిళలకు భూగర్భం నుంచి అంతరిక్ష రంగం వరకు అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు రావాలని తపించి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టామని ఆమె పేర్కొన్నారు. మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగిన వివక్షత కొనసాగుతూనే ఉంది.మహిళలు ఎమ్మెల్యేలు,మంత్రులు, ఐఏఎస్‌లు అయినా లైంగిక అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారని ఒకప్పుడు మహిళలకు



వ్యవసాయం, పరిశ్రమలు మాత్రమే ఉపాధి మార్గాలు. కానీ ఇప్పుడు ఎన్నో రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. అయినప్పటికీ మహిళల పట్ల సమాజంలో చిన్న చూపు పోవడం లేదు.ప్రతి రంగంలో మహిళల ప్రస్థానాన్ని,వారి స్థానాన్ని సమీక్షించాలి. లింగ సమానత్వం విషయంలో ఐక్యరాజ్యసమితి నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంత మేర మనం చేరుకోగలుగుతున్నామో ఆవలోకనం చేసుకోవాలని. మహిళలకు సమానత్వం,సమాన అవకాశాలు రావాలి.లింగ అంతరాలను తుంచితినే సమాజంలో సమానత్వం. శారీరకంగా మహిళలకు ఎన్నో ప్రతికూలతలు ఉన్నాయి. వాటన్నింటినీ అధిగమించి మహిళలు మందంజ వేస్తున్నారని ఆమె తెలిపారు. మహిళల ప్రతికూలతలను దృష్టిలో ఉంచుకొని విధానాల రూపకల్పన జరగాలి'అని మంత్రి సీతక్క తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఆదిశగా ప్రజా ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. మహిళా అనుకూలంగా అత్యుత్తమ విధానాన్ని రూపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. అనుభవజ్ఞులంతా సలహాలు సూచనలు చేస్తే,అనుగుణంగా నూతన విధానాన్ని రూపొందిస్తాం. లింగ సమానత్వాన్ని సాధించడంలో మహిళా సంఘాల పాత్ర గణనీయంగా ఉందని ఆమె పేర్కొన్నారు. మహిళా సంఘాలు మహిళలకు ఆర్థిక రక్షణతో పాటు సామాజిక భద్రత కల్పిస్తున్నామని ఆమె తెలిపారు.ఈ ఏడాది అనుకున్న లక్ష్యాలకు మించి మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించామని రూ.20వేల కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించుకుంటే.. రూ.22 వేల కోట్ల వరకు రుణ సౌకర్యం కల్పించామని ఆమె వివరించారు. మహిళా తన కాళ్ల మీద తాను నిలబడాలి,రాజకీయ రంగంతోపాటు అన్ని రంగాల్లో బలమైన శక్తిగా ఎదగాలి.రాజ్యాలు సొంతగా పాలన చేసేలా మహిళలు ఎదగాలని ఆమె ఆకాక్షించారు.మహిళలే అసలు సిసలు ఆర్థిక శాస్త్రవేత్తలు.పుస్తకాల ఆర్థిక శాస్త్రవేత్తలు ఎందరో ఉంటారు.. కానీ ఆచరణలో,కుటుంబ నిర్వహణలో మహిళలే అత్యున్నత ఆర్థికవేత్తలు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అతివలు అపూర్వ విజయాలు సాధిస్తున్నారు. మహిళా అభివృద్ధితోనే సమాజం ప్రగతి సాధిస్తుందని ఆమె తెలిపారు.రాబోయే కాలంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో రెండు మెట్లు మహిళలు ఎదిగేలా కృషిచేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కిషోర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ కార్యదర్శులు మెరుగు రమేష్ రెడ్డి,తక్కళ్ళపల్లి శేఖర్,కిసాన్ సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటిక రామస్వామి, పోలే రాజు, పాండు నాయక్, రమేష్ నాయక్, జయంత్ రెడ్డి, నెంట రాజు, కొప్పు ఏర్రయ్య, జగన్, శ్రీకాంత్ రెడ్డి, జిలానీ, రాఘవేందర్ రెడ్డి, సురేష్, అనిల్ నాయక్, ఆదర్శ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజా దర్బార్



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 24 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ చేపట్టినట్లు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావ్ తెలిపారు. ఆదివారం మెదక్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సాయంత్రం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయికి అందేలా కృషి చేస్తానన్నారు.అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు అందిస్తామని తెలిపారు.రేషన్ కార్డులు లేని వారందరికీ రేషన్ కార్డులు ఇప్పిస్తామన్నారు.ఎన్నికల్లో చెప్పిన విదంగా ఆరు గ్యారెంటీ లను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. మెదక్ నియోజకవర్గం లో మౌళిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కి కోట్లాది రూపాయల నిధులు తెచ్చినట్లు తెలిపారు.నియోజకవర్గ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి వారి కష్ట సుఖాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గం లోని సుమారు నాలుగు వందల మందికి పైగా ప్రజలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని తమ తమ సమస్యలపై విజ్ఞప్తులను తీసుకొచ్చి ఎమ్మెల్యే కు అందజేశారు.సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించగా మరిన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ ప్రజా దర్బార్ లో మున్సిపల్ మాజీ చేర్మెన్ తొడుపునూరి చంద్రపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొజ్జ పవన్, ఉప్పల రాజేష్ శ్రీనివాస్ చౌదరి, గంగాధర్ ఆంజనేయులు గౌడ్, లింగం, లక్ష్మీనారాయణ గౌడ్, క్రిష్ణ, లల్లూ, హరిత నర్సింగ్ రావ్, తహేర్,మహిపాల్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి నిర్ణయం అభినందనీయం

● ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

**తాండూరు, అగస్టు 24 (జనంసాక్షి) :** వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెందాలని ఆర్బిఓఎల్ సీఈఓ శ్రీనివాసరడ్డి పేర్కొన్నారు.ఆదివారం పట్టణంలో ఎస్.ఆర్.ఎస్ గ్రాండ్ హెూటల్ ను ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్.ఆర్.ఎస్ గ్రాండ్ హెూటల్ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్వయం ఉపాధి నిర్ణయం అభినందనీయమని అన్నారు. కస్టమర్లు దైవంతో సమానమని సూచించారు. హెూటల్ కు వచ్చే కస్టమర్ల పట్ల సమన్వయం పాటించాలని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులకు ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.ఎస్ గ్రాండ్ హెూటల్ యాజమాన్యం చక్రపాణి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బంటు వేణు లక్ష్మప్ప తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## యువత వ్యాపార రంగాలలో రాణించాలి

● మెడ్‌ప్లస్ షాపు ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, ఆగస్టు 24 (జనంసాక్షి) :** యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యాపార రంగాలలో రాణించాలని, ఉపాధితో పాటు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కందాడ గ్రామ యువకుడు గుర్రాల శశివర్ధన్ రెడ్డి చేవెళ్ల పట్టణంలో ఏర్పాటుచేసిన మెడ్ ప్లస్ మెడికల్ షాపును చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక వైద్య సదుపాయాలు చేరువ కావడం ఆనందకరమని అన్నారు. ప్రజలకు అనుకూలమైన ధరలకే నాణ్యమైన ఔషధాలు అందించాలనే ఉద్దేశంతో మెడ్ ప్లస్ వంటి సంస్థలు ముందుకు రావడం ఆరోగ్య భద్రతకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. గుర్రాల శశివర్ధన్ రెడ్డి ప్రారంభించిన ఈ మెడ్ ప్లస్ షాపు స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందనన్నారు. ప్రజలకు



అనుకూలంగా మెడ్ ప్లస్ ఏర్పాటుచేసిన గుర్రాల శశివర్ధన్ రెడ్డిని ఎమ్మెల్యే కాలే యాదయ్య అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్, నాయకులు బండారి శైలజాఆగి రెడ్డి, దేవర సమతారెడ్డి, పెంటయ్య గౌడ్, ముడి మ్యాల సొసైటీ గోనే ప్రతాప్ రెడ్డి, మర్పల్లి కృష్ణారెడ్డి, సాయిరెడ్డి, బలవంత్ రెడ్డి, డాక్టర్ మల్గారి వైభవరెడ్డి, అత్తెల్లి అనంత్ రెడ్డి, కేశపల్లి వెంకట్ రాంరెడ్డి, అత్తెల్లి శ్రీనాథ్ రెడ్డి, మల్లేష్, రవీందర్ యాదవ్, కుమార్, రాఘవేందర్ రెడ్డి, బలవంత్ రెడ్డి, పెద్దోళ్ల ప్రభాకర్, పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరాటే ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసానికి దోహదపడుతుంది



**రాజేంద్రనగర్, ఆగస్టు 24 (జనం సాక్షి) :** కరాటే ఆత్మ రక్షణతో పాటు, క్రమశిక్షణకు దోహదపడుతుందని శంషాబాద్ మాజీ జెడ్పిటిసి నీరటి తన్విరాజ్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం నర్కూడ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆవరణంలో వారియర్స్ కరాటే ఇంటర్నేషనల్ సంస్థ వారు యాదగిరి మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి కరాటే శిక్షణ ప్రతిభావంతులకు సర్టిఫికెట్స్, బెల్ట్స్ ఇచ్చి వారి ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల శ్రద్ధ చూపి తమ పిల్లల అభిరుచిని కనిపెట్టి వారికి ప్రోత్సహించాలన్నారు. నేటి పిల్లలు సెల్ ఫోన్స్ ,వీడియో గేమ్స్ ఇంటర్నెట్ల పై అధిక సమయం కేటాయిస్తూ తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నారని, శారీరక శ్రమ లేకపోవడంతో నిస్సత్తువ తో అనారోగ్యాల పాలవుతున్నారని, క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేసి ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయని కరాటే కూడా ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ కల్పించడంలో దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటులు ఇంద్రసేనా, కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ కరాటే వారియర్స్ మేనేజింగ్ డైరెక్టర్ బాలేష్ , నర్కూడ మాజీ ఎంపిటిసి సి. శ్రీనివాస్, మల్కారం డైరెక్టర్ శివాజీ, గ్రామ ప్రజా ప్రతినిధులు ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధే లక్ష్యం

కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్



**అల్వాల్, ఆగస్ట్ 24 (జనంసాక్షి) :** మచ్చబొల్లారం రాయల్ ఎన్‌క్లేవ్ కాలనీ, లక్ష్మీనగర్ వాసులు తమ కాలనీల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ జితేంద్రనాథ్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. రాయల్ ఎన్‌క్లేవ్‌లోని రోడ్ నెం.3, 8తో పాటు అవసరమైన చోట్ల సీసీ రోడ్లకు మంజూరు కల్పించాలని కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు కోరారు. అదే విధంగా లక్ష్మీనగర్ వాసులు తమ ప్రాంతంలో గుర్తించిన రహదారులపై అత్యవసరంగా సీసీ రోడ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జితేంద్రనాథ్ మాట్లాడుతూ రెండు కాలనీల వాసుల అభ్యర్థనల పట్ల సానుకూలంగా స్పందించానని, త్వరితగతిన అవసరమైన అనుమతులు, నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

**వెల్దండ, ఆగస్టు 24 (జనంసాక్షి) :** వెల్దండ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. పనుల జాతరలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో రూ.12లక్షలతో నిర్మించనున్న అంగన్ వాడి భవనానికి శంకుస్థాపన, కంటోనిపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడాతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, కంటోనిపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణ, ఉప సర్పంచ్ సురేందర్, నాయకులు భూపతి రెడ్డి, సంజయ్ కుమార్ యాదవ్, మోతిలాల్ నాయక్, పర్వత్ రెడ్డి, మట్ట వెంకటయ్య గౌడ్, తిరుపతి రెడ్డి, కొయ్యల పుల్లయ్య, రాజశేఖర్, కేశమల్ల కృష్ణ, హరికిషన్, లక్ష్మణ్ స్వామి, బస్నమోని శ్రీను, ముదిగొండ రమేష్, శ్రీను



యాదవ్, సంబంధిత అధికారులు ఉన్నారు.

## సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి



**ఇబ్రహీంపట్నం, ఆగష్టు 24 (జనం సాక్షి) :** సీపీఎస్ ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని తపస్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) చంద్రరెడ్డికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు కానుగంటి హన్మంతరావు , తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశి, పూజారి రమేశ , రాష్ట్ర భాద్యులు శ్రీహరి కృష్ణ, , బాలకృష్ణ, అస్కని రాజు, పాల్గొన్నారు.

# సొంతింటి కల రేవంత్ రెడ్డితోనే అభివృద్ధి

**మొయినాబాద్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పేదలకు సొంతింటి కల నెరవేర్చడం కర్తవ్యంగా నిర్వహిస్తున్నారని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మత్స్యకారుల సంఘం చైర్మన్ బాకారం మహేందర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారము మండల కేంద్రంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటూ పేదలు వారి ఇండ్ల వద్ద పనులు చేసుకుంటున్నప్పటికీ ఇతర పార్టీల నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 48వేలదరఖాస్తులు చేసుకోగా అందులో ప్రభుత్వం ద్వారా దాదాపు 18వేల మందికి ఇండ్లను మంజూరు చేసి వారు ఇండ్లు కట్టుకునే విధంగా కాంగ్రెస్ నాయకులు అండగా ఉన్నారని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేద ప్రజలను మోసం చేసి దోచుకుందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ మొయినాబాద్ మండలంలో నిర్మించిన ఎవరికి పంచ లేకపోయారని విమర్శించారు. అధికారులను వివరణ అడిగితే పూర్తిగా పనులు జరగలేదని తెలుపుతూ..కాలాన్ని గడుపుతున్నారని కనీసం డబుల్ బెడ్ రూమ్ మంజూరైన వారికి అర్హులకు అందిస్తే వారి కుటుంబ సభ్యులు సంతోషంగా ఉంటారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హాయంలో దాదాపు 20నెలల లో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపడుతున్న వాటిని చూసి ఆయా పార్టీలు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకొని కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహిళలకు ప్రభుత్వం ద్వారా బిల్లులు బ్యాంకులలో అందుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా యువ నాయకుడు డైనమిక్ లీడర్ ఎంతో ప్రజలకు అండదండలతో ముందుంటూ మీరే మా ప్రభుత్వం అంటూ ప్రజలను కృషి చేస్తున్న నాయకుడు రేవంత్



రెడ్డిని చూసి ప్రజలు నిలువెత్తున దండాలు పెట్టడం అర్శించదగ్గ విషయమని మహేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఆయా పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

# జాతరకల్లా కోనేరును అత్యద్భుతంగా తీర్చిదిద్దుతాం

- మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** రాబోయే డిసెంబర్ నెలలో జరగబోయే మక్తల్ పట్టణ పడమటి ఆంజనేయస్వామి జాతర బ్రహ్మోత్సవాలకు కోనేరును ఎవరూ ఊహించని రీతిలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలంగాణ రాష్ట్ర పాడి పశు సంవర్ధక డైరీ క్రీడా, మత్స్య శాఖామంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం పడమటి ఆంజనేయస్వామి ఆలయ కోనేరు సుందరీ కరణ పనులను ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పడమటి ఆంజనేయస్వామి కోనేరును గతంలో ఎవరూ పట్టించుకోలేదని, పూర్తిగా అపరిశుభ్రంగా మారిందని, అయితే కోనేరును పూర్తిగా సుందరీకరణ చేసి, తిరుమల, యాదగిరి గుట్ట తరహాలో అత్యద్భుతంగా తీర్చిదిద్ది రాబోయే జాతర ఉత్సవాలకు భక్తులు కోనేరు లోనే స్థానమాచరించి స్వామివారిని దర్శించుకునే లాగా చర్యలు



చేపడతామని తెలిపారు. పూర్తిగా ఎమ్మెల్యే సొంత నిధులతో సుందరికరణ పనులు చేపడుతున్నామని, ప్రముఖ ఆర్కిటెక్చర్ కల్పన కోనేరు సుందకరణ పనులను పర్యవేక్షిస్తున్నారని అన్నారు. పడమటి ఆంజనేయ స్వామి భక్తులు, పట్టణ వాసులు సైతం కోనేరు సుందరీకరణ పనులలో భాగం కావచ్చని, ప్రతి ఒక్కరూ తలా చేయి వేసి కోనేరును మరింత సుందరంగా తయారు చేసుకునేందుకు భాగస్వామ్యం కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆర్కిటెక్చర్ కల్పన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా కోనేరులను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తాము భాగస్వామ్యం అవుతున్నామని, అందులో భాగంగా నియోజకవర్గంలోని పలు కోనేరుల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ప్రాణేశా చారి, ఈవో శ్యాం సుందరాచారి, మున్సిపల్ ఏఈ నాగ శివ, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ. రవికుమార్, కట్టా సురేష్ గుప్తా, గొల్లపల్లి నారాయణ, కావలి తాయప్ప, కావలి ఆంజనేయులు, చంద్రశేఖర్ గౌడ్, హేమ సుందర్, గాయత్రి అనిల్ వల్లంపల్లి లక్ష్మణ్, ఆడేం శ్రీనివాసులు, పూజ శివ, కల్లూరి గోవర్ధన్, బోయ వెంకటేష్, కట్ట వెంకటేష్, మందుల నరేందర్, గుడేబల్లూరు నాగరాజ్, కావలి రాజేందర్, మామిళ్ళ ఆంజనేయులు, జి. రవికుమార్ కృష్ణ, మహమ్మద్ శలం, నూరుద్దీన్, ఫయాజ్, ఆలయ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెరల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్‌చెరు, ఆగస్టు 24 (జనం సాక్షి) :** పటాన్చెరు నియోజకవర్గంలో వెనకబడిన వర్గాలకు ఆత్మ గౌరవ భవనాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందించడంతోపాటు.. వడ్డెర కులస్తుల సంక్షేమానికి అండగా నిలుస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ మంజీర నగర్ లో ఒక కోటి 25 లక్షల రూపాయలు వడ్డెర సంఘం కాంట్రాక్టర్ల సి ఎస్ ఆర్ నిధులతో 1500 గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మించిన వడ్డెర సంగం నూతన కమ్యూనిటీ హాల్ ను ఆదివారం సాయంత్రం ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని వడ్డెరల సంక్షేమానికి ఎల్లప్పుడు అండగా ఉంటున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో వడ్డెరలకు తగు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వడ్డెర సామాజిక వర్గంలోనూ ఉన్నత చదువులు చదువుతూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని అభినందించారు. నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను నిరుపేద కుటుంబాల వివాహాలకు నామమాత్రపు రుసుముతో అందించాలని కోరారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కొల్లూరి మల్లేష్, గోపాల్, ప్రమోద్ రెడ్డి, సీనియర్ నాయకులు రుశ్వంత్ రెడ్డి, యునూస్, దాసు, వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు గొలుసుల కోమరయ్య, ఉపాధ్యక్షుడు రవి, వడ్డెర సంఘం సభ్యులు గంగయ్య, వెంకన్న, గొలుసుల వెంకటేష్, సంఘం ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కోటమైసమ్మ బోనాలు



**రాజాపూర్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** మండల పరిధిలోని రంగారెడ్డి గూడ గ్రామంలో కోటమైసమ్మ బోనాలు అంగరంగవైభవంగా నిర్వహించిన గ్రామస్తులు. పోతురాజుల ఆటలతో,ఊరేగింపుగా మహిళాలు కోటమైసమ్మకు నైవేద్యం బోనాలతో సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళా రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాములు గౌడ్, నాయకులు శివప్రసాద్, లక్ష్మీ నారాయణ గౌడ్, యువకులు సంజీవ్,వెంకటేష్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24 (జనం సాక్షి) :** నారాయణపేట పట్టణానికి చెందిన ఇటీవల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను ఆదివారం స్నేహ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి తినిపించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేష జీవితం ప్రజా సేవకు అంకితం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు సిద్ది వెంకట్ రాములు, డి. మల్లేష్, మిర్చి వెంకటయ్య, గుత్తి రమేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శీల చంద్రశేఖర్ రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- ఏడు తులాల బంగారం
- 70 తులాల వెండి, సెల్‌ఫోన్ స్వాధీనం
- సీఐ అశోక్ రెడ్డి

**బిజినేపల్లి, ఆగస్టు 24 (జనం సాక్షి) :** గత ఏడాదిగా రాత్రివేళ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నాగర్ కర్నూల్ సీఐ అశోక్ రెడ్డి చోరీ ఘటనలకు సంబంధించి వివరాలు వెల్లడించారు. పాలెం గ్రామానికి చెందిన బత్తుల మల్లేష్ పెయింటర్‌గా పని చేస్తూ చోరీలకు పాల్పడుతున్నట్టు తమ విచారణలో వెల్లడైనట్లు సిఐ వివరించారు. జులై నెల చివరలో గ్రామంలోని భారతి ఇంట్లో చోరీకి పాల్పడి పక్కనే ఉన్న వెంకటయ్య ఇంట్లో సెల్ఫోన్ దొంగిలించినట్లు వివరించారు. వెంకటయ్య ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందంతో విచారణ చేపట్టగా నిందితుడు దొరికినట్లు తెలిపారు. ఐదు దొంగతనాల్లో చోరీకి పాల్పడిన ఏడు తులాల బంగారం 70 తులాల వెండి సెల్ ఫోన్ స్వాధీనపరచుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో ఎస్సై కే. శ్రీనివాస్ తోపాటు పోలీస్ బృందం



ప్రత్యేక చొరవ చూపడంపై అభినందించారు. గ్రామాల్లో పండగలకు తీ ర్థయాత్రలకు వెళ్లే ప్రజలు ఇండ్లలో విలువైన వస్తువులు నగదు ఉంచుకోవద్దని కనీసం సంబంధిత పోలీస్ స్టేషన్లో సమాచారం అందిస్తే గస్తీ కాసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆయా కాలనీల ప్రజలు తమ సొంత ఖర్చులతో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది ప్రవీణ్ ఆంజనేయులు శివకుమార్ నరసింహ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ స్వామికి సీపీ చేతుల మీదుగా నగదు రివార్డు



**చేర్యాల, ఆగస్టు 24 (జనంసాక్షి) :** ఇటీవల చేర్యాల మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ఓ మహిళ కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై చెరువులోకి దూకి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించగా అటువైపు వాకింగ్ చేసుకుంటూ వెళ్తున్న చేర్యాల పీఎస్ లో విధులు నిర్వహిస్తున్న తాంద్ర స్వామి వెంటనే చెరువులోకి దిగి ఈత కొడుతూ మహిళను బయటకు లాగుకొచ్చి మునిగిపోకుండా రక్షించారు. ఈ విషయమై సిద్దిపేట సీపీ అనురాధ విషయం తెలుసుకొని ఆదివారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కానిస్టేబుల్ స్వామికి ప్రశంస పత్రంతో పాటు నగదు రివార్డును అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఒక పెద్ద విషాదాన్ని నివారించి తన కర్తవ్యాన్ని మానవత్వానికి ప్రేరణాత్మకమైన విశేష ధైర్య సాహసాలు ప్రదర్శించినందుకు కానిస్టేబుల్ ను అభినందిస్తున్నామని పేర్కొన్నారు. వారి వెంట చేర్యాల సీఐ లక్కేపురం శ్రీను, ఎస్.ఐ వేముల నవీన్ లు ఉన్నారు.

# గౌతాపూర్ పాఠశాలకు మినీ వాటర్ ప్లాంట్

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి

**చిలప్‌చేడ్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** విద్యార్థులకు తాగునీటి సమస్య తీర్చిన మెదక్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి.చిలప్ చేడ్ మండలంలోని గౌతాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో సర్గీయ కామ్రేడ్ చిలుముల కిషన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల త్రాగునీటికై సుమారుగా 65 వేల రూపాయలతో, 300 లీటర్ల మినీ వాటర్ ప్లాంట్ ను ఆదివారం నాడు మెదక్ గ్రంథాలయ చైర్ పర్సన్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డితో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో హామీ ఇచ్చిన మేరకు విద్యార్థులకు మినీ వాటర్ ప్లాంట్ ప్రారంభించడం జరిగింది ఇకమీదట విద్యార్థులకు ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ విట్టల్, తాజా మాజీ సర్పంచ్ స్వరూప విట్టల్, గుజరి తాండ మాజీ సర్పంచ్ రాకేష్, మాజీ జెడ్పిటిసి చిలుముల శేష



సాయి రెడ్డి,మాజీ మండల వైస్ ఎంపిపీ విశ్వాంబర స్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హంసి బాయ్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, మండల ముఖ్య నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 24 (జనం సాక్షి) :** ర్యాగింగ్ చేయడం నేరం, ర్యాగింగ్ లాంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు" అని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. 1997 నుండి అమల్లో ఉన్న "ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్" ప్రకారం ర్యాగింగ్ ఒక క్రిమినల్ నేరం. విద్యార్థులు తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే క్రిమినల్ కేసులు, విద్యాసంస్థల నుండి తొలగింపు, భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. సీనియర్లు జూనియర్లను వేధించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని హెచ్చరించారు. అలాగే, విద్యాసంస్థల యాజమాన్యం పట్ల కూడా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి కళాశాలలో యాంటీర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలి. కొత్తగా చేరిన విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి. అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిరంతరంగా నిర్వహించాలి. విద్యార్థులు ఎటువంటి వేధింపులు, దౌర్జన్యాలు ఎదుర్కొన్నా యిళాశాల యాజమాన్యనికి లేదా నేరుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ర్యాగింగ్ అనేది విద్యార్థుల వ్యక్తిగత భవిష్యత్తును మాత్రమే కాకుండా సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. విద్యార్థుల పిర్యాదు కోసం డయల్ 100 లేదా మెదక్ పోలీస్ కంట్రోల్ రూమ్: o91 87126 57888 గాని పిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 24 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రజలకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని రాష్ట్ర అబ్కారి, పర్యాటక సాంస్కృతిక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం వీపనగండ్ల మండల కేంద్రంలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ తో కలిసి వీపనగండ్ల మండల కేంద్రం నుంచి బెక్కం గ్రామానికి రూ. 3.90 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారికి మంత్రి శంకుస్థాపన చేశారు. కుట్టు మిషన్ల పంపిణీ నిరుపేద మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి పథకం కింద మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన కుట్టు మిషన్లను 19 మంది మైనారిటీ నిరుపేద మహిళా లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. వాటిని సద్వినియోగం చేసుకొని, ఉపాధి పొందాలని వారికి సూచించారు. మహిళలు ఎటువంటి భయం లేకుండా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో ముందుకు రాణించాలని సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

వీపనగండ్ల మండల కేంద్రంలో అలివేల, బొల్లారం గ్రామ పరిధిలో మంజుల, రాధా అనే లబ్ధిదారులకు చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు మంత్రి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ప్రభుత్వం నుంచి విడతల వారీగా రూ. 5 లక్షలు మంజూరు చేస్తుందని, ఇందుకోసం ఎవరికీ ఒక రూపాయి కూడా చెల్లించవలసిన అవసరం లేదని మంత్రి లబ్ధిదారులకు సూచించారు.

### ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని ప్రారంభించిన మంత్రి



బొల్లారం గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన పల్లె దవాఖాన భవనాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అదేవిధంగా బొల్లారం గ్రామంలో జెడ్పి ఉన్నత పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ. 5 లక్షలతో చేపట్టిన పనులకు మంత్రి భూమి పూజ చేసి ప్రారంభించారు.ఆర్డీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అధికారులు, మండల తహసిల్దార్, ఎంపీడీవో, ఇతర మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ మండల ఫోటో, వీడియోగ్రఫీ నూతన కార్యవర్గ ఎన్నిక

- నూతన అధ్యక్షుడుగా పి. సురేందర్



**మెదక్, ఆగస్టు 24 (జనం సాక్షి) :** మెదక్ మండల ఫోటో మరియు వీడియో గ్రఫీ వెల్ఫేర్ అస్సోసియేషన్ 2025-2028 సంవత్సరంనకు నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి కార్యవర్గ ఎన్నిక పదవులకు నేడు మెదక్ పట్టణంలోని న్యూ భారత్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం రోజున ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎలక్షన్ లో భాగంగా అధ్యక్ష, ప్రధాన, కోశాధికారి పదవులకు పి. సురేందర్, హరిష్, తొగిట శ్రీకాంత్‌లు ఒక ప్యానల్‌గా, బస్వరాజ్, బోయిని శ్రీకాంత్, శశివర్ధన్ రెడ్డి ఒక ప్యానల్‌గా ఏర్పడి ఎలక్షన్ నిర్వహించారు. ఈ ఎలక్షన్‌లో మొత్తం 131 ఓట్లు పోలవ్వాగా ఇందులో 2 ఓట్లు పరిగణలోకి రాక పొగ మొత్తం 129 ఓట్లుగా ఎలక్షన్ కమిటీ ప్రకటించగా ఇందులో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, పి.సురేందర్, హరీష్, తొగిట శ్రీకాంత్ వారి ప్యానల్ ఒక్క ఓటు తేడా తో గెలుపొందారు. ఈ ఎలక్షన్‌లో గెలుపొందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులను మెదక్ జిల్లా ఫోటో, వీడియోగ్రఫీ వెల్ఫేర్ అస్సోసియేషన్ జిల్లా అధ్యక్షులు కంచి ఆనంద్, ప్రధాన కార్యదర్శి బండ చంద్రశేఖర్, కోశాధికారి కూచన శ్రీధర్‌లు ఘనంగా శాలువాతో సత్కరించి, నియామక పత్రంను అందించి వారి సేవలను ఫోటో గ్రఫీ రంగానికి అందేలా కృషి చేయగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, ఎన్నికల కమిటీ సభ్యులు నవ్య రామకృష్ణ, బాలాజీ ఫోటో స్టూడియో రామకృష్ణ, మహేష్ , రంజిత్ కుమార్, మెదక్ మండల ఫోటోగ్రాఫర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు


**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 24 (జనం సాక్షి) :** వరంగల్‌లో జరిగే ఆదివాసుల సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో జరిగే సభను అడ్డుకోవడమే కాకుండా శనివారం అర్ధరాత్రి జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చైతన్య మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు బన్నూరు జ్యోతి, ఉమ్మడి పాలమూరు జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ఎండి. సుభాన్ ను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడం తగదని, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆదివారము స్థానిక తెలంగాణ జన సమితి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రజ సంఘాల నాయకులు ఖండించారు.చైతన్య మహిళా సంఘం నాయకురాలు జ్యోతి, పౌర హక్కుల సంఘం సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండి సుభాన్ లను అర్ధరాత్రి భయభ్రాంతులకు గురిచేసేవిధంగా అరెస్టులు చేయడం కాంగ్రెసు ప్రభుత్వం నిరంకుశత్వాన్ని ప్రదర్శించి, అరెస్టులు చేసిన వాళ్లని



మొబైల్స్‌లను లాక్కొని, ఎవరిని కలవకుండా ఎవరితో మాట్లాడకుండా చేయడమనేది ప్రజాస్వామ్యానికి విరుద్ధమైనచర్యని, ప్రజాస్వామ్య దేశంలో పౌర హక్కులను పోలీసులు కాలరాస్తున్నారనీ, మునుపెన్నండు లేనివిధంగా ప్రజాస్వామ్యబద్ధంగా సభలు నిర్వహించుకుంటుంటే నిర్వహించకుండా అక్రమ అరెస్టులు చేయడం బాధాకరమని, అక్రమ అరెస్టులను వివిధ ప్రజా సంఘాల నాయకులు ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం నాయకులు ఎం. మహదేవ్,తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ సంకర ప్రభాకర్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు రేవతి,తెలంగాణ జన సమితి గద్వాలజిల్లా ఇన్చార్జ్ ఆలూరు ప్రకాష్ గౌడ్,బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, చైతన్య మహిళా సంఘం జిల్లా నాయకులు రాణి ,వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసింగ్‌ను తప్పుదారి పట్టించేందుకే సత్సంబంధాలా?

- పోలీసుల పరిచయంపై పాలకుల్లో పరుగులెందుకు...?
- పసికట్టి పక్కకు పెడతారా..?పైరవీలకు ప్రాధాన్యతిస్తారా...?
- పోలీస్ - ప్రజా నాయకుల తీరుపై ప్రజల ప్రశ్నల పర్వం




**రేగొండ, ఆగస్టు 24 ( జనం సాక్షి):** మండలంలో కొత్తగా ఎస్సై మారిన ప్రతిసారి నాయకులు చేస్తున్న వింత తంతు ప్రజల్లో తీవ్ర చర్చకు దారి తీస్తుంది.మండల కేంద్రంలో ఉన్న ఠాణాకు నూతన ఇన్స్పెక్టర్ గా ఎవరు బాధ్యతలు చేపట్టిన ప్రజా నాయకుల శాలువాలతో కూడిన పరిచయ కార్యక్రమమే ఆ చర్చకు కారణమైంది. ప్రజానాయకులు నూతన ఇన్స్పెక్టర్ ను పరిచయం చేసుకోవడంలో తప్పేముంది అని కొందరిలో తలెత్తిన ప్రశ్న అర్థవంతమే అయినా మండలంలో ఏ అధికారి బాధ్యతలు చేపట్టిన లేని పరిచయ కార్యక్రమం ఇన్స్పెక్టర్ విషయంలో పోటీ పడి పరిచయం చేసుకోవడమే ప్రజలకు అర్థంకాకున్నది. సమాజానికి, ప్రజలకు సేవ చేయాలన్న మంచి దృక్పథంతో నిస్వార్థమైన సేవలందించే వారు పొలిటీషియన్స్.అయితే ప్రజాసేవ చేసేందుకు పోలీసులతో సత్సంబంధం పెంచుకోవాల్సిన అవసరం ఏముంది? పోలీసులకు పొలిటిషియన్స్ మధ్య దాగి ఉన్న రహస్యమేంటి అన్నది పై చర్చకు ప్రాణం పోస్తుంది.

**పోలీసులను తప్పుదారి పట్టించేందుకే సత్సంబంధాలా...?**

సాధారణంగా గ్రామాల్లో పెద్దమనుషులకు ప్రజలు ప్రాధాన్యత ఇస్తుంటారు.అందులో పోలీస్ స్టేషన్లో పనులయ్యే పెద్దమనుషుల ప్రాధాన్యత ఇంకాస్త మెరుగ్గానే ఉంటుంది.ఇదిలా ఉంటే పోలీసులు కొన్ని సందర్భాలలో కేసుల విచారణలో భాగంగా కొందరి అభిప్రాయాలపై ఆధారపడాల్సి ఉంటుంది.అందులో మొదటి వరుసలో పొలిటీషియన్ ఉంటారు.దీన్ని అదునుగా తీసుకున్న కొంత మంది నాయకులు పోలీస్ స్టేషన్లో తమ పరపతిని ఉపయోగించుకొని గ్రామాల్లో తమ అనుకున్న వారికి సహకరిస్తూ పోలీసులను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మన కండ్లకు కనపడుతూనే ఉంటాయి.

**పసికట్టి పక్కకు పెడతారా...? పైరవీలకు ప్రాధాన్యతిస్తారా...?**

పోలీసులకు ఇలాంటివి పసికట్టడం శిక్షణలో భాగమయ్యే ఉంటుంది.కానీ స్థానిక పరిస్థితులకు అనుగుణంగానో,పెద్ద రాజకీయ నాయకుల ప్రోత్సలంతోనో కొన్ని సందర్భాలలో వెనకడుగు వేస్తుంటారు.ఇదంతా సాధారణమే అయినా రేగొండ మండల పరిస్థితి కాస్త భిన్నంగానే ఉంటుంది.రేగొండలో నిత్యం పదుల సంఖ్యలో పంచాయితీలు పోలీస్ స్టేషన్ తలుపులు తడుతూ ఉంటాయి.దానికి తోడు రాజకీయ నాయకుల వత్తిళ్లు ఎక్కువగా ఉండటంతో పాటు ప్రజలు అన్ని రంగాల్లో సృజనాత్మికులై ఉంటారు.ఇదే అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు విధుల నిర్వాహణలో కత్తి మీది సామును తలపిస్తుంది.ఏది ఏమైనా ఇన్ని అవాంతరాలను అధిగమించి పై విధమైన పెద్ద మనుషులను పసికట్టి పక్కకు పెట్టి సామాన్య ప్రజల మన్ననలు పొందుతారా...పైరవీలకే ప్రాధాన్యమిస్తారా...? అన్నది పోలీసుల భవిష్యత్ తీరుపై ప్రజలు ఓ కన్నేసి చూస్తున్నారన్నది గమనించదగ్గ విషయం...

# హాస్టల్ సిబ్బందిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలి

- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ లో విషప్రయోగానికి కారకులైన టీచర్లను, సిబ్బందిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు అస్వస్థతకు గురై ప్రభుత్వ వంద పడకల హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆదివారం ఆమె పరామర్శిం చారు. ఈ సందర్భంగా చందుపట్ల కీర్తిరెడ్డి మాట్లాడుతూ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో జరిగినటువంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకూడదంటే విద్యార్థుల పరిస్థితులకు కారణమైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి జైల్లో వేయాలని అన్నారు. పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వాల మీద నమ్మకంతో తమ పిల్లలను హాస్టల్లో ఉంచుతూ చదివిస్తుంటే ఇలాంటి సంఘటనల వల్ల ప్రభుత్వ విద్యాలయాలపై, హాస్టల్స్ పై ప్రజలకు నమ్మకం పోతుందని అన్నారు. విద్యార్థులకు జరిగిన ఈ సంఘటన పట్ల అనేక అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ఈ సంఘటనకు ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఉన్నాయా, లేక కాంట్రాక్ట్ దక్కించుకోవడానికి బడా బాబులు ఎవరైనా ఉన్నారా ఈ పరిస్థితి రావడానికి ఇంకా ఎవరైనా హస్తం ఉందా అనే కోణంలో ప్రభుత్వం, ఎమ్మెల్యే సిబిఐ ఎంక్వయిరీ చేయించాలని ప్రజల అనుమానాలకు సమాధానం చెప్పాలని అన్నారు. నేరస్తులు తప్పించుకోకుండా కఠినంగా శిక్ష పడే విధంగా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ఏడునూతల నిశిధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, తాటికొండ రవికిరణ్, ఉపాధ్యక్షులు సామల మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బట్టు రవి, కంబాల రాజయ్య, సయ్యద్ గాలిఫ్, మాచనవేణి రవీందర్, అజ్మీర రాజు నాయక్ పాల్గొన్నారు.

# చెరువులో అక్రమంగా దున్నకం

- గ్రామస్థుల ఆగ్రహం
- ప్రభుత్వ అధికారుల చర్యలు ఏవి...?



**భీమదేవరపల్లి, ఆగస్టు 24(జనం సాక్షి) :** గ్రామంలోని ప్రధాన చెరువులో కొందరు వ్యక్తులు అక్రమంగా దున్నకాలు జరుపుతున్న ఘటన పెద్ద దుమారం రేపుతోంది.భీమదేవరపల్లి మండలంలోని విశ్వనాథ కాలనీ గ్రామంలోని అల్పకుంట చెరువులో కొందరు వ్యక్తులు అక్రమంగా దున్నుతున్న ఘటన స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగించింది. ప్రజలకు త్రాగునీటి వనరుగా, పంటల సాగుకు జీవనాడిగా నిలిచే చెరువును స్వంతం చేసుకోవాలనే ప్రయత్నాలు స్థానికులలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామ చెరువు పైన క్రమంగా ఆక్రమణలు పెరుగుతున్నాయి. ఇటీవల ట్రాక్టర్‌తో దున్నకాలు జరగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. చెరువు బండపైకి విస్తరిస్తున్న పొలాలు భవిష్యత్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయని ప్రజలు వాపోతున్నారు. మన చెరువును కాపాడకపోతే రాబోయే కాలంలో త్రాగునీటి సమస్య, సాగునీటి కొరత మరింత తీవ్రమవుతుంది.అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయంపై సంబంధిత అధికారులు చెరువును ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, చెరువును రక్షించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చెరువులు గ్రామాల ప్రాణాధారమని గుర్తించి ప్రభుత్వం అధికారులు ఈ ఘటనపై స్పందించి చెరువును రక్షించాల్సిందిగా గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.చెరువులను ఆక్రమించే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# నాణ్యమైన వైద్య సేవలే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి




**పరకాల, ఆగస్టు 24 (జనం సాక్షి):** ప్రతి గ్రామానికి నాణ్యమైన వైద్య సేవలు చేరవేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.ఆదివారం పరకాల మండలం మల్లక్క పేట గ్రామంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.అంతకముందు మల్లక్కపేట ఆర్చ్ నుండి ప్రభుత్వ పాఠశాల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. వైద్య సిబ్బందిని శాలువాతో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని,ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే విధంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం సమాజానికి మేలు చేస్తుందని అన్నారు.పుట్టిన గడ్డకు సేవ చేయాలనే సంకల్పంతో వైద్య శిబిరం నిర్వహించిన దొమ్మటి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.వైద్యులు,సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, రోగులకు అవసరమైన మందులు, పరీక్షలు, వైద్య సలహాలు సమగ్రంగా అందించాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తాయని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగివ్వడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు.కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ శిబిరంలో వివిధ విభాగాల నిపుణ వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.మల్లక్కపేట గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

# పిహెచ్‌సి నోడల్ జిల్లా అధికారిగా డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ నియామకం



**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 24 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లాలోని 9 పీహెచ్సీలకు ప్రభుత్వ నోడల్ అధికారిగా గంధంపల్లి పి.హెచ్.సి డాక్టర్ రాజ్ కుమార్ ను నియమిస్తూ శనివారం డీఎంహెచ్ ఓ.రవి రాథోడ్ ఉత్వర్వులు జారీచేశారు. జిల్లాలోని బయ్యారం, గార్ల, గంగారం, కొత్తగూడ, అయోధ్యపురం, తీగలవేణి (గూడూరు) గంధంపల్లి, కోమట్లగూడెం, ముల్కనూరు పి.హెచ్.సి ల పరిధిలో నిర్వహించే జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలు అమలు చేయుటకు డాక్టర్ రాజ్ కుమార్ ను నోడల్ జిల్లా అధికారిగా నియమించారు. విషజ్వరాలు సీజనల్ వ్యాధులు ప్రభలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక నోడల్ అధికారి అవ గాహన చర్యలు చేపట్టనున్నారు.

# ప్రాణాలతో చెలగాటం వాడిన సిబ్బందిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలి

- తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు పీక కిరణ్

**మహాముత్తారం, ఆగస్టు 24 (జనంసాక్షి) :** విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడిన సిబ్బందిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని,తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్. డిమాండ్ చేశారు. ఆదివారం మహా ముత్తారంలో పత్రికా విలేకరుల సమావేశంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు పీక కిరణ్ మాట్లాడుతూ భూపాలపల్లిలో అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో జరిగినటువంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకూడదు అంటే విద్యార్థుల పరిస్థితులకు కారణమైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని నాన్ బెయిల బుల్ కేసులు పెట్టి జైల్లో వేయాలని అన్నారు.పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వాల మీద నమ్మకంతో తమ పిల్లలను హాస్టల్లో ఉంచుతూ చదివిస్తుంటే ఇలాంటి సంఘటనల వల్ల ప్రభుత్వ విద్యాలయాలపై హాస్టల్స్ పై ప్రజలకు నమ్మకం పోతుందని అన్నారు.విద్యార్థులకు జరిగిన ఈ సంఘటన పట్ల అనేక అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు.ముఖ్యంగా ఈ సంఘటనకు ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఉన్నాయా లేక కాంట్రాక్టర్ దక్కించుకోవడానికి బడా బాబులు ఎవరైనా ఉన్నారా ఈ పరిస్థితి రావడానికి ఇంకా ఎవరైనా హస్తం ఉందా అనే కోణంలో ప్రభుత్వం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సిబిఐ ఎంక్వయిరీ చేయించాలని ప్రజల అనుమానాలకు సమాధానం చెప్పాలని అన్నారు.నేరస్తులు తప్పించుకోకుండా కఠినంగా శిక్ష పడే విధంగా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కిరణ్ డిమాండ్ చేశారు.

# బుద్ధారంలో మోడల్ అంగన్వాడీ కేంద్ర భవనం

- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



**గణపురం, ఆగస్టు 24 (జనంసాక్షి):** మండలంలోని బుద్దారం గ్రామంలో ఆదివారం జెన్కో సీఎస్ఆర్ నిధులు రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మోడల్ అంగన్వాడీ కేంద్ర భవనాలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఎమ్మెల్యేకు అధికారులు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది శాలువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్,మాజీ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, మార్కెట్ డైరెక్టర్ కటుకూరు శ్రీనివాస్, పలువురు కాంగ్రెస్ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# మట్టితో చేసిన ప్రతిమలను పూజిద్దాం

- పర్యావరణం ప్రేమికులవుదాం







**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 24(జనంసాక్షి):** ఏవి వి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో “మట్టి ప్రతిమలను పూజిద్దాం. పర్యావరణహిత ప్రేమికులనవుదాం” అనే పర్యావరణ పరిరక్షణ ర్యాలీని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని వినాయకుడు అంటేనే ప్రకృతి కావున మట్టి వినాయకుల మరియు రసాయన రహిత రంగులను వాడి తద్వారా జల కాలుష్యాన్ని నివారించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏవీవి కళాశాల ఎన్ఎస్ఎస్ గత 20 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని ప్రజలలో మార్పు వస్తుందని మట్టి వినాయకుల తయారీ చాలా పెరుగుతుందని ఇది ప్రస్తుతం 25% ఉన్నదని రానున్న రోజుల్లో 40% కావాలని చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే విద్యార్థులచే మట్టి వినాయకులను తయారుచేసి ర్యాలీ నిర్వహించడం జరిగినది దీని యొక్క ముఖ్య ఉద్దేశం” పిఓపి వద్దు మట్టి వినాయకులే ముద్దు “నినాదంతో పిఓపి మరియు భూమిలో కాలువని వ్యర్థాన్ని రసాయన రంగులను చెరువులు సరస్సులలో కలువకుండా చూద్దాం మరియు మట్టి వినాయకుల వల్ల కలుగు లాభాలను ప్రజలకు తెలియజేస్తూ గణేష్ పూజలో వాడే ఇరవై ఒక్క రకాల పత్రిలు వాటి ఔషధ గుణములతో సర్వ రోగాలు పోతాయని తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగినది. అనంతరం అనంతరం శ్రీనివాసరావు తయారుచేసిన ఔషధ మొక్కల విలువలకు సంబంధించిన గోడిపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్ అధ్యాపకుడు సర్వేశంగారు, సీనియర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రబ్బాని, దేవిశ్రీప్రసాద్, సాకేత్, చిరంజీవి, దస్తగిరి, క్రాంతి ,భరత్ ,శివశంకర్ నమ్రత , చందన ,ప్రవళిక, మన్విత, సుహన,వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

# విష ప్రయోగం చేసిన టీచర్‌పై క్రిమినల్ కేసు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో సైన్స్ టీచర్ పెండ్యాల రాజేందర్‌పై క్రిమినల్ కేసు నమోదు అయినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూభూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన సంఘటనపై సైన్స్ టీచర్ పెండ్యాల రాజేందర్‌పై భూపాలపల్లి మండల విద్యాధికారి అజ్మీరా దేవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సైన్స్ టీచర్ పెండ్యాల రాజేందర్, ప్రత్యేక అధికారితో విభేదాల కారణంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని హానికర చర్యలకు పాల్పడినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారని వివరించారు. ప్రస్తుత ప్రత్యేక అధికారి వెంకట నర్సయ్యపై వ్యక్తిగత విభేదాల కారణంగా సైన్స్ టీచర్ రాజేందర్, పాఠశాల ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఆ కుట్రలో భాగంగా ఈ నెల 21న అర్ధరాత్రి సమయంలో తాగునీటి ట్యాంక్ లో హానికరమైన పురుగుమందు కలిపినట్లు విద్యార్థులు గమనించి తెలిపారని వివరించారు. దీని వల్ల 11 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి జిల్లా విద్యా అధికారులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా పోలీసులు ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. రాజేందర్ పై భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో సిఐ నరేష్ కుమార్ హత్యాయత్నం కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు.

# భక్తులతో సందడిగా మారిన మల్లూరు క్షేత్రం



**మంగపేట, ఆగస్ట్ 24 (జనంసాక్షి) :** మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల కొండలపై స్వయంభుగా వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంకు భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో సందడిగా మారింది. స్వామివారిని దర్శించుకోవడం కొరకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో వచ్చారు. భక్తులు ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయస్వామిని, పంచముఖాంజనేయ స్వామిని, రమ సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండపై స్వయంభుగా వెలసి విరాజిల్లుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామిని పక్కనే కొలువుదీరిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి మూలవిరాటకు ప్రదానార్చకుడు ముక్కామల రాజశేఖరశర్మ, ఆలయ అర్చకులు పవన్ కుమారాచార్యులు, ఏడునూతన ఈశ్వరచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది రాజీవ్ నాగశర్మ లు తిలా తైలాబిషేకాలు చేసి నూతన పట్టు వస్త్రాలు, గజమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దైవ దర్శనాలు గావించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లను ఈవో మహేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సీతారాములు, లక్ష్మీనారాయణ, అజయ్, శేషు, గణేష్, నవీన్, నాగార్జున్, మహేష్, పుల్లయ్య లు పాల్గొన్నారు

# ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలను పరిష్కరిస్తాం

• మంత్రి సీతక్క



**హైదరాబాద్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్లే ఆర్థిక సమస్యలు తలెత్తాయని, ఉద్యోగులు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అబిడ్స్‌లోని స్టాన్లీ స్కూల్‌లో ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాదుగుల పర్వత్ రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరయ్యారు. ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పర్వత్ రెడ్డి దంపతులను మంత్రి సీతక్క ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, పర్వత్ రెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పటికీ ఉద్యమకారుడిగా కూడా పేరుపొందారని, ఆయన జీవితం ఉపాధ్యాయులందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలి ఉపాధ్యాయ సంఘంగా ఏర్పడిన ఎస్టీయూ ప్రభుత్వ విద్య బలోపేతం కోసం కృషి చేసిందని, ఎందరో మహనీయులు ఈ సంఘం ద్వారా సమాజానికి సేవలందించారని గుర్తుచేశారు. మాజీ ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా ఈ సంఘ సదస్సులకు హాజరయ్యారని తెలిపారు. ఎన్నో కష్టాలు ఎదురైనా ఉపాధ్యాయులు..విద్యా సమస్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారని ఆమె అన్నారు. ఉపాధ్యాయ వృత్తి కంటే గొప్ప వృత్తి మరొకటి లేదని, భారతదేశ భవిష్యత్తును నిర్మించే పవిత్ర వృత్తి ఇదేనని సీతక్క పేర్కొన్నారు. పర్వత్ రెడ్డి విద్య బోధనలో ఎప్పుడూ రాజీ పడలేదని, విలువలతో కూడిన విద్యనే అందించారని తెలిపారు. ఆయన పదవీ విరమణ అనేది కేవలం ఉద్యోగానికి మాత్రమేనని, సమాజ సేవలో మాత్రం కొనసాగుతారని మంత్రి అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సీఎం ఇప్పటికే సంఘాలతో సమావేశం అయ్యారని సీతక్క స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల విధానాల కారణంగా ఆర్థిక సమస్యలు తలెత్తాయని, అందువల్ల కొంత ఆలస్యం జరుగుతున్నా సమస్యలను పరిష్కరించడానికి కృషి జరుగుతోందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందలేదని, బదిలీలు పదోన్నతులు లేక ఉపాధ్యాయులు నష్టపోయారని, ఆ నష్టాన్ని పూరించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి, కార్మికులు కర్షకులు కలిసి ఏర్పాటు చేసుకున్న ప్రజా ప్రభుత్వం ఆయా వర్గాలకు అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ కోదండరాంతో కలిసి ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తాను కృషి చేస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. తమ రాష్ట్ర అధ్యక్షుడి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి సీతక్కను ఎస్‌టీయూటీఎస్ నాయకులు, టీచర్లు ఘనంగా సన్మానించారు.

## జిల్లాలో అందుబాటులో 2600 మెట్రిక్ టన్నుల యూరియా

• జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 24 (జనంసాక్షి) :** జిల్లాలో నిన్నటి ఈ నెల 23వ తేదీ వరకు 1600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండేదని, ఆదివారం జిల్లాకు మరో 1000 మెట్రిక్ టన్నుల యూరియా క్రిభ్కో వాగన్ ద్వార వచ్చిందని, దీనితో మొత్తం జిల్లాలో 2600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆదివారం వచ్చిన యూరియాను పిఏసిఎస్‌లు, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు.దీనికి తోడు జిల్లాలో 5600 లీటర్ల నానో యూరియాను అన్ని సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు.యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడుకోవచ్చని, నానో యూరియా వాడటం వల్ల భూసారం తగ్గకుండా నత్రజనిని పైరుకు అందించవచ్చని వెల్లడించారు.రానున్న రోజుల్లో ఇఫ్కో, ఆర్సీఎఫ్ వ్యాగన్లు ద్వారా మరింత యూరియా రానుందని తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో వర్షాలు పడుతున్నందున వర్షపు నీరులో నైట్రోజన్ శాతం ఎక్కువగా ఉండటం వలన రైతులు ఎకరానికి కొంత మోతాదులో యూరియా లభిస్తుందని,రానున్న 10 రోజులలో యూరియా వినియోగం తగ్గించుకోవచ్చని తెలిపారు.ఇప్పటి వరకు ఈ సీజన్ లో జిల్లాలో రైతులకు 30వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా టీ జరిగిందన్నారు.మరింత యూరియా అందుబాటులో ఉంచడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, అందువల్ల రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

## యూరియా కోసం రైతుల తిప్పలు



**మహమ్మదాబాద్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** మహమ్మదాబాద్ మండలం నంచర్ల గేట్ ఎక్స్ రోడ్డులోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి ఆదివారం ఒక లారీ యూరియా ఎరువు చేరింది. సమాచారం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. అయితే వచ్చిన యూరియా పరిమితంగా ఉండటంతో రైతులందరికీ సరిపడేలా పంపిణీ జరగకపోవడం లేదని తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. పొలాలకు అత్యవసరంగా ఎరువులు అవసరమైన ఈ సమయంలో సరిపడా నిల్వలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.బాధతో క్యూల్లో నిల్చొని తమ కష్టాలను అధికారులకు విన్నవించారు. రైతులు డిమాండ్ చేస్తూ ప్రభుత్వం, అధికారులు వెంటనే అవసరమైన యూరియాను సరఫరా చేసి రైతుల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

## బాడీ బిల్డింగ్‌లో భారత్ నుంచి ప్రపంచ ఛాంపియన్లు రావాలి

• సినీ నటుడు అల్లు శిరీష్
• 'డెక్కన్ అప్రైజింగ్ 2025'కు అపూర్వ స్పందన



**హైదరాబాద్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** భారత్ నుంచి క్రికెట్లో ప్రపంచ చాంపియన్లు వచ్చినట్టే, బాడీబిల్డింగ్లో కూడా ప్రపంచ ఛాంపియన్లు రావాలని సినీ నటుడు అల్లు శిరీష్ కోరారు. శంషాబాద్లోని ఎస్ఆర్ క్లాసిక్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరిగిన అతిపెద్ద సహజ శరీర దారుఢ్య పోటీలు 'డెక్కన్ అప్రైజింగ్ 2025' కు అపూర్వ స్పందన లభించింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన అల్లు శిరీష్ మాట్లాడుతూ నా సోషల్ మీడియా పోస్టుల ద్వారా ఫిట్నెస్ అభిమానిగా చాలామందికి తెలుసన్నారు. అన్ని ఫిట్నెస్ వేదికలలో ఎంతో ఇష్టమైనది ఈ ఐసీఎన్ అన్నారు. భారత్లో బాడీ బిల్డింగ్ అనగానే స్టెరాయిడ్ తో బాడీ బిల్డ్ చేస్తారన్న అపోహ ఉందన్నారు. కానీ ఐసీఎన్ మాత్రం దీనికి విరుద్ధంగా నిలుస్తుందన్నారు. ఇది ప్రపంచవ్యాప్త సహజ బాడీబిల్డింగ్ పోటీ అన్నారు. ఒలింపిక్ క్రీడాకారులను పరీక్షించే వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ ద్వారానే క్రీడాకారులను పరీక్షించనున్నారని తెలిపారు. తద్వారా విజయం ఏళ్ల తరబడి కృషి, క్రమశిక్షణ, అంకితభావానికి ఫలితంగా వస్తుందన్నారు. సహజ బాడీబిల్డింగ్ పట్ల నా ఆసక్తి మళ్లీ పెరిగిందన్నారు. నా ట్రైనర్ తరుణ్.. ఆయన ఒక ఐసీఎన్ అథ్లెట్ అన్నారు. గత ఏడాది నుంచి ఆయన మార్గదర్శకత్వంలో మళ్లీ నా శరీరాన్ని తీర్చిదిద్దుకోగలిగానని చెప్పారు. నిజమైన ఫిట్నెస్ అనేది ఎలాంటి షార్ట్కట్లు లేకుండా సాధించవచ్చనే నమ్మకం కలిగిందన్నారు. హైదరాబాద్లోనే 450కి పైగా ఐసీఎన్ అథ్లెట్లు ఉన్నారంటే ఆశ్చర్యకరంగా ఉందన్నారు. రెండు రోజుల పాటు అత్యంత ఉత్సాహంగా ఈ పోటీలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది జరిగిన 70కు పైగా ఐసీఎన్ పోటీలలో ఇది అతి పెద్దదిగా నిలిచింది. ఈ ఈవెంట్కు వెల్వర్న్ ప్రెజెంటింగ్ పార్ట్నర్గా వ్యవహరించింది. దేశ, విదేశాల నుంచి వచ్చిన నాలుగు వందల మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. విభిన్న వయస్సు, వివిధ విభాగాలకు చెందిన వారు ఈ పోటీలో తమ ప్రతిభను ప్రదర్శించారు. బాడీబిల్డింగ్, ఫిట్ఫ్యాషన్, ఫిట్నెస్ మోడలింగ్, ట్రాన్స్ఫర్మేషన్ ఛాలెంజ్లలో పోటీ పడ్డారు. సినీ నటుడు అల్లు శిరీష్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీఎన్ ఇండియా, ఐసీఎన్ యూఏఈ అధ్యక్షుడు, డెక్కన్ అప్రైజింగ్ 2025 నిర్వాహకులు జే ఆచార్య, ఐసీఎన్ ఇండియా హెడ్ జడ్జి జోయ్ కాంట్లిన్, వెల్వర్న్ సహ వ్యవస్థాపకుడు ఆదిత్య పాల్గొన్నారు.

## రామచంద్రా రెడ్డికి మంత్రి సీతక్క నివాళి



**ఉప్పునుంతల, ఆగస్టు 24 (జనంసాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డి పి.ఏ. జైపాల్ రెడ్డి తండ్రి రామచంద్ర రెడ్డి ఇటీవల మరణించగా, నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం తిరుమలాపూర్ గ్రామంలో వారి కుటుంబాన్ని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పరామర్శించారు. రామచంద్ర రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఆమె, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్, టీ-సాట్ చైర్మన్ శివసేనారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఏటీసీలో శిక్షణ పొందితే ఉద్యోగం పక్కా..

• నూతన ఏటీసీ సెంటర్‌ను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు



**తాండూరు, అగస్టు 24 (జనంసాక్షి) :** నియోజ కవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయం ప్రక్కన నూతనంగా నిర్మాణంలో ఉన్న ఏటీసీ సెంటర్ ను కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 5వేల కోట్లతో 101ఏటీసి సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అందులో ఈ విద్య సంవత్సరం 65 సెంటర్స్ ప్రారంభనికీ సిద్ధంగా ఉన్నాయి. అందులో మన తాండూర్ ఏటీసి సెంటర్ కూడ ఉండటం అనేది ఇది మనోహర్ రెడ్డి కృషి, పట్టుదలకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యలయం ప్రక్కన అయిదెకరాల భూమి కేటాయించి 25 కోట్లతో నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందని ,అందులో శిక్షణకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం 60 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని అన్నారు.ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గెల్చిన తర్వాత విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాడని చెప్పడానికి నిదర్శనంఅన్నారు. దాదాపు ఒక్క ఏటిసి సెంటర్ నిర్మాణానికే 85 కోట్లు ఖర్చు చేయడమని అన్నారు.ఈ ఏటిసి సెంటర్ లో 06 అత్యాధునాతనమైన, సాంకేతిక కోర్సులో 172 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు పూర్తి ఉచితంగా ప్రభుత్వమే శిక్షణ అందిస్తుందని అన్నారు.ఒకప్పటి ఐ.టి.ఐ.లు కావు, నైపుణ్యాన్ని, నాణ్యతను అందించే వేదికలు మన ఏటీసీలని, ఏటీసీలో శిక్షణ పొందితే ప్రపంచంలో ఏ మూలనైన ఉద్యోగం చేసే నైపుణ్యం అందించే విధంగా బోధన పద్ధతులు ప్రభుత్వం డిజైన్ చేయడం జరిగిందని అన్నారు.అడ్మిషన్ల దరఖాస్తు చివరి తేదీ:-28-08-2025.అందుబాటులో ఉన్న సీట్లు 172. పూర్తి వివరాలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రక్కన గల నూతన ఏటీసీ సెంటర్ లో ప్రిన్సిపల్ మరియు సిబ్బందిని సంప్రదించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ బాల్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ హాబిబ్ లాల, సీనియర్ నాయకులు అబ్దుల్ రావుఫ్,సర్దార్ ఖాన్, కౌన్సిలర్లు ప్రభాకర్ గౌడ్, రాము, బాతుల వెంకటేశం, బంటు మల్లప్ప, బంటువేణు, వడ్డే శ్రీనివాస్, రాము, రొంపల్లి సంతోష్ దొరశెట్టి సత్యమూర్తి, మహిళా నాయకురాలు గాజుల మాధవి తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రంగా అనువైన ప్రాంతం కనకగిరి గుట్టలు

• కలెక్టర్ జితేష్ వి పాటిల్



**చంద్రుగొండ, ఆగస్టు 24 (జనం సాక్షి) :** మనసు మళ్లింది.. అడుగులు అటువైపే పడుతున్నాయి.. ఎంత చూసినా తనివి తీరని ఆహ్లాదకరమైన ఆ ప్రాంతం ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. అదీ మన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆ ప్రాంతానికి ముగ్ధులై ఆ ప్రాంతాన్ని ఏ విధంగా తీర్చిదిద్దాలి పర్యాటక కేంద్రంగా మార్చాలి ఆ గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందాలి వారికి ఎటువంటి ఆసరా కల్పించాలి ఇదే ఆయన మనసులో మెదులుతూ ఆదివారం మార్నింగ్ పేరిట చంద్రుగొండ మండలం బెండలపాడు శివారు కనకగిరి గుట్టలను కాలినడకన పయనించి అందాలను ఆస్వాదించి గుట్టల చెంతనే ఉన్న హస్తాల వీరన్నను దర్శించి ఆయన ఆయన కుమారుడు తన్మయత్వం చెందారని చెప్పవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం బెండలపాడు కనిగిరి గుట్టల విశిష్టతను తెలుసుకొని ఆ ప్రాంతాన్ని కాకతీయుల సామ్రాజ్యంలో శిథిలావస్థకు చేరిన కట్టడాలను సందర్శించి ఏదో చేయాలని తలంపుతో అక్కడ ఉంటున్న గిరిజనులకు చేయూతనివ్వాలని ఆశిస్తూ బాంబు క్లస్టర్ను అభివృద్ధిపరిచి అక్కడ ఉన్నవారికి గిరిజనుల సాంప్రదాయమైన వెదురు వస్తువుల తయారీకి తన వంతుగా కృషి చేస్తూ గిరిజనులకు తమ కాళ్ళ మీద నిలబడే విధంగా ఆసరా ఇస్తూ నేడు ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని తలంపుతో ఆయన చేస్తున్న కృషికి మండల ప్రజలతో పాటు జిల్లా ప్రజలు సైతం ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. రాజు తలుచుకుంటే ఏదైనా జరుగుతుంది అలాంటిది కలెక్టర్ జితేష్ వి పాటిల్కు అశ్వరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే కలవడంతో పర్యాటక ప్రాంతంగా తీర్చడానికి మరింత అవకాశం ఏర్పడింది. నెరవేరాలని జిల్లా ప్రజల ముక్తకంఠంతో కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు భోజ్య నాయక్, దిశా కమిటీ జిల్లా సభ్యులు బొర్రా సురేష్, మాలోత్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహితమైన నగరం దిశగా హైదరాబాద్

• చెరువుల పునరుద్ధరణ పెద్దయెత్తున చేపట్టామన్న హైడ్రా కమిషనర్




**హైదరాబాద్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** పర్యావరణ హితమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఈ క్రమంలో చెరువుల పునరుద్ధరణను పెద్దయెత్తున చేపడుతున్నామన్నారు. పర్యావరణ హితమైన నగరాల అభివృద్ధిని కాంక్షిస్తూ బయోఫిలిక్ అర్బనిజం వైపు అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలు పేరుతో ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా ఏర్పాటు చేసిన దక్షిణమండలి సమావేశంలో హైడ్రా ఉద్దేశాలను కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరించారు. నగరంలో గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి.. వరదల నివారణతో పాటు.. పర్యావరణ హితమైన నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈక్రమంలో చెరువులు, నాలాల ఆక్రమణలను తొలగించడంతో పాటు.. విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రధాన కర్తవ్యం అయినా.. వీటిని నివారించే క్రమంలో చెరువుల పునరుద్ధరణ, కాలుష్య నివారణ అంశాలపై దృష్టి పెట్టాల్సి వస్తోందన్నారు. ఈ క్రమంలోనే 500ల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాం, పార్కులను పునరుద్ధరించాం.. నగరంలో ఉన్న చెరువులన్నిటినీ పర్యావరణ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని కమిషనర్ చెప్పారు. వివిధ రాష్ట్రాలకు చెందిన టౌన్ ప్లానింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్ ఇంజినీర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# జలమండలిలో ఏఐ సాంకేతికత

• అధునాతన సాంకేతికతతో టాప్ టెన్ ఫిర్యాదుల వినియోగదారుల చిట్టా

**హైదరాబాద్, ఆగస్టు 24 (జనంసాక్షి) :** తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, అధునాతన సాంకేతికత వినియోగంలో దేశంలో ఇతర బోర్డుల కంటే ఉన్నతంగా ఉన్న జలమండలి.. ఇప్పుడు వినియోగదారుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడానికి ఏఐ అనే అధునాతన సాంకేతికతను వినియోగిస్తోంది. జలమండలి గత సంవత్సర కాలంలో మెట్రో కస్టమర్ కేర్(ఎంసీసీ)లో నమోదు అయినా ఫిర్యాదులను %ూ×% ద్వారా కొన్ని రోజులగా ఐటీ విభాగపు అధికారులు విశ్లేషిస్తున్నారు. గత సంవత్సర కాలంలో ఎంసీసీలో నమోదైన ఫిర్యాదులను, ట్యాంకర్ బుకింగ్ వివరాలను ఏఐ సాంకేతికత సాయంతో గత కొన్ని రోజులుగా విశ్లేషిస్తున్నారు. ఈ విశ్లేషణలో ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయో, ఏయే ప్రాంతాల నుంచి అధిక ఫిర్యాదులు, తరుచూ నమోదవుతున్న ఫిర్యాదులను వివిధ కోణాల్లో విశ్లేషిస్తున్నారు. అలాగే, గత సంవత్సర కాలంగా ట్యాంకర్ బుకింగ్ ల వివరాలతో ఏయే డివిజన్ లో అత్యధికంగా బుకింగ్ లు అవుతున్నాయో, ఏయే ప్రాంతాలతో పాటు అత్యధికంగా ట్యాంకర్ లను బుక్ చేసిన వినియోగదారుల వివరాలను సైతం, ఏఐ సాంకేతికతతో విశ్లేషించారు. కాగా గత సెప్టెంబరు 1 నుంచి.. ఇప్పటివరకు 6 లక్షల 50 వేలకు పైగా వివిధ సమస్యలపై ఫిర్యాదులు జలమండలి కస్టమర్ కేర్ కు అందగా, 12 లక్షలపైగా వాటర్ ట్యాంకర్ లను వినియోగదారులు బుక్ చేసుకున్నారు. ఈ ప్రాంతంలో గత వేసవిలో అత్యధిక ట్యాంకర్ బుకింగ్స్ నమోదు అయినట్టు ఏఐ సాంకేతికత ద్వారా గుర్తించారు. అలాగే జలమండలి మొత్తం ఓ ఆర్ ఆర్ పరిధిలోని కీలక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం ప్రారంభించింది. ఈ వివరాలతో.. అత్యధికంగా ట్యాంకర్ బుక్ చేసిన టాప్ 10 వినియోగదారులను ఏఐ సాయంతో గుర్తించారు. అందులో అత్యధికంగా ట్యాంకర్ బుక్ చేసిన ప్రాంతాలలో ప్రగతినగర్ లోని సౌతన్ రెసిడెన్సీ అపార్ట్మెంట్ గత సంవత్సరంలో 674 ట్యాంకర్ లను బుక్ చేసినట్టు తేల్చారు. ఈ నేపథ్యంలో ప్రగతీనగర్ లో నీటి సరఫరా, అత్యధిక ట్యాంకర్ బుకింగ్ వివరాలతో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులతో కలిసి, సమస్యాత్మక ప్రాంతాలను స్థానికులతో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో గతంలో మున్సిపాలిటీలో ఉన్నప్పుడు 15 రోజులకోసారి నీటి సరఫరా ఉండేదని, తరువాత జలమండలి చొరవతో పైపు లైన్లు మంజూరు చేయడంతో.. వారానికి ఒకసారి మంచి నీరు సరఫరా జరిగిందని స్థానికులు ఎండీకి చెప్పారు. అలాగే రెండు నెలల రెండు రోజులకు ఒక సారి తాగునీటి సరఫరా అవుతోందని, అలాగే, రోజు విడిచి రోజు నీటి సరఫరా అందేలాగా స్థానికులు జలమండలి ఎండీకి విన్నవించుకున్నారు. అందుకే ఎండీ రోజు విడిచి రోజు నీటి సరఫరా చేపట్టవలసిన పనులను అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రగతినగర్ సంపుకు ప్రత్యేక ఫీడర్ మెయిన్ అభివృద్ధి చేస్తే ఈ సమస్య తీరిపోతుందని, దానికి రూ.3 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు ఎండీకి వివరించారు. దానికి వెంటనే ప్రతిపాదనలను పరిశీలించిన ఎండీ, వెంటనే పనులు చేపట్టాలని ఆమోద ముద్ర వేశారు. ఈ ప్రగతినగర్ ఎత్తైన ప్రాంతాల్లో ఉండటం, భూగర్భంలో ఎక్కువగా రాళ్లు కూడి ఉండటంతో.. బోర్లు సఫలం కాక, సఫలమైన వేసవిలో అంటడిగి పోవడంతో.. ఈ ప్రాంతవాసులు త్రాగునీరుకోసం జలమండలిపై అధారపడుతున్నట్లు గుర్తించారు. వీటితోపాటు వందకు పైగా గృహ సముదాయాలకు ఇంకుడు గుంతలు లేకపోవడంతో జలమండలి ట్యాంకర్ల మీద వేసవిలో ఆధారపడుతున్నట్లు విశ్లేషించారు.






# పోస్ట్‌మ్యాన్లకు శిక్షణ

### పోస్టాఫీసుల్లో మ్యూచువల్ ఫండ్స్..




**న్యూఢిల్లీ,జనంసాక్షి:**తపాలా శాఖతో మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఒప్పందం చేసుకుంది. పోస్టల్ శాఖకు చెందిన లక్ష మంది పోస్ట్‌మ్యాన్‌లకు మ్యూచువల్ ఫండ్స్‌పై శిక్షణ ఇవ్వనుంది.దీంతో మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు మ్యూచువల్ ఫండ్స్ సేవలను తపాలా శాఖ ద్వారా చేరువ చేయెుచ్చున్నది యాంఫి లక్ష్యంగా ఉంది. యాంఫి 30వ వ్యవస్థాపక దినం సందర్భంగా తపాలా శాఖ, యాంఫి ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. మ్యూచువల్ ఫండ్స్ సేవలపై అవగాహనను విస్తృతం చేసేందుకు గాను నివేష్ కా సహి కదమ్, భారత్ నివేష్ రైల్ యాత్ర తదితర కార్యక్రమాలను ఈ సందర్భంగా యాంఫి ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఇన్వెస్టర్ క్యాంపుల నిర్వహణ, వందే భారత్ రైళ్లలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది.

ముఖ్యాంశాలు

లక్ష మంది పోస్ట్‌మ్యాన్‌లకు శిక్షణ: మొదటగా బిహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మేఘాలయ రాష్ట్రాల్లో ప్రారంభం. మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్లుగా శిక్షణ: ప్రతి జిల్లాలో కనీసం 10 మంది డిస్ట్రిబ్యూటర్లు ఉండేలా లక్ష్యం.భారత్ నివేష్ రైల్ యాత్ర, వందే భారత్ అవగాహన క్యాంపులు: మ్యూచువల్ ఫండ్స్‌పై అవగాహన పెంచేందుకు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు. నివేష్ కా సహి కదమ్: పెట్టుబడులపై సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రజలకు మార్గనిర్దేశం చేసే కార్యక్రమం.30 నగరాలపై దృష్టి: చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మ్యూచువల్ ఫండ్స్ విస్తరణకు ప్రాధాన్యత. ఈ భాగస్వామ్యం ద్వారా, ఫైనాన్షియల్ లిటరసీని గ్రామీణ ప్రాంతాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.

# వేలకిలోల బంగారం సీజ్..

### పదేళ్లలో ఆర్థిక శాఖ లెక్కలు చూస్తే..

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**దేశవ్యాప్తంగా గత పదేళ్లలో భారీగా అక్రమంగా తరలిస్తున్న బంగారం స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది.2015-16 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు పదేళ్లలో అక్రమంగా తరలిస్తున్న 31,772.34 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.ఇందుకు సంబంధించి 35,888 కేసులు నమోదు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వివరించింది. అత్యధికంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4,971.68 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది.కేంద్ర ఆర్థిక శాఖ సమాచారం ప్రకారం.. 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి 2024-25 వరకు దేశవ్యాప్తంగా అక్రమంగా తరలిస్తున్న బంగారం స్వాధీనం చేసుకున్న కేసుల సంఖ్య 35,888కి చేరింది. మొత్తం 31,772.34 కిలోల బంగారం సీజ్ చేశారు. 2015-16లో 2,815 కేసులు నమోదు కాగా, 2,972.07 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. 2016-17లో కేసుల సంఖ్య 1,573కి తగ్గినా, 1,520.24 కిలోల బంగారం పట్టుబడింది. 2017-18లో 3,131 కేసులతో పాటు 3,329.46 కిలోల బంగారం స్వాధీనం కాగా, 2018-19లో కేసులు 5,092కి పెరిగి, 4,292.29 కిలోల బంగారం సీజ్ చేశారు.2019-20లో 4,784 కేసులు నమోదై 3,626.85 కిలోల బంగారం స్వాధీనం కాగా, 2020-21లో కేసుల సంఖ్య 2,034కి తగ్గి, 1,944.39 కిలోల బంగారం మాత్రమే పట్టుబడింది. 2021-22లో 2,236 కేసులతో 2,172.11 కిలోల బంగారం స్వాధీనం కాగా, 2022-23లో కేసులు 4,619కి పెరిగి, 4,342.85 కిలోల బంగారం సీజ్ చేశారు. అత్యధికంగా 2023-24లో 6,599 కేసులు నమోదు కాగా, 4,971.68 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. 2024-25లో కేసుల సంఖ్య 3,005గా ఉండగా, 2,600.40 కిలోల బంగారం స్వాధీనం చేశారు.ఈ గణాంకాలు చూస్తే, కొన్ని సంవత్సరాల్లో కేసుల సంఖ్య తగ్గినా, బంగారం స్వాధీనం పరిమాణం ఎక్కువగా ఉండటం గమనించదగ్గ విషయం.




## ఫెడ్ చైర్మన్ కీలక ప్రకటన

- బంగారం ధరల్లో ఊహించని మార్పు!

**జనంసాక్షి:**బంగారం ధరలు పెరగడానికి లేదా తగ్గడానికి పలు కారణాలు ఉన్నాయి. ఇందులో ద్రవ్యోల్బణం, జీడీపీ, అంతర్జాతీయ పరిణామాలు (భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు) ఉన్నాయి. ముఖ్యంగా అమెరికాలో జరిగే అనేక అంశాలు గోల్డ్ రేట్లను ప్రభావితం చేస్తాయి. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు, డాలర్ విలువ, డొనాల్డ్ ట్రంప్ సుంకాల కారణంగా పసిడి ధరలు మారుతూ ఉంటాయి. కాగా ఇప్పుడు బంగారం ధరలలో కీలక మార్పుకు కారణమయ్యే ఒక ప్రకటన వచ్చింది.నిజానికి ఫెడ్ వడ్డీ రేట్లను పెంచితే.. యూఎస్ డాలర్ డిమాండ్ పెరుగుతుంది. డాలర్ వాల్యూ పెరిగితే.. బంగారం కొనుగోలు చేసేవారి సంఖ్య కొంత తగ్గుతుంది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గితే.. డాలర్ విలువ తగ్గి, బంగారానికి డిమాండ్ పెరుగుతుంది.కొంత కాలంగా.. ఫెడ్ వడ్డీ రేట్లను స్థిరంగానే ఉంచుతున్నారు. దీంతో బంగారం ధరల్లో ఊహించని మార్పు కనిపించలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించాలని సూచించారు. కానీ ట్రంప్ విధిస్తున్న సుంకాలు.. భవిష్యత్తును ఎలా నిర్ణయిస్తాయో తెలియడం లేదు. ఈ కారణంగానే ఫెడ్ వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. అయితే సెప్టెంబర్‌లో ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని చెబుతున్నారు.వచ్చే నెలలో జరగనున్న అమెరికా సెంట్రల్ బ్యాంక్ సమావేశంలో ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ 'జెరోమ్ పావెల్' వడ్డీ రేటు తగ్గింపుకు అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. ఇది ఉద్యోగ మార్కెట్‌కు నష్టాలు తెస్తుందని, ద్రవ్యోల్బణం ముప్పు కూడా ఉందదని పేర్కొన్నారు. అయినప్పటికీ వడ్డీ రేట్లను తగ్గించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. దీంతో డాలర్ విలువ ఒక్కసారిగా పతనమైంది. దీంతో బంగారం ధరలు ఊహించినట్లుగానే పెరిగాయి. ఫెడ్ సమావేశం సెప్టెంబర్ 16, 17న జరగనుంది.ఇక భారతదేశంలో కూడా బంగారం ధరలు ఊహకందని రీతిలో శనివారం (ఆగస్టు 23) గరిష్టంగా రూ. 1090 పెరిగింది. దీంతో 24 క్యారెట్స్ గోల్డ్ ధర రూ. 1,01,620 (10 గ్రా)కు చేరింది. 22 క్యారెట్స్ గోల్డ్ రేటు రూ. 1000 పెరిగి రూ. 93150 (10 గ్రా)కు చేరింది. కేజీ వెండి ధర రూ. 1,30,000లకు చేరింది.




# ఐడీబీఐ బ్యాంక్ వాటా విక్రయం..

**జనంసాక్షి:**ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) ముగిసేలోగా ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా విక్రయాన్ని పూర్తి చేసే వీలున్నట్లు దీపమ్ కార్యదర్శి అర్నుష్ చావ్లా పేర్కొన్నారు.అర్హతగల బిడ్డర్లు సాధ్యాసాధ్యాల పరిశీలనను దాదాపు పూర్తిచేసిన నేపథ్యంలో తాజా అంచనాకు వచ్చినట్లు వెల్లడించారు. ఫిక్కీ నిర్వహించిన క్యాపిటల్ మార్కెట్ సదస్సు సందర్భంగా చావ్లా విలేకరులతో ఈ అంశాలను ప్రస్తావించారు.ఆస్తుల మానిటైజేషన్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 47,000 కోట్లు సమీకరించే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే రూ. 20,000 కోట్లు సమకూర్చుకున్నట్లు వెల్లడించారు. అర్హతకలిగి ఆసక్తి ప్రదర్శించిన పార్టీలు ఇప్పటికే బ్యాంక్‌పై ఒక అవగాహనకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ప్రశ్నలకూ జవాబులు సైతం లభించినట్లు తెలియజేశారు. బ్యాంక్‌కు సంబంధించిన అన్ని గణాంకాలు లేదా వివరాలను సమగ్రంగా అందించినట్లు తెలియజేశారు. ఐడీబీఐ బ్యాంక్‌లో బీమా రంగ పీఎస్‌యూ దిగ్గజం ఎల్ఐసీకి 95 శాతం వాటా ఉన్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా దీనిలో 60.72 శాతం వాటాను ఎల్ఐసీ విక్రయించనుంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.95 | ₹ 4.97 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 93,150 | ₹ 1,01,620 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,30,000

# 10-30-50 నియమం

- డబ్బు అదా చేయడానికి మంచి రూల్ డబ్బు సంపాదించాలన్నా.. డబ్బు ఆదా
- చేయాలన్నా, తప్పకుండా కొన్ని నియమాలు పాటించాలి:: రాధిక గుప్తా

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**డబ్బు సంపాదించాలన్నా.. డబ్బు ఆదా చేయాలన్నా, తప్పకుండా కొన్ని నియమాలు పాటించాలి. ఖర్చులు పెరిగినప్పుడు, ఆదా చేయడం ఇబ్బందిగా అనిపించవచ్చు. కానీ ఎడెల్వీస్ మ్యూచువల్ ఫండ్ ఎండీ %ఒ% సీఈఓ రాధిక గుప్తా మాత్రం ఓ ఫార్ములా సూచిస్తూ.. డబ్బును, ఇలా అదా చేయెుచ్చని వెల్లడించారు నిరంజన్ అవస్థితో కలిసి రాసిన తన కొత్త పుస్తకం 'మ్యాంగో మిలియనీర్'లో రాధిక గుప్తా 10-30-50 రూల్ గురించి వివరించారు. "అదా చేయడం అంటే.. క్రికెట్ మ్యాచ్‌కు ముందు చేసే ప్రాక్టీస్ అని అన్నారు. ఆర్థిక విజయానికి తప్పకుండా పునాది అవసరం. ఏ క్రీడాకారుడు.. సాధన లేకుండా మ్యాచ్‌లోకి అడుగు పెట్టాలని కలలు కనడు. అలాగే.. పెట్టుబడిదారుడు కూడా,



ముందు పొదుపులో నైపుణ్యం సాధించాలి, అప్పుడే విజయం సాధిస్తాడు" అని వెల్లడించారు. 20 ఏళ్లలో 10 శాతం: పొదుపు చేయడం చిన్నగా ప్రారంభించండి. పొదుపు చేయడం అంటే.. మీ భవిష్యత్తుకు మీరే డబ్బు చెల్లించుకోవడం ని రాధికా గుప్తా పేర్కొన్నారు. ఆడంబరమైన, అనవసరమైన వస్తువులను కొనుగోలు చేయడం మానుకోవాలి.30 ఏళ్ల నుంచి 40 ఏళ్లలో 30 శాతం: ఉద్యోగంలో ప్రమోషన్లు లేదా వ్యాపారం బాగా వృద్ధి చెందుతున్నప్పుడు.. వస్తున్న ఆదాయంలో పొదుపును 30 శాతానికి పెంచండి.40 ఏళ్లు పైబడిన వారు 50 శాతం: పదవీ విరమణ, పిల్లల విద్య కోసం ఖర్చులు పెరుగుతున్న సమయంలో ఆదాయం కొంత ఎక్కువ పొదుపు చేయాల్సి ఉంటుంది. కాబట్టి మీరు సంపాదించే ఆదాయంలో 50 శాతం వరకు పొదుపు చేయండి.

# యూరప్ ట్రిప్ ఇకపై భారమే..

### పెరిగిన షెంజెన్ వీసా ధరలు

**జనంసాక్షి:**షెంజెన్ వీసా దరఖాస్తులు మరింత ఖరీదైనవిగా మారాయి. దీనివల్ల భారతీయులకు యూరప్ ప్రయాణాల ఖర్చు పెరిగింది. చాలా యూరోపియన్ దేశాలకు వీసా సమర్పణలను నిర్వహించే ప్రైవేట్ ఏజెన్సీ వీఎఫ్ఎస్ గ్లోబల్ తన సర్వీస్ ఛార్జీలను పెంచడంతో ధరలు పెరిగాయి.2023 తర్వాత ధరలు పెరగడం ఇదే మొదటిసారి. పెద్దలకు బేస్ షెంజెన్ వీసా ఫీజు దాదాపు రూ. 8,000 - రూ. 10,000 వరకు ఉన్నప్పటికీ.. అదనపు సర్వీస్ ఫీజును వసూలు చేస్తుంది. దీనివల్ల వల్ల మొత్తం ఖర్చు పెరుగుతుంది. ఈ కొత్త సర్వీస్ ఫీజు దేశాన్ని బట్టి మారుతూ ఉంటుంది. జర్మనీ ఇప్పుడు రూ.1933, స్విట్జర్లాండ్ రూ.2690, పోర్చుగల్ రూ.3111, ఫ్రాన్స్ రూ.2234, ఆస్ట్రియా రూ.2274 వసూలు చేస్తున్నాయి.కొరియర్ డెలివరీ, ఎస్ఎంఎస్ అప్‌డేట్‌లు, ప్రీమియం లాంజ్ యాక్సెస్ వంటి సేవలకు అదనంగా చెల్లించడాన్ని కూడా దరఖాస్తుదారులు ఎంచుకోవచ్చు. దేశాన్ని బట్టి ఈ ఛార్జీలు కూడా మారుతూ ఉంటాయి. ప్రస్తుతం వీఎఫ్ఎస్ గ్లోబల్ స్విట్జర్లాండ్‌కు ఈ పెరుగుదలను ధృవీకరించింది. కానీ ఇతర దేశాలకు ఫీజులు మారాయా?, లేదా?.. అనే విషయం మీద ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.షెంజెన్ వీసా కలిగిన ప్రయాణికులు 180 రోజుల వ్యవధిలో 90 రోజుల వరకు 29 యూరోపియన్ దేశాలను సందర్శించడానికి అనుమతిస్తుంది. దీనికోసం దరఖాస్తుదారులు ట్రావెల్ ప్లాన్, ఇన్సూరెన్స్ వంటి వాటితోపాటు ఫైనాన్సియల్ ప్రూఫ్ వంటి డాక్యుమెంట్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.కరెన్సీ హెచ్చుతగ్గులు కూడా యూరప్ పర్యటనల ఖర్చు పెరగడానికి మరోకారణం అని తెలుస్తోంది. గత దశాబ్ద కాలంలో రూపాయి బాగా బలహీన పడింది. 2015లో ఒక యూరో ధర రూ.72.12గా ఉంది. 2020లో ఇది రూ.84.64కి పెరిగింది. 2023 నాటికి రూ.89.20కు చేరింది. 2024లో దీని విలువ రూ. 90.55గా ఉంది. కాగా జూన్ 2025లో యూరో విలువ మొదటిదారిగా రూ. 100 దాటిపోయింది.

# వలసదార్లు తగ్గుముఖం




- అమెరికాలో ఆరు నెలల్లోనే 15 లక్షలు తగ్గిన ఇమ్మిగ్రెంట్లు
- 5.33 కోట్ల నుంచి 5.19 కోట్లకు పడిపోయిన వలసదార్లు
- 'ప్యూ రీసెర్చ్ సెంటర్' నివేదికలో వెల్లడి
- అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టమే అంటున్న నిపుణులు

**వాషింగ్టన్,జనంసాక్షి:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత వలసదార్లకు కష్టాలు మొదలయ్యాయి. ట్రంప్ సర్కార్ విధానాలతో విదేశీయులు బిక్కుబిక్కుమంటూ రోజులు లెక్కబెట్టుకొనే పరిస్థితి వచ్చింది. ఎవరిని ఎప్పుడు వెళ్లగొడతారో తెలియడంలేదు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే 'సామూహిక తరలింపులకు' తెరలేపారు. వేలాది మందిని బలవంతంగా స్వదేశాలకు పంపించారు. కాళ్లకు చేతులకు సంకెళ్లు వేసి మరీ విమానాల్లో తరలించారు. చట్టాలను ఉల్లంఘించారంటూ అభియోగాలు మోపి విదేశీయులను అరెస్టు చేస్తున్నారు. అమెరికాలోకి ప్రవేశంపై కొత్తకొత్త ఆంక్షలు విధిస్తున్నారు. వీసాలు రద్దు చేస్తున్నారు. ఈ పరిణామాలన్నీ వలసదార్లను బెంబేలెత్తిస్తున్నాయి. చాలామంది అమెరికాను వీడుతున్నారు. అమెరికాలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ దాకా.. కేవలం ఆరు నెలల్లో వలసదార్ల సంఖ్య ఏకంగా 15 లక్షలు తగ్గినట్లు 'ప్యూ రీసెర్చ్ సెంటర్' తాజాగా ఒక నివేదికలో వెల్లడించింది. అగ్రరాజ్యంలో 1960వ దశకం తర్వాత ఇమ్మిగ్రెంట్స్ సంఖ్య ఈ స్థాయిలో తగ్గిపోవడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ ఏడాది అరంభంలో దేశంలో మొత్తం వలసదార్లు 5.33 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం 5.19 కోట్లకు పడిపోయింది. వలసదార్లు వెనక్కి వెళ్లిపోతుండడం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు భారీగా నష్టం వాటిల్లుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఆరు నెలల్లో తగ్గిపోయిన ఇమ్మిగ్రెంట్లలో 7.50 లక్షల మంది కార్మికులే ఉంటారని అంచనా. కార్మికులు వెళ్లిపోతే లేబర్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని చెబుతున్నారు.అమెరికాలో జనాభాలో 'పనిచేసే సామర్థ్యం కలిగిన' వారి సంఖ్య పెరగడం లేదు. వర్కింగ్-ఏజ్ పీపుల్ సరిపడా లేకపోతే వలసదార్లపై ఆధారపడాల్సిందే.కొత్త వలసదార్లు రాకపోగా, ఉన్నవారే స్వదేశాలకు, ఇతర దేశాలకు వెళ్లిపోతుండడంతో ఆర్థిక వ్యవస్థ దిగజారుతుందని నిపుణులు తేల్చిచెబుతున్నారు. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. నిజానికి వలసదార్లపై కఠిన ఆంక్షలు 2024లో జో బైడెన్ ప్రభుత్వ హయాంలోనే మొదలయ్యాయి. విదేశీయుల రాకను సరిహద్దుల్లో కట్టడిచేశారు. ట్రంప్ వచ్చాక ఆంక్షల మరింత తీవ్రమయ్యాయి. విదేశీయులను బయటకు వెళ్లగొట్టడమే ఏకైక లక్ష్యం అన్నట్లుగా ట్రంప్ ప్రభుత్వం పనిచేస్తోంది. ఇలాంటి పరిస్థితి గత 70 ఏళ్లలో ఎప్పుడూ లేదు. అమెరికాలో చట్టబద్ధమైన వలసదార్లే కాకుండా అక్రమ వలసదార్ల సంఖ్య కూడా వేగంగా తగ్గిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే వలసదార్లు అత్యధికంగా ఉన్న దేశాల జాబితాలో అగ్రస్థానం ఇప్పటికీ అమెరికాదే. ఈ ఏడాది జనవరిలో దేశ జనాభాలో వలసదార్ల వాటా 15.8 శాతం కాగా, జూన్ నాటికి 15.4 శాతానికి పడిపోయినట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. అమెరికాలోని టెక్సాస్, కాలిఫోర్నియా రాష్ట్రాల్లోనే అత్యధికంగా ఇమ్మిగ్రెంట్లు ఉన్నారు.




# 2030 నాటికి..

### బయోఫార్మా రంగంలో భారత్ టాప్‌లోకి..

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**అంతర్జాతీయంగా తమ కార్యకలాపాలకు సంబంధించి అత్యంత వేగంగా ఎదుగుతున్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని థర్మో ఫిషర్ సైంటిఫిక్ ప్రెసిడెంట్ టోనీ యాక్సియారిటో తెలిపారు.దేశీయంగా 2024లో 8.1 బిలియన్ డాలర్లుగా ఉన్న బయోఫార్మా రంగం 2030 నాటికి 15.9 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందనుందని బయోఫార్మా సదస్సు 2025లో పాల్గొన్న సందర్భంగా చెప్పారు.ఈ నేపథ్యంలో తాము గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వేలీలో తలపెట్టిన బయోప్రాసెస్ డిజైన్ సెంటర్, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఈ ఏడాది ఆఖరు నాటికి అందుబాటులోకి వస్తాయని టోనీ చెప్పారు. భారత బయోఫార్మా పరిశ్రమ ప్రస్తుతం అధునాతన టెక్నాలజీలు, నిపుణులపరంగా ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు ఇవి తోడ్పడగలవని ఆయన వివరించారు.

# 'స్పైడర్‌మ్యాన్'కు పోలీసుల షాక్!



**భువనేశ్వర్,జనంసాక్షి:**సోషల్ మీడియాలో పాపులర్ అవ్వడానికి యువత.. అతిగా వ్యవహరిస్తున్నారు. ఒడిశాలో 'స్పైడర్‌మ్యాన్' వేషధారణలో బైక్‌పై స్టంట్లు చేసిన ఓ యువకుడికి పోలీసులు షాక్ ఇచ్చారు.రూ. 15,000 జరిమానా విధించారు. ఒడిశాలోని రౌర్కెలాలో ఈ ఘటన జరిగింది. "స్పైడర్‌మ్యాన్" డ్రెస్‌లో అధిక వేగంతో రోడ్డుపై బైక్ నడుపుతూ కనిపించాడు. కనీసం హెల్మెట్ కూడా లేకుండా నేనే స్పైడర్‌మ్యాన్ అంటూ స్టంట్లు చేస్తూ.. వాహనదారులు, పాదచారులకు తీవ్ర అసౌకర్యం కలిగించాడు.పెద్దగా శబ్ధం చేసే విధంగా మోడిఫైడ్ లౌడ్ సైలెన్సర్‌తో హల్‌చల్ చేశాడు. ఆ యువకుడి ఓవర్‌యాక్షన్‌కు ట్రాఫిక్ పోలీసులు బ్రేకులు వేశారు. అతని బైక్‌ను స్వాధీనం చేసుకుని రూ. 15,000 జరిమానా విధించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, వేగం, మోడిఫైడ్ లౌడ్ సైలెన్సర్ వాడినందుకు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.ఇలాంటి ఘటనలు తరుచూ వెలుగులోకి వస్తున్నాయి. గత ఏడాది ఢిల్లీలో స్పైడర్‌మ్యాన్, స్పైడర్ ఉమెన్ దుస్తులు ధరించిన ఓ జంట బైక్‌పై ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తూ.. పోలీసులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ ఘటన ఢిల్లీలో జరిగినట్లు తెలిసింది. ప్రమాదకరమైన విన్యాసాలు చేయడంతో పాటు ట్రాఫిక్ రూల్స్ పాటించని కారణంగా ఢిల్లీ పోలీసులు ఆ జంటను అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు పాల్పడిన వారు 20 ఏళ్ల ఆదిత్య మరియు 19 ఏళ్ల అంజలి అని తెలుస్తోంది.ఢిల్లీలోనే జరిగిన మరో ఘటనలో స్పైడర్‌మ్యాన్ వేషంలో ఉన్న ఒక వ్యక్తి ఎస్‌యూవీ బానెట్‌పై కూర్చొని విన్యాసాలు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. స్పైడర్ మ్యాన్ వేషంలో ఉన్న వ్యక్తిని నజాఫ్‌గఢ్ నివాసి ఆదిత్య (20) గా గుర్తించారు. మరో వైపు, వాహనం నడుపుతున్న వ్యక్తిని మహావీర్ ఎన్‌క్లేవ్ నివాసి గౌరవ్ సింగ్‌కు కూడా పోలీసులు జరిమానా విధించారు.

### పనిఒత్తిడి.. ఆవేశం.. ఆందోళన.. చివరికి..

# హింసవైపు యువత..

- తీవ్రస్థాయి నిర్ణయాలకు జైకొడుతున్న యువత
- ఎన్నింటికో దారి తీస్తున్న మానసిక అలసట

క్రీట్ (గ్రీస్): తొమ్మిది నెలల క్రితం అమెరికాలో జరిగిన ఒక హత్య మిగతా అన్ని నేరాల మాదిరిగా ఒకటి, రెండు రోజులు మీడియాలో పతాకశీర్షికలకెక్కి కనుమరుగుకాలేదు.హత్య చేసిన హంతకుడిని శిక్షించాలనే డిమాండ్లకు బదులు అతడిని కీర్తిస్తూ లక్షలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు పలకడం యావత్ ప్రపంచాన్ని విస్మయపరిచింది. హత్యను ఖండించాల్సిందిపోయి అతడికి బెయిల్ ఇవ్వాల్సిందేనని ఆన్‌లైన్‌లో ఒక ఉద్యమమే మొదలైంది 2024 డిసెంబర్‌లో అమెరికాలో అత్యంత సంపన్న ఆరోగ్యబీమా సంస్థ అయిన 'యునైటెడ్ హెల్త్‌కేర్'సీఈఓ బ్రియాన్ థాంప్సన్‌ను షూట్‌చేసి చంపేసిన లిగి మాంజియోన్ అనే యువకుడి గురించే ఇదంతా. హత్య వంటి తీవ్రస్థాయి హింసను ఒక సగటు మనిషి తప్పుబట్టాల్సిందిపోయి వెనకేసుకురావడం వెనకున్న అంతరార్థం ఏమిటనే దానిపై ఇప్పుడు మానసిక వైద్యరంగంలో చర్చమొదలైంది పనిచేసే చోట నెలకొన్న తీవ్రస్థాయి ఒత్తిడి వాతావరణమే యువత మానసిక అలసటకు గురై, పట్టరాని కోపం, అసహనం, ఉద్రేకం దిశగా పయనింపజేస్తోందని పలువురు మనోవిజ్ఞాన శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. థాంప్సన్‌ను హత్యచేయడం సబబేనని ఆన్‌లైన్‌లో నిర్వహించిన సర్వేలో 41 శాతం యువత వ్యాఖ్యానించడం మారుతున్న యువత ఆలోచన ధోరణులకు అద్దంపడుతోందని మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. తాము పనిచేసే సంస్థలో జరిగే అవినీతి, సంస్థ ఉన్నతాధికారులు, యాజమాన్యం దురాశను నేటి యువత ఏమాత్రం సహించట్లేదు. తీవ్రస్థాయి పని ఒత్తిడి, అనుక్షణం మారుతున్న సంస్థలో పని విధానాలు, ఆధునిక పని వాతావరణం సైతం యువతలో అసంతృప్తి జ్వాలలను రాజేస్తూ చివరకు వారిలో పట్టరాని ఆవేశాన్ని మరింత ఎగదోస్తోంది. అన్ని రంగాలకు సంబంధించి యువ ఉద్యోగులు, కార్మికుల మనసులో గూడు కట్టుకుంటున్న అసంతృప్తి తాలూకు వివరాలతో ఏపీఏ 'సైకాలజీ ఆఫ్ వయలెన్స్'జర్నల్ 'హింస్మాతక పిడివాదం'పేరిట ప్రత్యేక సంచికను వెలువర్చింది. గ్రీస్‌లోని క్రెటే విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ అలెక్సియోస్ అర్వాంటిస్ సారథ్యంలో ఈ పరిశోధన జరిగింది.పనిప్రదేశంలో విపరీతమైన ఒత్తిడి కారణంగా మానసిక అలసట పెరిగిపోయి చివరకు భ యం, బాధ, అసంతృప్తి, అసహనం కట్టలు తెంచుకుంటున్నాయి. తమకు అన్యాయం జరి గిపోతోందనే భావన యువతలో పెరిగిపోతోంది. దీంతో అన్యాయానికి హింసతోనే ముగింపు పలకాలనే ధోరణి ఎక్కువవుతోంది. అధ్యయనంలో భాగంగా పరిశోధకులు వందలాది మంది యువ ఉద్యోగుల రోజువారీ మానసిక స్థితిని అంచనావేశారు. మానసిక అలసట, మానసిక స్థితి, హింసాత్మక ఆలోచన స్థాయిలను క్రోడీకరించారు. అతిగా మానసికంగా అలసిపోయి నప్పుడు తీవ్రస్థాయి ఆలోచనలు మంచివేనన్న భావన వారిలో పెరిగిపోతోంది. అన్యాయాన్ని అంతమొందించాలంటే హింసే అత్యుత్తమ మార్గమని వాళ్లు భావిస్తున్నారు.







# రాజన్న ఆలయ అభివృద్ధి నా ఒక్కడి ఎజెండా కాదు..

- ఇది రాజన్న భక్తుల ఎజెండా
- రూ 6 కోట్ల 50 లక్షలతో రోడ్డు నిర్మాణనికి శంకుస్థాపన

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 24 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి నా ఒక్కడి ఎజెండా కాదని,ఇది రాజన్న భక్తుల ఎజెండా అన్నారు.ఆదివారం రూ 6 కోట్ల 50 లక్షలతో రోడ్డు నిర్మాణనికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే లతో శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడలో ములవాగు బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం వరకు రూ 6 కోట్ల 50 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. రహదారి పనులు 2 నెలల లోపు పూర్తి అవుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేములవాడ రోడ్డు వెడల్పు పనుల కోసం ఎదురు చూస్తు న్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేసిందన్నారు.ప్రభుత్వం ఏర్పడిన మొదటి మాసంలోనే వీటిడిఏ సమావేశం ఏర్పాటు చేసి మళ్ళీ పోయిన 20 కోట్ల నిధులను తిరిగి తెప్పించి బద్ధిపోచమ్మ ఆలయం వద్ద అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం చేశమన్నారు.

ఆనాటి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదే రాజన్న తంతల మీద మాట్లాడుతూ నా లగ్గం ఇక్కడే అయింది,రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా వంద కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తానని మాటిచ్చి రాజన్న భక్తులను మోసం చేశాడన్నారు. రాజన్న భక్తులుగా ఈ ప్రాంత వాసులుగా గత ప్రభుత్వ హయాంలో ప్రతి బడ్జెట్లో నిధులు కేటాయిస్తారు కావచ్చు అని ఎంతో ఆశగా ఎదురు చూసమన్నారు.ఆనాడు గత ప్రభుత్వం రంగు రంగుల బ్రోచర్లతో, రోడ్డు వెడల్పు చేసినట్టు రాజన్న భక్తులను మోసం చేశారన్నారు. ఎన్నిసార్లు ఎదురు చూసిన రాజన్న భక్తులకు మొండి చేయి చూపెట్టారని,రాజన్న భక్తులుగా గత ప్రభుత్వపై అనేక ఆందోళన చేసామన్నారు. రోడ్డు వెడల్పు సమయంలో కొందరు నాయకులు వచ్చి అటు ఇటు నడిచి పనులు ఎప్పుడు ప్రారంభం చేస్తారో చెప్పాలన్నారు.2014 ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో ప్రస్తుతం కూడా అలానే ఉందన్నారు.

మేము ఏప్పుడు కూడా రాజన్న అలయనికి నిధులు కేటాయిస్తామని చెప్పలేదని, రాజన్న ఆలయాన్ని అభివృద్ధి పథంలో తీసుకోవడానికి ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వం రూ150 కోట్లు బడ్జెట్లో కేటాయించడం జరిగిందన్నారు. ఒక్క పాత గత ప్రభుత్వం ఆలయంలో ఇటుక తీసి కొత్త ఇటుక పేట్టలేదన్నారు.గత సంవత్సరం నవంబర్ 20 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోని 8 మంది మంత్రుల చేతుల మీదుగా వేములవాడలో సుమారు రూ1000 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. ఆనాడు శంకుస్థాపనలు చేసుకున్న పనులను నేడు వేగవంతంగా పూర్తి చేస్తున్నమన్నారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ నేతృత్వంలో అధికార యంత్రం పనులను పర్యవేక్షిస్తున్నారన్నారు. గత 54 సంవత్సరాలుగా వేములవాడ పట్టణ ప్రజలు,భక్తులు ఎదురు చూస్తున్నా రోడ్డు వెడల్పు పనులను నేడు ప్రారంభం చేయడం జరుగుతుందన్నారు. అధికారంలోకి రాగానే 80 ఫీట్ల వెడల్పుతో చేస్తానని ఇచ్చిన హామీ మేరకు నేడు అమలుకి తీసుకువచ్చి రూ 6 కోట్ల 50 లక్షలతో 80 ఫీట్ల రోడ్డు పనులు ప్రారంభానికి శంకుస్థాపన చేశమన్నారు.రోడ్డు వెడల్పులో భూములు కోల్పోయిన నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని, వారిని ఎల్లవేళలా గుర్తు చేసుకుంటాం వారికి 2013 భూసేకరణ చట్టం ద్వారా నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణంతో పాటు అధునాతన పద్ధతుల్లో లైటింగ్ సిస్టం కూడా ఏర్పాటు చేస్తామన్నారు.మేము ప్రారంభం చేసిన పనులే ఈ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పడానికి నిదర్శనమన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సాధించారన్నారు. త్వరలోనే రూ 76 కోట్లతో రాజన్న ఆలయ మొదటి దశ అభివృద్ధి పనులు ప్రారంభం చేయడం జరుగుతుందన్నారు.ఇప్పటికే అగ్రిమెంట్లు పూర్తయి నమూనాలు త్వరలోనే వస్తాయన్నారు.శృంగేరి పీఠాధిపతులు అనుమతులు ఇప్పటికే తీసుకోవడం జరిగిందని,వేములవాడ పరిరక్షణ సమితి పట్టణ ప్రజల ఆలోచనలు సలహాలు సూచనలు తీసుకోవడం జరిగిందన్నారు.భక్తుల సౌకర్యార్థము ఆలయ గుడి చెరువు ప్రాంగణంలో రూ 35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణనికి టెండర్ పూర్తయింది త్వరలోనే పనులు ప్రారంభం చేయడం జరుగుతుందన్నారు.ప్రజా ప్రభుత్వంలో రాజన్న ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తూ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు శీఘ్రదర్శనం కలిగేలా ఏర్పాటు చేస్తామన్నారు.

వేములవాడ పట్టణం,రాజన్న ఆలయం రెండు కండ్లలాగా అభివృద్ధి చేస్తమని,వేములవాడను టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తమన్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాజన్న రహదారి విస్తరణలో భాగంగా ఆలయం ముందు కూడలి ఏర్పాటు చేస్తూ అమరవీరుల స్థూపం వద్ద మరో కూడలిని ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే,ఆలయ ఈవో రాధ భాయి,మున్సిపల్ కమిషనర్ అన్వేష్,సెస్ డైరెక్టర్ నామాల ఉమా లక్ష్మీరాజం, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు,చెలకల తిరుపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# మోపాల్, ముదక్ పల్లిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**వసతి గృహాలు, ఎంపీడీఓ, తహసీల్ కార్యాలయాల సందర్శన**



**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 23 (జనం సాక్షి) :** జిల్లాలోని మోపాల్, ముదక్ పల్లిలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముదక్ పల్లి గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని, మోపాల్ మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. మోపాల్, ముదక్ పల్లి హాస్టళ్లను తనిఖీ చేసి, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు రాత్రి భోజనంలో అందించిన ఆహార పదార్థాలు మెనూకు అనుగుణంగా ఉన్నాయా అని పరిశీలించారు. భోజనం సక్రమంగా అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్, కిచెన్, స్టోర్ రూమ్ లను తనిఖీ చేసి, వార్డెన్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, ప్రతి రోజు ఫేస్ రికగ్నిషన్ ద్వారా వంద శాతం హాజరు నమోదు జరగాలని అన్నారు. వసతి గృహాలలో అందుబాటులో ఉన్న తాగునీరు, టాయిలెట్స్ తదితర సదుపాయాలు పరిశీలించి, ఇంకనూ ఏమైనా సౌకర్యాలు అవసరం ఉన్నాయా అని ఆరా తీశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. అంతకుముందు కలెక్టర్ మోపాల్ ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్ల గురించి ఎంపీడీఓ రాములు నాయక్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాను పరిశీలించి, పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా పరిశీలన చేయాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్ధవంతంగా నిర్వహించేలా సన్నద్ధమై ఉండాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యల గురించి డిప్యూటీ తహసీల్దార్ సరిత ను ఆరా తీశారు. దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరిక**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 24 (జనంసాక్షి) :** విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిష నర్ గౌష్ ఆలం హెచ్చరించారు. కొత్త విద్యా సంవత్సరం సమీపి స్తున్న నేపథ్యంలో ఆదివారం ఆయన ఈ ప్రకటన జారీ చేశారు. ర్యాగింగ్ తీవ్రమైన నేరమని, ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రమా దంలోకి నెట్టివేస్తుందని ఆయన తెలిపారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లను వేధించడం, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడ డం చట్ట ప్రకారం శిక్షార్హమని స్పష్టం చేశారు. ర్యాగింగ్‌లో పాల్గొ న్న వారిని కళాశాలల నుంచి తొలగించడమే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతామని హెచ్చరించారు. విద్యాసంస్థల యాజమాన్యం యాంటీ-ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, కొత్త విద్యార్థులకు ప్రత్యేక పర్యవేక్షణ కల్పించాలని సూచించారు. ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహించా లని, 24 గంటల హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులు సహ పాఠుల పట్ల వేధింపులకు పాల్పడవద్దని, ర్యాగింగ్‌కు గురైన వారు వెంటనే ప్రిన్సిపాల్, యాజమా న్యం లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ర్యాగింగ్ సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. ర్యాగింగ్ సమాచారం కోసం డయల్ 100 లేదా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 8712670744, 8712670745కు సంప్రదించవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అందరి సహకారంతో ర్యాగింగ్ రహిత సమాజాన్ని నిర్మించవచ్చని గౌష్ ఆలం ఆశాభావం వ్యక్తం చేశారు.



# చొప్పదండి నుంచి జనహిత పాదయాత్ర

**ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో రెండో విడత**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 24 (జనంసాక్షి) :** చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర-ఉప్పర మల్యాల నుంచి టీపీసీసీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో జన హిత పాదయాత్ర రెండో విడత ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తదితర నేతలు పాదయాత్రలో పాల్గొన్నారు. సేవాదళ్ ఆధ్వర్యంలో మహేష్ కుమార్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉప్పర మల్యాలలో జన సందోహంతో కిటకిటలాడిన ఈ పాదయాత్రకు బీసీ సంఘాలు భారీగా సంఘీభావం తెలిపాయి. ముదిరాజ్, మున్నూరుకాపు, యాదవ, గౌడ, పద్మశాలి సంఘాల నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి, కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల కోసం చేపడుతున్న కృషిని హర్షిస్తూ పాదయాత్రలో చేరారు. కురిక్యాలలో ఇందిరమ్మ లబ్ధిదారులు భాగ్య-గంగయ్య దంపతుల ఇంటిని మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్, పొన్నం ప్రభాకర్ తదితరులు సందర్శించి పరిశీలించారు. ఉప్పర మల్యాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ పాదయాత్రను ప్రారంభించారు.



# ఫామాయిల్ సాగుతో ఆర్థిక లాభాలు

**ప్రభుత్వం నుంచి సబ్సిడీలు సద్వినియోగం చేసుకోవాలి**

- మొక్కల సక్రమ నిర్వహణతో 35 ఏండ్లపాటు ఆదాయం
- మార్కెటింగ్, కోతుల, కూలీల ఇబ్బందులు లేవు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 24.(జనంసాక్షి) :** మార్కెటింగ్, కోతులు, కూలీల ఇబ్బందులు లేని ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం జిల్లాలో క్రమంగా పెరుగుతున్నది. పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు, మద్దతు అందిస్తూ భరోసా ఇస్తున్నది. అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతున్నది. జిల్లాలోని పలు మండలాల్లో పంట చేతికి రావడంతో రైతుల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరుగుతున్నది. దేశంపై దిగుమతుల భారం తగ్గి.. నూనె గింజల సాగులో స్వయం సమృద్ధి సాకారమవుతున్నది.

ప్రపంచంలో అత్యధిక దిగుబడిని ఇచ్చే నూనె గింజల పంటలో ఆయిల్ పామ్ పంట ఒకటి. మన దేశంలో వంటలో ఉపయోగించే నూనెలో పామ్ ఆయిల్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఇంతగా డిమాండ్ ఉన్నా మన దేశంలో పామ్ ఆయిల్ సాగు బాగా తక్కువ ఉంది. దీంతో మలేషియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకుంటున్నాము. దేశం ముడి చమురు (పెట్రోల్, డీజిల్) తర్వాత ఎక్కువగా పామ్ ఆయిల్ (ఆయిల్ పామ్ చెట్ల నుంచి వచ్చిన గెలలతో తీసిన ఆయిల్)ని దిగుమతి చేసుకుంటుం ది. వంట నూనెలో దీని వాటా ఎక్కువగానే ఉంటుంది. గత 100 ఏండ్ల నుంచి దేశం వంట నూనె డిమాండ్ లో దిగుమతి భారీగానే చేసుకుంటూనే ఉంది.

**4వ సంవత్సరం నుంచి దిగుబడి..**

ఆయిల్ పామ్ సాగు మొదలు పెట్టిన 4వ సంవత్సరం నుంచి దిగుబడి వస్తుంది. 4-6వ సంవత్సరం వరకు 5 నుంచి 7 టన్నులు దిగుబడి వస్తుంది. 7వ సంవత్సరం నుంచి 10-15 టన్నులు దిగుబడి వస్తుంది. ప్రీ-యునిక్ కంపెనీ వారు పంట గెలలు కొనుగోలు చేస్తారు.

**బంగారు పంట మీద ఎక్కువగా శ్రద్ధ..**

ఇంత డిమాండ్ ఉన్న పంట కాబట్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బంగారు పంట మీద ఎక్కువగా శ్రద్ధ చూపించి రైతులకు తోడ్పాటుగా మొక్కలు, డ్రిప్ మీద సబ్సిడీపై అందిస్తున్నాయి. ఆయిల్ పామ్ పంట సాగు నిర్వహణ చాలా సులువు. చీడ, పీడల, కోతులు, ఇతర అటవీ జంతువుల బెడద ఉండదు. ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాల మేరకు పంట సాగు చేస్తే అధిక దిగుబడి, ఆదాయం సొంతం చేసుకోవచ్చు. జిల్లాలో పట్టా భూములు ఉన్న రైతులు అర్హులు. ఒక ఎకరం నుంచి ఎన్ని ఎకరాల్లో అయినా సాగు చేసే వారికి సబ్సిడీ అందుతుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్ పరికరాలకు 100 శాతం సబ్సిడీ, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ, ఓసీలకు చెందిన రైతులకు 80 శాతం సబ్సిడీ అందజేయనున్నారు. ఎకరం విస్తీర్ణంలో 50 మొక్కలు నాటుతారు. ఒక్కో మొక్క విలువ మార్కెట్లో రూ.200 ఉండగా, రైతులందరికీ 90 శాతం సబ్సిడీ వర్తింపజేస్తూ కేవలం రూ.20కే అందజేస్తారు. మొక్కలు, డ్రిప్, ఇతర సహాయం అన్ని కలిపి ఒక ఎకరానికి ప్రభుత్వం రూ. 52 వేల వరకు సబ్సిడీ నాలుగు ఏండ్లపాటు అందజేస్తుంది.


**అంతర పంటలతో అదనపు ఆదాయం..**

ఆయిల్ పామ్ పంట దిగుబడి మూడో ఏడాది గడిచిన తరువాత మొదలు అవుతుంది. రైతులకు ఆయిల్ పామ్ లో అంతర్ పంటల ద్వారా మొదటి మూడు సంవత్సరాలు ఆదాయం లభిస్తుంది. వరి, చెరుకు మినహా అన్ని కూరగాయలు, ఇతర మొక్కలు సాగు చేసుకోవచ్చు.

**లక్ష్యం దిశగా అడుగులు..**

జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 2 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం లక్ష్యం కాగా ఇప్పటివరకు 1160 ఎకరాల గల 331 రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపించారు. 120 ఎకరాలలో ప్లాంటేషన్ పూర్తి చేయడం జరిగింది. మిగితా రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో మొత్తం ఇప్పటిదాకా 2300 ఎకరాలకు పైగా సాగులో ఉంది.టన్ను రూ.18 వేలకు పైగా ధర 2022 సంవత్సరంలో బోయినపల్లి, ఇల్లంతకుంట, ముస్తాబాద్, వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలాల్లో 292 మంది రైతులు 978 ఎకరాలలో ఆయిల్ పామ్ వేయగా, ఈ ఏడాది 450 టన్నుల వరకు దిగుబడి రానున్నదని అంచనా. ఇప్పటిదాకా 16 టన్నుల వరకు పంటను కోసి, పరిశ్రమకు తరలించారు. ఒక్కో టన్నుకు 18,052 రూపాయలకు పైగా ధర లభించింది. కంపెనీ వారే వచ్చి ఆయిల్ పామ్ ఉత్పత్తులు సేకరిస్తారు. వారం రోజుల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

**ఖచ్చితమైన మార్కెటింగ్ ఉన్న పంట, దళారీలు ఉండరు.**



రైతులు ఆయిల్‌పామ్ పంట సాగుపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి పొందాలి. ఆసక్తి ఉన్న రైతులు తమ సమీపంలోని ఉద్యానవన శాఖ అధికారులు వీ గోవర్ధన్ , ఉద్యాన అధికారి ( సిరిసిల్ల డివిజన్) -89777 14049, సీ హెచ్ లోకేష్, ఉద్యాన అధికారి (వేములవాడ డివిజన్) 89777 14048, వ్యవసాయ విస్తీర్ణ అధికారి లేదా ఆయిల్ పామ్ కంపెనీ సిబ్బందిని సంప్రదించాలి.

**నాలుగు ఎకరాల్లో వేసిన..**

**లెంకల చంద్రశేఖర్ రెడ్డి, మర్లపేట, బోయినపల్లి మండలం.**

ఆయిల్ పామ్ సాగు గురించి అధికారులు చెబితే నాలుగు ఎకరాల్లో వేసిన. సాగులో ఎలాంటి ఇబ్బందులు లేవు. నిర్వహణ చాలా సులువు. చీడ పీడల బాధ లేదు. అధికారుల సూచనల మేరకు సాగు చేసాను. మంచి దిగుబడితో రూ.50 వేల వరకు ఆదాయం వచ్చింది.

**చంద.విజయకుమార్, తెర్లుమద్ది, ముస్తాబాద్ మండలం.**

నేను ఐదు ఎకరాల్లో పంట సాగు చేసాను. యాజమాన్య పద్దతులు పాటించాను. మూడు కోతల్లో కలిపి మూడువేల కిలోల వరకు వరకు దిగుబడి వచ్చింది. దాదాపు రూ. 50 వేలకు పైగా ఆదాయం సమకూరింది. నాలుగో సంవత్సరం నుంచి ప్రతి నెలా ఆదాయం వస్తుంది.

**ప్రభుత్వ సహాయాన్ని వినియోగించుకోవాలి :**

**సందీప్ కుమార్ ఝా, కలెక్టర్.**



ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. అందరూ వేసే పంటలు కాకుండా దీనిని వేస్తే నాలుగో సంవత్సరం నుంచి 30 ఏండ్ల పాటు ఆదాయం వస్తుంది. ప్రభుత్వ సబ్సిడీలు సద్వినియోగం చేసుకొని, యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలి. ఆర్థికంగా లాభం పొందాలి.

# గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 24 (జనం సాక్షి) :** తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సెంట్. క్సావీర్స్ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మరియు పోక్సో యాక్ట్ పై ఆదివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయవాది రజిత, షి - టీమ్ ఆఫీసర్ హరిత రాణి, నాగరాజు, మరియు గైనకాలజిస్ట్ డాక్టర్ మల్లీశ్వరి విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లీశ్వరి మాట్లాడుతూ విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి, అలాగే యుక్త వయస్సులో అమ్మాయిలకు వొచ్చే సమస్యల గురించి వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విపులంగా వివరించారు. అనంతరం యువ న్యాయవాది రజిత మాట్లాడుతూ పోక్సో యాక్ట్ గురించి వివరించి, విద్యార్థులు సమాజంలో జరుగుతున్న అమానవీయ విషయాలకు దూరంగా ఉండాలని, వయస్సు రీత్యా వస్తున్న మార్పులను అర్థం చేసుకోవాలని, 18 సంవత్సరాల లోపు విద్యార్థినీ, విద్యార్థులు తప్పటడుగులు వేస్తే పోక్సో యాక్ట్ వల్ల ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. షి- టీమ్ ఆఫీసర్ హరిత రాణి మాట్లాడుతూ అమ్మాయిలు తమకు పోకిరీల నుండి పొంచి ఉన్న ముప్పును పసిగట్టి షి టీమ్ సహాయంతో వారి ఆట కట్టించవొచ్చు అను అలాగే సోషల్ మీడియాలో నుండి పొంచి ఉన్న ముప్పును అబ్బాయిల నుండి వస్తున్న ప్రలోభాలను ధైర్యంగా ఎదురుకోవాలని సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండాలని తెలిపారు.అమ్మాయిలకు షి టీమ్ అండగా ఉంటుందని ఈవ్ టీజింగ్ ద్వారా ఇబ్బందులు ఎదురైతే తమను ధైర్యంగా సంప్రదించాలని బాధితురాలు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు. చివరగా సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ రామ్, రాష్ట్ర కార్యదర్శి అనిరుధ్ రాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ప్రతి ఒక్కరికి చట్టాలపై మరియు సెక్సువల్ గా తమపై జరిగే దాడులను ఎదుర్కోవడానికి చైతన్య వంతమైన సమాజాన్ని నిర్మించడానికి ఈ వేదికను ఉపయోగించి ముందుకు వెళ్తామని, ఇక నుండి ప్రతి శనివారం ఒక్కో పాఠశాలలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూ ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వినయ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో ప్రజలు పరేషాన్

**కాంగ్రెస్ పార్టీ నుండి తెరాస పార్టీలో భారీ చేరికలు**



**బిచ్కుంద ఆగస్టు 24 (జనంసాక్షి) :** వివిధ పార్టీ నాయకులు కార్యకర్తలు తమ పార్టీ ఓటమి తరువాత, అధికారంలో ఉన్న పార్టీ కండువా కప్పుకుంటారు కానీ అధికారంలో ఉన్న పార్టీని వదిలి ఇతర పార్టీలలో వెళ్లడం చాలా అరుదు. వివరాల్లోకి వెళితే జుక్కల్ నియోజకవర్గంలో ఆదివారం నాడు కాంగ్రెస్ పార్టీ నుంచి తెరాస పార్టీలో భారీ చేరికలు జరిగాయి. మద్నూర్ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు తైదలవర్ రాజు మరియు తన అనుచరులతో పాటు అంతాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విఠల్ పటేల్ జుక్కల్ మాజీ శాసన సభ్యుడు హన్మంత్ షిండే ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇస్తానన్న 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంలో ప్రజలకు మోసం చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వము విఫలం అవడంతో కాంగ్రెస్ పార్టీ విడి గులాబీ పార్టీకి చేరుతున్నామని వారన్నారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ లో ఎవరూ నమ్మరని, వారికి మేము కాని ప్రజలు కాని రాబోయే స్థానిక ఎన్నికలలో కానీ, భవిష్యత్ ఎన్నికలలో సైతం ఎపుడు జరిగిన జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే షిండే మాట్లాడుతూ తెరాస పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు లొంగి పార్టీ నుంచి విడిన నాయకులకు, కార్యర్తలకు కొన్ని సూచనలు చేశారు. మీరు భయపడకుడని, రాబోయే భవిషత్ మనదేనని, ఎవరైనా సరే రానున్న స్థానిక ఎన్నికల ముందే పార్టీలో మీకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని, ఏ కష్టం వచ్చినా మీకు నేను ఉన్న అని భరోసా కల్పించారు. జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు అధికారులకు తప్పుదోవ పట్టిస్తున్నారని, అంతేగాకుండా విలేఖరులకు అక్రమ కేసులు పెట్టి భయభ్రాంత్రులకు గురి చేస్తున్నట్లు గతంలోనే పేర్కొన్నారు. తమ హయాంలో ఇలా చేయలేదని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మనదే అధికారం అని తేల్చి చెప్పారు.



# పారిశుద్ధ్యం పక్కన పెట్టు...
# రోడ్డు ప్యాచ్‌లు ముందరపెట్టు

## రోడ్డు ప్యాచ్ వర్కు పనులను టెండర్లు పిలవక పోవడంలో ఆంతర్యం ఏంటి?

- పారిశుద్ధ కార్మికులతో రాత్రి వేళ రోడ్డు ప్యాచ్ వర్కులు
- కార్మికులకు ఏమన్నా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులు..?



**కార్మికులకు ఏమన్నా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులు..?**

శానిటేషన్ కార్మికులకు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.గత కొన్ని సంవత్సరాల క్రితం వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తులో పరిశుద్ధ కార్మికులకు యాక్సిడెంట్ చేసి రెండు నిండు ప్రాణాలను హరించిన సంఘటనలు ఉన్నాయి. ఇలాగే రాత్రి వేళ రోడ్డు పై పనులు చేస్తూ ఉంటే కార్మికులకు యాక్సిడెంట్ అయ్యే అవకాశం లేకపోలేదు.శానిటేషన్ కార్మికులకు ఏమన్నా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులు అనే ప్రశ్న కార్మికులలో లేకపోలేదు.

**కోరుట్ల, ఆగస్టు 27 (జనం సాక్షి) :** కోరుట్ల పట్టణమంతా కంపు కొడుతున్న మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు మాత్రం డబ్బు కొడుతుందా....? సొమ్మును నీళ్ళ పాలు చేస్తుండా..? అంటే నిజమే అంటు న్నారు. కోరుట్ల పట్టణ ప్రజలు అదే ఎలా చేస్తుండో చూద్దాం మరి. కోరుట్ల పట్టణానికి ఒక మంచి పేరు ఉంది.కోరుట్ల ప్రజలు మంచి వారు ఎలా చెపితే వారు అలాగే ఉంటారు. అని అదే ప్రభుత్వ అధికారులకు చులకనగా అయింది. కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో అదే తంతు జరుగు తుంది. వివరాల్లోకి వెళ్తే కోరుట్ల మున్సిపల్ పరిధిలో సుమా రు 33 వార్డులు ఉంటాయి.ఒక్కొక్క వార్డులో సుమారుగా 1500 నుండి 2000 పైగా ఓటర్లు ఉన్నా కూడా పట్టణ జనాభా సుమారుగా 50 వేల మంది కి పైగా ఓటర్లు ఉంటారు.జగిత్యాల జిల్లా కేంద్రం లోనే కోరుట్ల మున్సిపల్ గ్రేడ్ 2గా ఉన్న ఇప్పటికీ సరైన కమీషనర్ ను నియమించ కపోవడం అలాగే హైదరాబాద్లో సెక్రెటరీ ఆఫీసులో సీనియర్ అసిస్టెంటుగా ఉన్న వారిని ప్రమోషన్లో భాగంగా కోరుట్ల కు నియమించడం కోరుట్ల 2 గ్రేడుకు నియమి ంచడం మున్సిపల్ వ్యవస్థ గురించి తెలియకపోవడం కోరుట్ల ప్రజల దౌర్భాగ్యం.

### కంపు కొడుతున్న పాంటిపు ఎక్కడ

కోరుట్ల పట్టణం ఒకప్పుడు డిల్లీ లో హైదరాబాద్లో శానిటేషన్ విభాగాలో పరిశుద్ధం పై బహుమతులు తీసుకునా సందర్భా లు ఎన్నో ఉన్నాయి. కానీ ఇప్పుడు కోరుట్ల పట్టణంలో ప్రతి వార్డులో శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉన్నాయి.వర్ష కాల సమ యంలో డ్రైనేజీ వ్యవస్థ కంపు కొడుతూ దోమల బెడదతో మలేరియా, టైఫాడ్, డెంగ్యూతో ప్రజలు హాస్పిటల్ పాలవు తున్నారు.గత రెండు రోజుల క్రితం ఒక వ్యాపారవేత్త డెగ్యు జ్వరం వచ్చి మరణించారు. అయిన కోరుట్ల పట్టణం లో మున్సిపల్ అధికారులు శానిటేషన్ పై తగు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం లేదని ఒక వ్యక్తి మున్సిపల్ కార్యాలయం కు వెళ్లి మా ఇంటి ప్రక్కన పరిసరాలు పరిశుభ్రంగా లేవని దోమల బెడద ఎక్కువగా ఉన్నాయని వాటిని ఎలాగైనా శు భ్రంగా చేయాలని కమిషనర్‌కు వినివించగా అతనిపై కోపం గా మాట్లాడినటు,అలాగే తను చెప్పిన పనులు చేస్తలేడాని ఒక మున్సిపల్ అధికారికి మెమో జారీ చేసినట్టు సమాచారం.

అయితే గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతునయనా సాకుతో మున్సిపల్ అధికారులు రోడ్ ప్యాచ్ వర్కు పనులు టెండర్ పిలిచి కాంట్రాక్టర్ కు అపాజేపాలి. కానీ కోరుట్ల మున్సిపల్ కమిషనర్ అని తానై శానిటేషన్ కార్మికులతో రాత్రంతా రోడ్ ప్యాచ్ వర్క్ పనులు చెపిస్తున్నారు. కానీ ఈ ప్యాచ్ వర్క్ పనులు ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుంట తూ తూ మాత్రంగానే రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చెపిస్తున్నారు.కానీ ఈ ప్యాచ్ వర్క్ పనులు టెండర్‌కు పిలిచి కాంట్రాక్టర్ కు అపజేపాలి.కానీ ఈ పనులను టెండర్ కు పిలవక పొగ ఆయనే స్వయంగా మున్సిపల్ ట్రాక్టర్ల తో జేసీబీతో కోరుట్ల వాగు నుంచి ఇసుక ,కంకర,సిమెంట్ తెప్పించి మరి శానిటేషన్ కార్మికులతో రాత్రంతా పనులు చేయడం ఏంటని అదే ఒక కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించక పనులు చేస్తే అధికారులకు విన్నవించుకుంటాం. కానీ అదే మున్సిపల్ అధికారు లే నాణ్యత ప్రమాణాలు పాటించక పనులు చేస్తే ఎవరికి చెప్పుకోవాలో..? అని కోరుట్ల పట్టణ ప్రజలు గుసగుసలు ఆడుతున్నారు. అలాగే ప్రతి ఏట గణేష్ నిమజ్జన వేడుకలకు, బతుకమ్మ, దసరా పండుగలకు కొరకు మున్సిపల్ బడ్జెట్ నుండి సుమారుగా 20 లక్షలు బడ్జెట్ ను మున్సిపల్ జనరల్ ఫండ్ నుడి కేటాయిస్తారు. మరి ఈ పండుగల కాంట్రాక్ట్ పనులు కూడా ఈ సారి ఈ సార్ చేసిన ఆశ్చర్యం పోవడంలో తప్పులేదు.. ఈ పనులను టెండర్ కు పిలుస్తాడా..? లేక ఈ సారే చేస్తాడా.వేచి చూడాలి..?



## చందానగర్ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద
# గుర్తు తెలియని మృతదేహం



**శేరిలింగంపల్లి, ఆగస్టు 24 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి చందానగర్ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం చందానగర్ పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. చందానగర్ సిఐ వెల్లడించిన వివరాల ప్రకారం... గత కొన్ని రోజులుగా శేర్లింగం పల్లిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో చందానగర్ రైల్వే బ్రిడ్జి వద్ద భారీగా నీరు చేరడంతో అక్కడ ఒక మడుగుగా మారిందని, ఈ క్రమంలో శనివారం రాత్రి 30 నుండి 35 సంవత్సరాల మధ్యలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆ మార్గం గుండా వెళ్తూ పొరపాటున అందులో జారిపడి మృతి చెంది ఉంటాడన్నారు. మృతుడి వంటిపై నీలిరంగు టీ షర్టు, బ్రౌన్ కలర్ ప్యాంటు ఉన్నాయని, స్థానికులు మృతదేహాన్ని గుర్తించనందున గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, ఎవరికైనా అనుమానం ఉన్నా, మృతదేహాన్ని గుర్తించినా తప్పకుండా చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని, వీలైతే సమాచారాన్ని అందించాలని చందానగర్ సిఐ వివరించారు. మరిన్ని వివరాలకు 9490617118, 87126 63184 నెంబర్లను సంప్రదించాలని సిఐ కోరారు.

# 27 వారాల శిశువుకు ప్రాణం

## అపోలో క్రేడల్ వైద్యుల ఘనత

**హైదరాబాద్ (జనంసాక్షి) :** అత్యంత ముందస్తుగా జరిగిన ప్రసవం ఇది. ఆధునిక పరికరాలు, వైద్యుల నైపుణ్యం ఈ చికిత్సను విజయవంతం చేసింది. శిశువు వయస్సు కేవలం 27 వారాలు,బరువు 504 గ్రాముల మాత్రమే. ఇలాంటి క్లిష్టమైన చికిత్సను అపోలో క్రేడల్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్ విజయవంతంగా నిర్వహించి శిశువును డిశ్చార్జ్ చేసారు . అధునాతన నియోనాటల్ కేర్ సామర్థ్యాలకు ఇది నిదర్శనం. అపోలో క్రేడల్ వైద్యుల అంకితభావానికి మచ్చుతునక. అపోలో క్రేడల్ జూబ్లీ హిల్స్ హాస్పిటల్లో అత్యవసర ఎల్ఎస్సీఎస్ (లోయర్ సెగ్మెంట్ సిజేరియన్ సెక్షన్) ద్వారా ఈ శిశువు పుట్టింది. గర్భంలో ఉన్నప్పుడే డాప్లర్ రీడింగ్స్లో తీవ్రమైన మార్పులు, రక్తప్రసరణలో రివర్స్ ఫ్లో కనిపించడం వల్ల ఈ శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. గర్భం నుంచి బయటకు వచ్చిన ఈ శిశువు జీవన ప్రయాణం ఎన్నో సవాళ్లతో నిండిపోయింది. బతికే అవకాశం చాలా తక్కువగానే ఉన్నా అద్భుతమైన ధైర్యాన్ని చూపించింది. వెంటిలేటర్పై ఉండటం నుంచి ఇన్ఫెక్షన్స్, జాండీస్ , అప్నియాను అధిగమించగలిగింది.

ఈ సందర్భంగా అపోలో క్రేడల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్కన్సల్టెంట్ నియోనాటా లజిస్ట్ డాక్టర్ కే రాజ సుబ్బా రెడ్డి మాట్లాడుతూ గర్భంలో ఉన్న పరిస్థితులు, బయట పరిస్థితులు వేరుగా ఉంటాయన్నారు. ఈ బిడ్డకు సాధ్యమైనంత వరకు మంచి ఆరంభం ఇవ్వాలని సంకల్పించామన్నారు. అపోలో క్రేడల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్సీనియర్ కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్, పీడియాట్రిషియన్ డాక్టర్ కృష్ణ స్వరూప్ రెడ్డి మాట్లాడుతూ నవజాత శిశువులను సంరక్షించడం అపోలో క్రేడల్ వైద్యుల ప్రత్యేక నైపుణ్యంగా మారిందని నిస్సంకోచంగా చెప్పవచ్చన్నారు. ఎన్ఐసీ యూ బృందంలో డాక్టర్ కృష్ణ స్వరూప్ రెడ్డి, డాక్టర్ రాజ సుబ్బారెడ్డి, డాక్టర్ పీ శివకుమార్ రెడ్డి ఉన్నారు. ప్రసూతి మరియు గైనకాలజీ బృందంలో డాక్టర్ వివీ బింద్రా, డాక్టర్ అర్చనా రెడ్డి, డాక్టర్ శ్వేతా పని చేశారు.

## వర్షాలతో కొట్టుకుపోయిన మట్టి రోడ్డును త్వరగా మరమ్మతులు చేయాలి

### ప్రజాబంధు జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం..

**గంభీరావుపేట ఆగస్టు 24 (జనం సాక్షి):** ఆదివారం రోజు గంభీరావుపేట మండల కేంద్రంలో ఇండియా ప్రజాబంధు జిల్లా అధ్య క్షులు దోసల చంద్రం మాట్లాడుతూ మట్టి రోడ్డు తెగిపోయిన దానిని గురించి లింగన్న పేట సిద్దిపేట ప్రధాన రహదారి నుంచి మధ్యలో ఉన్న వాగులో తాత్కాలికంగా పోసిన మట్టి రోడ్డు వాగు ఉధృతంగా రావడంతో మట్టి రోడ్డు కొట్టుకుపోయి కామారెడ్డి సిద్దిపేట రాకపోకలు నిలిచిపోయాయి... గత సంవత్స రం తాత్కాలికంగా మట్టి పోసిన రోడ్డు తెగిపోయిన విషయం మండల ప్రజా ప్రతినిధులకు బ్రిడ్జి పనులపై ప్రజా ప్రతినిధులు నాయకులు మాట్లాడలేని పరిస్థితి వ్యవసాయ రైతులకు ప్రజలకు ప్రయాణికులకు ఇబ్బందులు జరుగుతున్న ,స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు నిర్లక్ష్యం వల్లనే బ్రిడ్జి కూల్చివేసిన ఘటన గంభీరావుపేట మండల కేంద్రంలో చోటు చేసుకోవడం జరిగింది , అనిగత ప్రభుత్వం చేసిన తప్పుల వల్లనే ఈరోజు రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని స్థానిక ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆయన కూడా ఇంతవరకు బ్రిడ్జిని సందర్శించిన దాఖలాలు పోలేవు బ్రిడ్జి పనులను తొందరగా చేపట్టే విధంగా చర్యలు, తీసుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉందని తెలిపారు, స్థానిక కాం ట్రాక్టర్ అతి త్వరలో మట్టి పోసి ప్రజలకు అంతరాయం కలవకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తొందర్లో బ్రిడ్జి పనులను చేపట్టాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధికారప్రతినిధి రఘు,నాయకులు బరిగేలసురేష్ పాల్గొన్నారు.

## నవ రాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

### జినోమ్ వ్యాలీ సిఐ గోపగాని గురువయ్య

**శామీర్ పేట్ ( జనంసాక్షి) :** జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో గణేష్ మండపాల నిర్వాహకులు గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించు కోవాలని స్థానిక జినోమ్ వ్యాలీ సిఐ గోపగాని గురువయ్య మండపాలు ఏర్పాటు చేసుకోబోయే నిర్వాహకులకి తెలిపారు. గణేష్ నవరాత్రులను దృష్టిలో పెట్టుకొని మండపం ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్లైన్ లో పోలీస్ వారికీ తప్పని సరిగా సమాచారం ఇవ్వాలని సూచన చేశారు, ఆన్లైన్ ద్వార సమాచారం ఇస్తె భద్రత కల్పించడం సులువు అవుతుంది అని ఆయన తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం మనసాంప్రదాయం, వినాయక చవితి ఘనంగా అందరు జరుపుకోవాలని, విద్యుత్ కనెక్షన్ తీసుకొనే సమయంలో నాణ్యమైన వైరు ఉపయోగించాలని షార్ట్ సర్క్యూట్‌కి గురి కాకుంటా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అయన కోరారు.సౌండ్ పొల్యూషన్ ద్వారా స్థానిక ప్రజలకు ఇబ్బంది కలగ కుండా చూసుకొని వినాయక పూజలు చేసుకోవాలని, అదేవిదంగా మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని,మండపం నిర్వాహకులకి సిఐ గోపగాని గురువయ్య సూచనలు చేశారు.

## సౌరవ్ గంగూలీ క్రికెట్‌లో కొత్త ఇన్నింగ్స్

భారత మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తన కెరియర్‌లో కొత్త అధ్యా యాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు పరిపాలనలో నిమగ్నమైన గంగూలీ, ఇప్పుడు హెడ్ కోచ్‌గా అవతరించబోతున్నారు. దక్షిణాఫ్రికా టీ20 లీగ్ 2026 సీజన్ కోసం ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టు ఆయనను హెడ్ కోచ్‌గా నియమించింది. ఈ నిర్ణయాన్ని ప్రిటోరియా క్యాపిటల్స్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. డిసెంబర్ 26 నుంచి ప్రారంభ మయ్యే టీ20 నాల్గవ సీజన్‌లో గంగూలీ ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. మాజీ ఇంగ్లాండ్ క్రికెటర్ జోనాథన్ ట్రాట్ స్థానంలో ఆయన నియామకం జరిగింది. 53 ఏళ్ల గంగూలీ గత సంవత్సరం నుంచి ప్రిటోరియా క్యాపిటల్స్ మాతృ సంస్థ జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌కు క్రికెట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఐపీఎల్, డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు క్రికెట్ డైరెక్టర్‌గా, మెంటార్‌గా కూడా ఆయన సేవలు అందించారు. గత సీజన్‌లో ట్రాట్ నాయకత్వంలో ప్రిటోరియా క్యాపిటల్స్ ఏడు మ్యాచ్‌లు గెలిచి నాకౌట్‌కు చేరలేకపోయింది. దీంతో ట్రాట్ తప్పుకోవడం తో గంగూలీకి అవకాశం దక్కింది. సెప్టెంబర్ 9న జరిగే ఆటగాళ్ల వేలంలో జట్టును బలోపేతం చేసే బాధ్యత ఆయనపై ఉంటుంది. 2026 టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచి డిసెంబర్ 26 నుంచి జనవరి 25 వరకు లీగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రిటోరియా క్యాపిటల్స్ గంగూలీ నాయకత్వం లో విజయాలు సాధిస్తామని ఆశిస్తోంది.

## ఛతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు

భారత జట్టు సీనియర్ బ్యాట్స్‌మెన్ ఛతేశ్వర్ పుజారా ఆదివారం అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. సోషల్ మీడియా ద్వారా తన రిటైర్‌మెంట్‌ను ప్రకటించిన ఆయన, భారత జెర్సీ ధరించి జాతీయ గీతం పాడడం, మైదానంలో అద్భుత ప్రదర్శనలు ఇవ్వడం తనకు అమూల్య అనుభవాలని వెల్లడించాడు. అయినప్పటికీ ప్రతిదీకి ముగింపు ఉంటుందని, భారత క్రికెట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో కామెంటేటర్‌గా కనిపించిన పుజారా, చివరిసారి జూన్ 2023లో ఇంగ్లాండ్‌లో టెస్ట్ ఆడాడు. ఓవల్‌లో జరిగిన 2023 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా ఓడించిన మ్యాచ్ ఆయన ఆఖరి ఆటగా నిలిచింది. పుజారా తన కెరీర్‌లో 103 టెస్టులు, ఐదు వన్డేలు ఆడి, 7,195 టెస్ట్ పరుగులు (43.61 సగటు), 19 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలతో రాణించాడు. అత్యుత్తమ స్కోరు 206.

# ముక్కలుగా చేసి... మూసిలో వేసి

## భార్యను క్రూరంగా హత్యచేసిన భర్త

- వివరాలు వెల్లడించిన మల్కాజ్‌గిరి డీసిపి పి.వి.పద్మజ
- మేడిపల్లి దారుణం వెనక ... నమ్మలేని నిజాలు
- కామారెడ్డి గూడలో విషాదఛాయలు
- ఇంటికి తాళం వేసి పరారీ అయిన నిందితులు కుటుంబ సభ్యులు



హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఆ రాత్రి దుఃఖం చీకటై కమ్మింది. స్వాతి (22), ఐదు నెలల గర్భంతో కలలు నేసిన యువతి, ప్రేమ వివాహం చేసుకున్న భర్త మహేందర్ రెడ్డి చేతిలో కిరాతకంగా హత్యకు గురైంది. ఆమె శరీరం ముక్కలై మూసీ నదిలో కలిసింది. ఆర్య సమాజంలో ప్రేమ ఒట్టుతో బంధం కాసిన వారి కాపురం, బాలాజీ హిల్స్‌లో ఆశల గూడై మొదలైంది. కానీ, అనుమానాలు గొడవలై, హాక్సా బ్లేడ్‌తో స్వాతి జీవన రాగం ఆగిపోయింది. అక్కకు అబద్ధం చెప్పి, పోలీసులను ఏమార్చిన మహేందర్, చివరకు అదుపులోకి వచ్చాడు. కామారెడ్డి గ్రామంలో తల్లిదండ్రుల కన్నీటి ఆక్రందన ఆకాశాన్ని తాకింది. మహేందర్ కుటుంబం తాళం వేసి పరారైంది. స్వాతి కలలు, ఆ శిశువు ఊపిరి మౌనమై, సమాజం గుండెలో దుఃఖం చీకటిగా నడిచింది. న్యాయం కోసం పోలీసులు గాలిస్తున్నా, స్వాతి ఆత్మ కన్నీరై మిగిలింది.

**బోడుప్పల్, ఆగస్టు 24 (జనం సాక్షి) :** హైదరాబాద్‌లోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బోడుప్పల్‌లో గర్భవతి భార్య స్వాతి (22)ని భర్త సామల మహేందర్ రెడ్డి కిరాతకంగా హత్య చేసి, ఆమె శరీరాన్ని ముక్కలుగా నరికి మూసీ నదిలో పడేసిన దారుణ ఘటన ఆగస్టు 23, 2025న వెలుగులోకి వచ్చింది. మల్కాజ్‌గిరి డీసీపీ పి.వి.పద్మజ మీడియాకు వివరాలు తెలియ జేస్తూ, ఈ హత్య పథకం ప్రకారం జరిగినట్లు నిర్ధారించారు. వికారాబాద్ జిల్లా కామారెడ్డి గూడకు చెందిన స్వాతి, మహేందర్ రెడ్డిలు 2024లో కూకట్‌పల్లి ఆర్య సమాజ్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. బోడుప్పల్‌లోని బాలాజీ హిల్స్‌లో అద్దె ఇంట్లో కాపురం పెట్టి, మొదటి నెల సంతోషంగా గడిచినప్పటికీ, తర్వాత తరచూ గొడవలు మొదలయ్యాయి. స్వాతి పంజా గుట్టలోని ఎబెక్స్ కాల్ సెంటర్‌లో మూడు నెలలు పనిచేసింది, కానీ మహేందర్ ఆమె కదలిక లపై అనుమానంతో ఉద్యోగం మాన్పి ంచాడు. గతంలో స్వాతి మూడు నెలల గర్భవతి గా ఉన్నప్పుడు బలవంతంగా అబార్షన్ చేయించా డు, ఆ తర్వాత గ్రామంలో పెద్దలు పంచాయతీ పెట్టి సమస్యను సర్దుబాటు చేశారు. ఇటీవల స్వాతి మళ్లీ ఐదు నెలల గర్భవతిగా ఉండగా, వైద్య పరీక్షల కోసం వికారాబాద్ వెళ్తానని చెప్పడంతో మరోసారి గొడవ జరిగింది. 23, శని వారం సాయంత్రం మహేందర్ బోడుప్పల్‌లోని హార్డ్‌వేర్ షాపులో హాక్సా బ్లేడ్ కొనుగోలు చేసి, ఇంటికి చేరాడు. గొడవలో స్వాతిని గట్టిగా కొట్టడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అప్పుడు హాక్సా బ్లేడ్‌తో ఆమె కాళ్లు, చేతులు, మొండెం వేరు చేసి, మూడు కవర్లలో ప్యాక్ చేసి మూసీ నదిలో మూడు సార్లు వెళ్లి పడేశాడు. హత్య తర్వాత, స్వాతి అక్క చంద్రకళకు ఫోన్ చేసి "స్వాతి కనిపించడం లేదు" అని అబద్ధం చెప్పాడు. చంద్రకళ భర్త గోవర్ధన్ రెడ్డికి అనుమా నం రావడంతో, మహేందర్‌తో కలిసి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా, అక్కడి పోలీసులు మేడి పల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేయమన్నారు. ఇంటికి వెళ్లిన పోలీసులు మొండెం గుర్తించి, మహేందర్ ను అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాన్ని ఒప్పుకున్నాడు. పోలీసులు ఐపీసీ సెక్షన్ 302, 201 కింద కేసు నమోదు చేసి, మృతదేహ భాగాల కోసం ప్రతాపసింగారం వద్ద మూసీలో గాలింపు చేపట్టారు, కానీ కేవలం ఛాతీ భాగం మాత్రమే లభించింది. స్వాతి కుటుంబం వికారా బాద్‌లోని కామారెడ్డిలో విషాదంలో మునిగింది. స్వాతి తల్లిదండ్రులు, మహేందర్ తమ కూతురిని మోసం చేసి, హింసించి, హత్య చేశాడని ఆరోపించారు. మహేందర్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పరారీ అయ్యారు. వికారా బాద్ పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటు చేసి ఉద్రిక్తత నివారిం చారు. ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించే ందుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు. ఏసీపీ చక్రపాణి, సీఐ గోవింద రెడ్డి, ఎస్సైలను డీసీపీ పద్మజ అభినందించారు.



**మొత్తం బాడీ మాయం చేయాలని...**

మూడుసార్లు మూసీకి వెళ్లి వచ్చిన తర్వాత మహేందర్ రెడ్డి తన చెల్లికి కాల్ చేశాడని.. తన భార్య కనిపించడం లేదని ఆమెకు చెప్పాడని అన్నారు. మహేందర్ రెడ్డి ఫోన్ చేసిన వెంటనే అతడి బావ ఇంటికి వచ్చాడని చెప్పారు. మహేందర్ రెడ్డి బావకు అనుమానం వచ్చిందని తెలిపారు. అతని సూచన మేరకు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కంప్లయింట్ ఇచ్చి, ఏం తెలియనట్టు నటిద్దామని మహేందర్ రెడ్డి ట్రై చేశాడని పేర్కొన్నారు. కానీ మా ఇన్‌స్పెక్టర్ ఏదో జరిగి ఉంటుందని అనుమానించాడని తెలిపారు. అందుకే మహేందర్ రెడ్డిని వెంటపెట్టుకుని ఇంటికి వెళ్లాడని చెప్పారు. ఇంట్లో తల, కాళ్లు, చేతులు లేని మృతదేహం గుర్తించామని తెలిపా రు. మొండానికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నా మని పేర్కొన్నారు. మిగిలిన శరీర భాగాల కోసం మూసీలో గాలిస్తున్నామని తెలిపారు. కీలక ఆధారాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని పేర్కొన్నారు.

# వైభవంగా పురిమళ్ల ఫౌండేషన్ వార్షికోత్సవం

- కథల, కవితల సంకలనాలు ఆవిష్కరణ
- బాల కథలకు, కవులకు, విజేతలకు నగదు పురస్కారాలు అందజేత
- పురిమళ్ల సునంద సాహిత్య సేవ అద్వితీయం
- ప్రముఖ కవి మువ్వా శ్రీనివాసరావు



**ఖమ్మం, ఆగస్టు 24 (జనం సాక్షి) :** ఖమ్మంలోని ప్రముఖ సాహిత్య సంస్థ పురిమళ్ల ఫౌండేషన్ 7వ వార్షికోత్సవ మహోత్సవం ఆదివారం మంచికంటి మీటింగ్ హాల్‌లో వైభవంగా జరిగిం ది. ఈ సభలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో బహు మతుల కు ఎంపికైన కథల, కవితల పుస్తకాన్ని, బాల కవులు రాసిన కథలు, కవితల తో రూపొందిన సంకలనాన్ని అతిథులు ఆవిష్కరించారు. తొలుత ముఖ్య అతిథి, ప్రముఖ కవి మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ పురిమళ్ల సునంద చేస్తున్న సాహిత్య సేవ అభినందనీయమని, అద్వితీయమని పేర్కొన్నారు. ఏడేళ్లుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వర్ధమాన రచయిత లతో పాటు, బాల కవులను, కథకులనూ పోత్సహించడం అభినందించదగ్గ విజయమని పేర్కొన్నారు. అనంతరం ప్రముఖ కవులు రవిమారుత్, ఆనందాచారి, పుప్పాలకృష్ణమూర్తి, ప్రముఖ రచయిత్రులు రమాదేవి కులకర్ణి, మూర్తి శ్రీదేవి, విశ్మైక ప్రసంగిస్తూ పురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు పురిళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు చేస్తున్న సేవలను కొనియాడారు. పురిమళ్ల ఫౌండేష న్ ఉద్దేశ్యాన్ని, లక్ష్యాలను వ్యవస్థాపకులు పురిమళ్ల సునంద వివరించారు. కథల, కవితల పుస్తకాన్ని అక్షరాల తోవ నిర్వాహకులు రాచమల్ల ఉపేందర్ సమీక్షించారు. తొలుత తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీతంతో సభ ప్రారంభమైంది.

**పురస్కారాలు ప్రదానం**

ప్రతి ఏటా అందచేస్తున్న భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం స్మారక పురస్కా రాన్ని ప్రముఖ రచయిత మాల్యశ్రీకి అతిథుల చేతుల మీదుగా అందచేసి సన్మానించారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన కథకులకు, కవులకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఆ తర్వాత బాలసాహిత్యంలో రాణించి పోటీల్లో విజేతలకు బాల కవులకు, కథలకు సన్మానం చేశారు. అనంతరం విజేతలు తమ స్పందనలు తెలిపారు. ఈ సభకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి కవులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అక్షరాల తోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్, కవయిత్రి తాళ్ళూరి లక్ష్మీ, కవులు దేవేంద్ర, కన్నెగంటి వెంకటయ్య, సయ్యద్ షఫీ, పోతగాని సత్యనారాయణ, కొత్తపల్లి శేషు, కపిల రాంకుమార్, కంచర్ల శ్రీనివాస్, మేడగాని శేషగిరి, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఐనాల సైదులు, కోంద్రు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం
25 ఆగస్టు 2025

# దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు కేటీఆర్ సవాల్
- తన 20 నెలల పాలన చూపించి ఉపఎన్నికలకు వెళ్లగలిగే ధ్కెర్యం సీఎం రేవంత్‌కు ఉందా?
- కేసీఆర్ హయాంలో జోడెద్దుల్లా దూసుకుపోయిన అభివృద్ధి, సంక్షేమం
- నేడు హైడ్రా అరాచకాలతో హైదరాబాద్ వృద్ధి అతలాకుతలం
- ఇది బీఆర్ఎస్ పదేళ్ల పాలన వర్సెస్ కాంగ్రెస్ 20 నెలల పాలన
- శేరిలింగంపల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



మారిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందని ఆయన వ్యాఖ్యానించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. నాయకులు మోసం చేసినా, కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకున్నారని కేటీఆర్ ప్రశంసించారు. కాంగ్రెస్ నాయకుల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే హైడ్రా పనిచేస్తుందని ఆరోపించారు. హైడ్రా అరాచకాలతోనే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పూర్తిగా కుప్పకూలిందని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పుల కంటే ఎక్కువ అప్పులను కేవలం 20 నెలల కాలంలోనే చేసిన రేవంత్ రెడ్డికి తాను చేసిన అభివృద్ధిని చెప్పుకునే దమ్ముందా అని కేటీఆర్ నిలదీశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోయిందని కేటీఆర్ అన్నారు. 2014లో గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉండేవారని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎం అయిన ఆరు నెలల్లోనే తీవ్ర విద్యుత్ సమస్యను పూర్తిగా పరిష్కరించి, ఇళ్లలో, షాపుల్లో కనిపించే ఇన్వర్టర్లు, జనరేటర్లను కనిపించకుండా చేశారని చెప్పారు. హైదరాబాద్‌ను కులం, మతం, ప్రాంతం పేరు మీద రాజకీయాలు చేయకుండా, అన్నదమ్ములుగా ఏ పంచాయతీ లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసి చూపించామని అన్నారు. హిందూ ఆడబిడ్డలకు దసరా కానుకలు, ముస్లిం పేదలకు రంజాన్ తోఫాలు, క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్టులు ఇచ్చి పండుగలకు ప్రాధాన్యతనిచ్చినట్టు తెలిపారు. తెలంగాణకు గుండెకాయగా హైదరాబాద్‌ను కేసీఆర్ గారు మార్చారని, అందుకే 2023లో ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా కాంగ్రెస్‌కు రాకుండా, మొత్తం గులాబీ జెండాకే నగర ప్రజలు ఓట్లుశారని అన్నారు. హైడ్రా అరాచకాలతో హైదరాబాద్ నగర వృద్ధి అతలాకుతలమైందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి అక్రమంగా కట్టిన ఇంటిని కూల్చే దమ్ము హైడ్రాకు ఉందా అని ప్రశ్నించారు. పేదల ఇళ్లు కూలగొడుతున్న హైడ్రా, పెద్దల జోలికి మాత్రం వెళ్లడం లేదని మండిపడ్డారు. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే మహిళ హైడ్రా తన ఇల్లు కూల్చివేస్తుందన్న భయంతో ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే హైడ్రా పని చేస్తుందని ఆరోపించారు. పేదవాళ్ల కడుపు కొట్టడం, బిల్డర్లను బెదిరించడం, ఆర్ఆర్ టాక్స్ పేరుతో వసూళ్లు చేస్తున్నారని ప్రధానమంత్రి స్వయంగా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఎన్నడూ రియల్ ఎస్టేట్‌లో నాయకులు వేలు పెట్టలేదని, కబ్జాలు, గూండాగిరి చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కానీ 20 నెలల్లోనే హైడ్రా పేరుతో కాంగ్రెస్ నాయకులు అరాచకం సృష్టించారని దుయ్యబట్టారు. కోర్టు ఆర్డర్ ఉన్నా కూడా పట్టించుకోకుండా పేదల ఇళ్లు కూల్చివేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్లలో రెండు లక్షల 85 వేల కోట్ల అప్పు చేస్తే, రేవంత్ రెడ్డి 20 నెలల్లోనే రెండు లక్షల 20 వేల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. కేసీఆర్ ఆ అప్పుతో హైదరాబాద్‌లో 42 ఫ్లైఓవర్లు, అత్యాధునిక ఆసుపత్రులు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు కట్టారని, కానీ రేవంత్ ఒక్క కొత్త బ్రిడ్జి కానీ, మోరీ కానీ కట్టిండా అని ప్రశ్నించారు. కేసీఆర్ 70 లక్షల మంది రైతు ఖాతాల్లో 70 వేల కోట్లు వేస్తే, రెండు లక్షల కోట్ల అప్పు చేసిన రేవంత్ ఏం చేశారని నిలదీశారు. 200 ఉన్న పెన్షన్‌ను కేసీఆర్ ప్రభుత్వం 2000 చేస్తే, రేవంత్ ఏం చేసిందని అడిగారు. శేరిలింగంపల్లితో పాటు పార్టీ మారిన మిగతా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రజల కోసం కాకుండా, తమ సొంత లాభం కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లారని కేటీఆర్ ఆరోపించారు.

## కెసిఆర్ వ్యక్తి కాదు వ్యవస్థ

**శేరిలింగంపల్లి, ఆగస్టు 24 (జనంసాక్షి) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడంతోపాటు తెలంగాణ రాష్ట్ర వైభవాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టిన ఘనత తెలంగాణ ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ కి దక్కుతుందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ నరేన్ గార్డెన్ లో ఆదివారం నిర్వహించిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో కేసీఆర్ అండదండలతో ఎమ్మెల్యేగా గెలిచి నేడు పార్టీని మారే దగాకూరు కాంగ్రెస్ అడుగులకు మడుగులొత్తుతున్న స్థానిక ఎమ్మెల్యేకు శేరిలింగంపల్లి ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అభిమానులు ఇక్కడ కేరింతలు కొడితే సరిపోదని రానున్న పంచాయతీ ఎన్నికలలో గ్రామాలకు వెళ్లి పార్టీని తిరుగులేని శక్తిగా గెలిపించాల్సిన బాధ్యతను భుజాన వేసుకోవాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధించిందని, దేశంలోనే అత్యధిక జిడిపి ని కలిగిన రాష్ట్రాలలో ఒకటిగా నిలిచిందన్నారు. వేలాదిమంది పార్టీ కార్యకర్తలు కష్టపడితే ఒక ఎమ్మెల్యే గెలుస్తాడని, కానీ అధికారం కోల్పోగానే ప్లేటు ఫిరాయించే అవకాశవాదులను ప్రజలు గుర్తించి రాజకీయంగా బొంద పెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నప్పటికీ సరైన ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టలేదని, నేడు పంటలకు ఉపయోగపడే యూరియా కోసం రైతు చెప్పుల వద్ద కాపలా ఉండే పరిస్థితి ఉందని, ఇక ప్రభుత్వ ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం అని, కనీసం పిఆర్సి, డిఎ లను ప్రకటించే సత్తా లేని దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన విమర్శించారు.

## కాంగ్రెస్ వైఫల్యంతోనే రోడ్లపైకి రైతులు

- ప్రధాన రహదారిపై ఆందోళన చేసిన ఎమ్మెల్యే



**శివ్వంపేట ఆగస్ట్ 24 (జనంసాక్షి):** రైతులను అడుక్కునే పరిస్థితికి తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన శివ్వంపేట సొసైటీ బ్యాంకు వద్ద రైతులకు యూరియా కొరతతో ఒక్క రైతుకు ఒక్క బస్తా యూరియా ఇస్తున్నారనీ, దీంతో రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి గంటల తరబడి క్యూలైన్లో నిల్చుండి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీత రెడ్డి రైతులు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలతో పిఏసీఎస్ బ్యాంకు ఎదుట నర్సాపూర్ తూప్రాన్ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ప్రధాన రహదారిపై వాహనాలు ఎక్కడికి ఎక్కడ నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ మధుకర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

## విలువలకు కట్టుబడి జీవించిన మహనీయుడు 'సురవరం'

- సురవరం సుధాకర్ రెడ్డికి భట్టి నివాళులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** విలువలకు కట్టుబడి జీవించిన మహనీయుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ముఖ్దూం భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కేబినెట్ సహచ మంత్రులు సుధాకర్‌రెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చివరి శ్వాస వరకు విలువలకు కట్టుబడి జీవించిన మహనీయుడు, గొప్ప కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి లాల్ సలాం అని తెలిపారు. శోకతప్త హృదయంతో వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నుంచి సీపీఐ జాతీయ కార్యదర్శిగా మూడుసార్లు పనిచేయడం అంటే ఎంతటి నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదల ఉంటేనే సాధ్యం. సుధాకర్ రెడ్డి గారు చిన్ననాటి నుంచే ప్రజల జీవనస్థితిగతుల్లో మార్పు రావాలని కాంక్షించారని, సీపీఐలో కీలక నేతగా ఉన్నప్పటికీ అధికారపక్ష నేతలతో సంప్రదింపులు జరిపి ప్రజల కోసం పనిచేసేవారని గుర్తు చేశారు. 2004లో విద్యుత్ పోరాటంలో కాంగ్రెస్ పార్టీతో కలిసి ఆయన చేసిన పోరాటం మరువలేనిదని, ఆ విద్యుత్ పోరాటం అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో సురవరం సుధాకర్ రెడ్డి ఆలోచనలు ప్రతిఫలించాయని తెలిపారు. వారి సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎప్పుడూ పరుష పదజాలం వాడలేదని, ఎవరినీ శత్రుభావంతో చూడలేదని తెలిపారు. వారిని నేను అత్యంత అభిమానం గల నాయకుడిగా చూస్తానని, వారికి గౌరవం ఇవ్వాలన్న ఆలోచనతోనే అంతిమ సంస్కారాలు అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి, యావత్ కేబినెట్ నిర్ణయించిందని తెలిపారు.

## యూరియా ఇవ్వలేని స్థితిలో రేవంత్ ప్రభుత్వం

- వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ కు వాత పెట్టాలి
- మాజీ మంత్రి దయాకర్ రావు



**పాలకుర్తి, ఆగస్టు 24(జనంసాక్షి) :** యూరియా బస్తాల కోసం గంటల తరబడి రైతాంగం నిలబడాల్సిన పరిస్థితి కాంగ్రెస్ పాలన తీసుకువచ్చిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని దర్దేపల్లి, చీమలభాయితండా, మంచుప్పుల, దుబ్బతండా (ఎస్పీ) గ్రామాల కాంగ్రెస్ పార్టీ నుండి ముఖ్య నాయకులు సిద్ధం యుగెందర్, తాడిశెట్టి శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ రాంధన్, బన్సీలాల్, మోకాటి యాదగిరి, వేల్పుల సోమనాదం, బాదావత్ ప్రశాంత్, వెంకటేష్ పాటు 250 మంది బీఆర్ఎస్ లో దయాకర్ రావు సమక్షంలో చేరగా, వారికి గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ అనాడు కేసీఆర్ హాయంలో మోటర్లు కాలలేదు. ట్రాన్స్ ఫార్మర్లు కాలలేదు. పించన్లు ఇస్తే పెద్దకొడుకని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అదికారంలోకి వచ్చింది రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిండు. తెల్లారి లేస్తే చాలూ రేవంత్రెడ్డిని జనం తిట్లపురాణం మొదలు పెడుతున్న దుస్థితి ప్రభుత్వ అధినేతకు దక్కిందని విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు కర్రు కాల్చి వాతపెట్టాలని అన్నారు. కష్టకాలంలో మనతో కలిసి వస్తున్న కార్యకర్తను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేనెక్కడికి పోను పాలకుర్తి గడ్డ దయన్న అడ్డా ఇది అని అన్నారు. ఇక్కడే ఉంటా నేను ఓడిపోవడం మేలైందని, దీంతో మన విలువ జనాలకు తెలిసిందని తెలిపారు. పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, వల్మిడి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం, బమ్మెర పోతన మందిరాలను కేసీఆర్ హాయంలో కోట్లు నిధులు తెచ్చి రూపురేఖలు మార్చినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో కోట్లు నిధులు సీసీరోడ్లు, మారుమూల గ్రామాలకు బీటీ, సిసి రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యకమంలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పుస్కూరి శ్రీనివాసరావు, మాచెర్ల ఎల్లయ్య, కారుపోతుల వేణు, బొమ్మగాని కొంరయ్య, తాడెం రవి, వెంకటయ్య, దారావత్ బాలూనాయక్, పాలకుర్తి రాఘవరావు, వాసూనాయక్, తదితరులు ఉన్నారు.

## విషప్రయోగం నిందితుడు రాజేందర్ అరెస్టు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తాగునీటిలో పురుగులమందు కలిపి విషప్రయోగం చేసిన నిందితుడు రాజేందర్ ను ఆదివారం అరెస్టు చేసినట్లు డిఎస్పి సంపత్ రావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ లో త్రాగునీటిలో విషపదార్థం కలిపిన ఘటనపై భూపాలపల్లి మండల విద్యాధికారి అజ్మీరా దేవానాయక్ ఇచ్చిన పిటిషన్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. ఈ మేరకు విచారణ ప్రక్రియలో నిందితుడిగా గుర్తించబడిన సైన్స్ టీచర్ పెండ్యాల రాజేందర్ ను అదుపులోకి తీసుకుని, విచారణ జరిపి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగించే ఈ తరహా దారుణ చర్యలకు పాల్పడిన వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది ఉండదని, కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేసులో ఇతరుల ప్రమేయం కూడా ఉండే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నామని, దర్యాప్తు పూర్తి స్థాయిలో కొనసాగుతోందని, తొందరలో పూర్తి వివరాలు తెలియజేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐ నరేష్ కుమార్, ఎస్సై సాంబమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతుల పేర అక్రమంగా పలుగురాళ్ల వ్యాపారం

- వడ్డపల్లి గ్రామపంచాయతీ అనుమతులు ఉన్నయనేది నిజమేనా..!?
- నాంపల్లి మండలం పరిధిలో ఓ గిరిజన వ్యక్తిని ముందుంచి నడిపిస్తున్న తెల్లపలుగు..!?
- మక్కపల్లి వేబిల్స్ చూపించుకుంటూ నాంపల్లి పరిధిలో దందా





**మర్రిగూడ, ఆగస్టు 24 (జనం సాక్షి) :** అనుమతులు ఉన్నాయంటూ, అక్రమంగా పలుగురాళ్ల వ్యాపారం చేస్తూ, లక్షల రూపాయలు వెనకేసుకుంటున్న వ్యాపారుల దందా అంతాఇంతా కాదనే చెప్పుకోవాలి.!? ఎక్కడో మక్కపల్లి అనుమతులతో వేబిల్స్ తయారు చేసి, నాంపల్లి మండలంలో ఉన్న వేబిడ్జ్ దగ్గర వే బిల్స్ తీసుకుంటూ, ఈ దందా జోరుగా సాగుతుందనే చర్చ నడుస్తుంది.!? స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారుల అండదండలతో, వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అనేది తక్కువనే చెప్పుకోవాలి. రైతులను మభ్యపెట్టి ఈ దందా, ప్రతి రోజు జరుగుతూ, చివరి దశకు చేరిందని అనుకుంటున్నారు. సుమారు ఐదు సంవత్సరాలుగా, నడుస్తున్న ఈ అక్రమ పలుగు వ్యాపారానికి, ఓ రెడ్డి అధిపతి అయినప్పటికి, గిరిజన నాయకుడిని ముందుకు నెడుతున్నారు. ఇదే కాక నియోజకవర్గ స్థాయిలోని ఓ నాయకుడి పేరును బదునాం చేస్తూ, ఈ అక్రమ పలుగు దందా, కొనసాగుతుందని అనుకుంటున్నారు. అధికారులను సైతం తమ గుప్పెట్లో పెట్టుకొని, గడువు పూర్తయిన ఈ దందాకు పెద్ద ఎవరనేది అంతు చిక్కడం లేదనే చెప్పుకోవాలి. ఈ అక్రమ రవాణాపై, సపోర్ట్ చేస్తున్న అధికారులపై, ఆ నియోజకవర్గ ప్రజా ప్రతినిధిపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. నిరంతరం వాహనాల మోతలతో, శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యంతో, రోడ్లు డ్యామేజ్ చేస్తూ భారీ వాహనాలు భార్డర్ దాటుతున్నాయి. పట్టుకున్న పోలీసులకు వేరే ప్రాంతపు వేబిల్స్ చూపుతూ, దందా నడిపిస్తున్నారు. ఏది ఏమైనా నిజాయితీ గల మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పరిపాలనలో ఈ సంఘటన జరగటం అందరిని అర్చర్యానికి గురిచేస్తుంది. వెంటనే అధికారులు ఈ పలుగుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సూర్యాపేటకే మణిహారం 'జవహర్ నవోదయ'

- ఏడాదిలోపే పూర్తిచేయాలని మంత్రి ఉత్తమ్ ఆదేశం



**కోదాడ ఆగస్టు 24 (జనం సాక్షి):** సూర్యాపేట జిల్లా విద్యకే మణిహారం లాంటిది జోహార్ నవోదయ విద్యాలయ , రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కృషి వలన జిల్లాకు జవహర్ నవోదయ మంజూరు అయింది. దానిని కోదాడలో నిర్మించాలని నిర్ణయించారు. దాని నిర్మాణానికి సంబంధించి పనులు వేగవంతం చేయడానికి ఆదివారం మంత్రి ఉత్తమ్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నవోదయ విద్యాలయ సమితి రెండు సంవత్సరాల గడువు కేటాయించినా, పాఠశాల నిర్మాణాన్ని ఒక సంవత్సరంలోనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా భవనాల రూపకల్పన, ఆర్కిటెక్చరల్ డిజైన్లు మరియు నిర్మాణ పనుల వేగవంతంపై చర్చ జరిగింది. విద్యార్థులకు ఆకట్టుకునేలా , శిల్పకళా వైభవంతో భవనాలను నిర్మించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు కోసం కేటాయించిన 19.12 ఎకరాల భూమిని విద్యా భవనాలు, హాస్టళ్ళు, సిబ్బంది గృహాలు, ఆడిటోరియం వసతుల కోసం సమర్థవంతంగా వినియోగించాలని ఆయన సూచించారు. ప్రతి నిర్మాణం ప్రామాణికంగా, ఉత్తమ నాణ్యతతో ఉండాలని ఆయన ఆదేశించారు. కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి కూడా సమావేశంలో పాల్గొని, పిల్లల అనుకూలంగా మార్పులు చేయాలని సూచించారు. విద్యార్థుల భద్రత, సౌకర్యం, సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్, నవోదయ విద్యా సమితి హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బేరా, జవహర్ నవోదయ ఖమ్మం ప్రిన్సిపల్ కె. శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్ ఇతర అధికారులు పాల్గొన్నారు. కోదాడలోని కెఆర్ఆర్ డిగ్రీ కాలేజీ సమీపంలో 19.12 ఎకరాల స్థలంలో ప్రతిష్టాత్మక జవహర్ నవోదయ విద్యాలయం నిర్మాణం జరగనుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ.50 కోట్లు మంజూరు చేసింది. ఆమోదించిన గడువు సగానికి తగ్గించేలా మంత్రి ఆదేశించారు. కోదాడ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్య ఉచితంగా ఇంగ్లీష్ మాధ్యమంలో అందించబడుతుంది. సంవత్సరానికి 80మంది విద్యార్థులను చేర్చుకుంటారు. వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫార్మ్, చెప్పులు, బ్యాగులు, స్టేషనరీ – ఇవన్నీ ఉచితంగా అందించబడతాయి. విద్యార్థులు, సిబ్బంది కోసం పూర్తిగా నివాస వసతి కల్పించబడుతుంది. కోదాడ జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రతిరోజు సత్సంగుతో ప్రారంభమై, ,సాయంత్రం పర్యవేక్షణతో చదువు గంటలతో రోజు ముగుస్తుంది. ఈ షెడ్యూల్ విద్యా నాణ్యత, క్రమశిక్షణ, సమగ్ర అభివృద్ధి సాధనకు దోహదం చేస్తుంది. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పాఠశాల సమర్థవంతంగా, శ్రద్ధతో పనిచేయడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసి పూర్తి మద్దతు అందించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికలొస్తేనే బీజేపీది హిందూ-ముస్లిం కొట్లాట

- చొప్పదండిలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు
- జనహిత పాదయాత్ర తెలంగాణ భవిష్యత్ కోసమేనని ఉద్ఘాటన



**కరీంనగర్ బ్యూరో (జనంసాక్షి) :** ఎన్నికలొస్తేనే బీజేపీ నాయకులకు హిందూ ముస్లింల కొట్లాట గుర్తుకు వస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ అన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి, గంగాధరలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ జనహిత పాదయాత్రలో భాగంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. జనహిత పాదయాత్ర తెలంగాణ భవిష్యత్తు కోసం చేపట్టిన పాదయాత్ర అని, ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడానికే ఇది జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారురాలు భాగ్యమ్మ కళ్లలో ఆనందం చూసినప్పుడు మనసు ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే డబుల్ బెడ్ రూమ్ కల నెరవేరిందని, 40 లక్షల రేషన్ కార్డులు జారీ చేశామని గుర్తు చేశారు. ప్రజల సంతోషం పంచుకోవడానికే ఈ పాదయాత్రనని ఆయన తెలిపారు. ఎన్నికలు రాగానే హిందూ-ముస్లిం గొడవలు గుర్తుకు తెచ్చుకోవడం బీజేపీ నేతల అలవాటని, ఉదయం లేచిన దగ్గర నుంచి కులం-మతం గురించి మాట్లాడందే పూట గడవదని విమర్శించారు. దేవుడి పేరుతో ఓట్లు అడిగే బిచ్చగాళ్లు బీజేపీ నేతలేనని దుయ్యబట్టారు. కొండగట్టు అంజన్న పేరుతో బీజేపీ నేతలు ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారన్న అనుమానాలు ఉన్నాయని, రాహుల్ గాంధీ బయటపెట్టిన ఓటర్ జాబితా చూస్తే అది స్పష్టమవుతుందని చెప్పారు. మహాదేవపురంలో లక్షకు పైగా దొంగ ఓట్లు చేర్చడం, ఒకే అడ్రెస్‌పై వందల ఓట్లు, జీరో అడ్రెస్‌లపై వేల ఓట్లు ఉన్నాయని వివరించారు. ఒకే ఎపిక్ నెంబర్‌పై వేర్వేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, సన్న బియ్యం ఇస్తారని ఎవరూ ఊహించలేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని, వారి గురించి ఇక మాట్లాడాల్సిన అవసరమే లేదని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ నిజమైన బీసీ నాయకుడు కాదని, మున్నూరుకాపు సమాజానికి చెందిన బిడ్డగా ఆయన ఢిల్లీలో కిషన్‌రెడ్డికి అడుగులకు మడుగులొత్తుతున్నారని ఆరోపించారు. బీసీలకు 42% రిజర్వేషన్ల విషయమై ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఢిల్లీలో దాక్కున్నారని విమర్శించారు. బండి సంజయ్ భవిష్యత్ తరాలకు ద్రోహం చేస్తున్నారని ఆయన అన్నారు. దొంగ ఓట్ల సహాయంతో మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చారని, వెంటనే పదవి నుంచి దిగిపోవాలని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. "వోట్ చోర్"కి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేపడుతున్న ర్యాలీలకు విశేష ప్రజాదరణ లభిస్తోందని అన్నారు.

### ఎమ్మెల్యే కవ్వంపల్లికి పరామర్శ

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ ను కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు ఆదివారం పరామర్శించారు. ఐదు రోజుల కిందట ఎమ్మెల్యే రెండో సోదరుడు కవ్వంపల్లి రాజేశం అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. కరీంనగర్ లోని వాల్మీకి నగర్ లో గల కవ్వంపల్లి నివాసానికి ఇచ్చేసి రాజేశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370